





# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 11 సంచిక : 252 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ ) ప్రచురణ : కాకినాడ సోమవారం 19 మే 2025 వెల : 5/-రూ॥

VOLUME : 11 ISSUE :252 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAKINADA MON 19 MAY 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Kakinada, Visakhapatnam, Ongole Circulated by Srikakulam, Vizianagaram, Eluru, Vijayawada, Guntur, Nelloru, Chittur, YSR Kadapa, Kurnool, Anantapur


# డాక్టర్ గా మారిన మంత్రి నాదెండ్ల..!

- కొల్లిపరలో మంత్రి నాదెండ్ల మనోహర్ ఉచిత వైద్య శిబిరం ప్రారంభం
- గ్రామీణులకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించడమే లక్ష్యం
- శిబిరంలో 20 మంది నిపుణులైన వైద్యులు, 50 మంది సిబ్బంది సేవలు
- మంత్రి స్వయంగా రోగులతో మాట్లాడి, మందులు పంపిణీ
- త్వరలో రక్తనిధి కేంద్రం ఏర్పాటుకు మంత్రి హామీ





పెన్ పవర్ డెస్క్:రాజకీయ వేత్తగా, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రిగా నిత్యం ప్రజాసేవలో తలమునకలై ఉండే నాదెండ్ల మనోహర్, శనివారం కొల్లిపరలో ఓ కొత్త అవతారమెత్తారు. వైద్యుడిలా మారి, సామాన్య ప్రజలతో మమేకమై, వారి ఆరోగ్య సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకుంటూ, వారికి అండగా నిలిచారు. తెనాలి నియోజకవర్గం, కొల్లిపర మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో (సీహెచ్‌సీ) ఆయన చొరవతో ఏర్పాటు చేసిన మెగా ఉచిత వైద్య శిబిరం ఈ అపురూప దృశ్యానికి వేదికైంది.

**పేదలకు నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యం**

ఈ శిబిరాన్ని లాంఛనంగా ప్రారంభించిన అనంతరం మంత్రి మనోహర్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వానికి ప్రజల ఆరోగ్య పరిరక్షణే ప్రధాన ధ్యేయమని స్పష్టం చేశారు. "గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని ఉచితంగా అందించాలనే సదుద్దేశంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశాం. ఆర్థిక ఇబ్బందుల వల్ల గానీ, దూర ప్రాంతాలకు వెళ్లలేని కారణంగా గానీ వైద్య సేవలు పొందలేకపోతున్న ప్రజలు ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి" అని ఆయన పిలుపునిచ్చారు. ఈ భారీ వైద్య శిబిరంలో సుమారు 20 మంది వివిధ విభాగాల నిపుణులైన వైద్యులు, 50 మంది సహాయ సిబ్బంది పాల్గొని సేవలందించారు. స్త్రీల ఆరోగ్యం, చిన్నపిల్లల వైద్యం, చెవి-ముక్కు-గొంతు, కంటి, దంత, గుండె సంబంధిత వ్యాధులకు నిపుణులతో పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. ఎక్స్‌రే, స్కానింగ్ వంటి రోగ నిర్ధారణ పరీక్షలు, అవసరమైన వారికి చిన్నపాటి శస్త్రచికిత్సలు కూడా ఇక్కడే నిర్వహించారు.

**వైద్యుడిలా మారి.. రోగులతో మమేకం**

కేవలం ప్రారంభోత్సవానికే పరిమితం కాకుండా, మంత్రి మనోహర్ శిబిరం మొత్తం కలియదిరుగుతూ రోగులతో మమేకమయ్యారు. ఓపీ వద్ద బారులు తీరిన రోగుల వద్దకు స్వయంగా వెళ్లి, వారి ఆరోగ్య సమస్యలను ఓపికగా అడిగి తెలుసుకున్నారు.

వివరాలు 2లో..

## టీడీపీ కార్యకర్తపై దాడి... నందిగం సురేశ్ అరెస్ట్

- గతరాత్రి ఇసకపల్లి రాజు అనే టీడీపీ కార్యకర్తపై దాడి
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడి భార్య
- కేసు నమోదు చేసుకున్న తుళ్లూరు పోలీసులు
- నందిగం సురేశ్ ను అరెస్ట్ చేసి తుళ్లూరు పోలీస్ స్టేషన్ కు తరలింపు



పెన్ పవర్ డెస్క్:టీడీపీ కార్యకర్త ఇసకపల్లి రాజుపై దాడి కేసులో వైసీపీ మాజీ ఎంపీ నందిగం సురేశ్ ను పోలీసులు అరెస్ట్ చేశారు. అతడిని తుళ్లూరు పోలీస్ స్టేషన్ కు తరలించారు. గతరాత్రి అమరావతి రాజధాని పరిధిలోని ఉద్ధండరాయునిపాలెంలోకి ఓ కారు వేగంగా దూసుకువచ్చింది. దాంతో, ఆ కారు డ్రైవర్ ను టీడీపీ కార్యకర్త రాజు మందలించారు. ఈ నేపథ్యంలో, రాజుపై మాజీ ఎంపీ నందిగం సురేశ్ అనుచరులు దాడి చేసి, అతడిని సురేశ్ ఇంటికి బలవంతంగా తీసుకెళ్లినట్టు ఆరోపణలు ఉన్నాయి. అక్కడ రాజుపై నందిగం సురేశ్, అతడి సోదరుడు ప్రభుదాస్ దాడి చేశారని బాధితుడి భార్య లక్ష్మి తుళ్లూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

దాంతో తుళ్లూరు పోలీసులు నందిగం సురేశ్ తదితరులపై కేసు నమోదు చేసి, ఇవాళ అతడిని అరెస్ట్ చేశారు. సురేశ్ సోదరుడు ప్రభుదాస్, మరికొందరు బంధువుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. కాగా, నేడు నందిగం సురేశ్ ను అరెస్ట్ చేయడం పట్ల అతడి భార్య ఆగ్రహం వ్యక్తం చేసింది. తన భర్త అరెస్ట్ ను నిరసిస్తూ తుళ్లూరు పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టింది.

## విజయనగరంలో విషాదం.. కారులో ఊపిరి ఆడక నలుగురు చిన్నారుల మృతి



పెన్ పవర్ డెస్క్:విజయనగరం రూరల్: విజయనగరం కంటోన్మెంట్ పరిధిలోని ద్వారపూడి గ్రామంలో విషాదం చోటు చేసుకుంది. కారు లాక్ పడటంలో అందులో చిక్కుకున్న నలుగురు చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం ఉదయం నలుగురు చిన్నారులు ఆడుకునేందుకు బయటకు వెళ్లారు.

వివరాలు 2లో..

## హైదరాబాద్ గుల్జార్ హౌస్ అగ్నిప్రమాదంపై రాహుల్ గాంధీ స్పందన



- హైదరాబాద్ అగ్నిప్రమాదంలో 17 మంది మృతి, పలువురికి గాయాలు
- ఘటనపై రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే తీవ్ర విచారం
- సీఎం రేవంత్ రెడ్డితో ఫోన్లో మాట్లాడిన ఖర్గే
- బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి, క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష

వివరాలు 2లో..

## కూటమికి అనంతపురం మీద ప్రేమ ఉందా?

- అనంతపురం ఆర్డీటీ సంస్థకు నిధుల కొరత
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యమే కారణమన్న వైసీపీ
- ఆర్డీటీ ఎఫ్‌సీఆర్‌ఏ నిధులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్
- సేవా సంస్థపై రాజకీయ కుట్రలు చేస్తున్నారని శ్యామల ఆరోపణ
- కళ్యాణదుర్గంలో బైక్ ర్యాలీ, ఆర్డీవోకు వినతి పత్రం అందజేత

వివరాలు 2లో..




## తిరుపతిలో దళిత విద్యార్థి జేమ్స్‌పై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాను

- క్షీణించిన శాంతిభద్రతలకు ఈ ఘటనే నిదర్శనమన్న జగన్
- రాష్ట్రంలో దళితులపై దాడులు పెరిగిపోయాయని ఆందోళన
- పోలీసులపై అధికార పార్టీ నేతల తీవ్ర ఒత్తిడి: జగన్ ఆరోపణ
- ఫిర్యాదుదారులపైనే ఎదురు కేసులు బనాయిస్తున్నారన్న జగన్
- దాడి ఘటన నిందితులపై కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్

పెన్ పవర్ డెస్క్:తిరుపతిలో ఇంజినీరింగ్ విద్యార్థి జేమ్స్‌పై జరిగిన దాడిని వైసీపీ అధినేత జగన్ తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, దళితులు, బలహీన వర్గాలపై దాడులు నిత్యకృత్యంగా మారాయని మండిపడ్డారు. ఈ మేరకు సోషల్

వివరాలు 2లో..



## గాజాపై మరోసారి ఇజ్రాయెల్ నిప్పుల వర్షం... 66 మంది మృతి



- గాజాలోని పలు ప్రాంతాలపై ఇజ్రాయెల్ భీకర వైమానిక దాడులు
- శనివారం రాత్రి దాడుల్లో 66 మంది పాలస్తీనియన్ల మృతి
- మృతుల్లో ఏడుగురు చిన్నారులు, ఒకే కుటుంబానికి చెందిన 9 మంది
- ఖాన్ యూనిస్, ఉత్తర గాజా, జబాలియా శరణార్థి శిబిరాలపై దాడులు
- హమాస్ కాల్పుల విరమణను తిరస్కరించడం వల్లే దాడులన్న నెతన్యాహు

వివరాలు 2లో..

## జూన్ 1 నుంచి తెలుగు రాష్ట్రాల్లో సినిమా థియేటర్లు బంద్

- తెలుగు రాష్ట్రాల్లో జూన్ 1 నుంచి సినిమా థియేటర్లు బంద్...!
- అద్దె పద్ధతిలో థియేటర్లు నడపలేమని డిస్ట్రిబ్యూటర్లు స్పష్టీకరణ
- వసూళ్లలో వాటా (పర్సంటేజీ) విధానం అమలు చేయాలని డిమాండ్
- దిల్ రాజు, సురేష్ బాబుతో తెలుగు ఫిల్మ్ ఛాంబర్‌లో ఎగ్జిబిటర్ల భేటీ
- నిర్మాతలకు లేఖ ద్వారా తమ నిర్ణయం తెలియజేయాలని తీర్మానం




పెన్ పవర్ డెస్క్: తెలుగు చలనచిత్ర పరిశ్రమలో మరో కీలక పరిణామం చోటుచేసు కుంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని సినిమా ఎగ్జిబిటర్లు సంచలన నిర్ణయం తీసుకున్నారు. జూన్ 1వ తేదీ నుంచి థియేటర్లను నిరవధికంగా మూసివేయాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. ప్రస్తుతమున్న అద్దె (రెంటల్) పద్ధతిలో థియేటర్లను నడపడం తమకు సాధ్యం కావడం లేదని, కేవలం సినిమా వసూళ్లలో వాటా (పర్సంటేజీ) పద్ధతిని అమలు చేస్తేనే థియేటర్లను కొనసాగిస్తామని వారు స్పష్టం చేశారు.ఈ రోజు (ఆదివారం) హైదరాబాద్‌లోని తెలుగు ఫిల్మ్ ఛాంబర్ కార్యాలయంలో తెలుగు రాష్ట్రాల ఎగ్జిబిటర్ల ప్రతినిధులు సమావేశమయ్యారు. ఈ సమావేశానికి ప్రముఖ నిర్మాతలు దిల్ రాజు, డి. సురేష్ బాబు కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎగ్జిబిటర్లు తమ సమస్యలను, ఆర్థిక ఇబ్బందులను నిర్మాతలకు వివరించినట్లు సమాచారం.థియేటర్ల నిర్వహణ ఖర్చులు పెరిగిపోయాయని, అద్దె పద్ధతి వల్ల తాము తీవ్రంగా నష్టపోతున్నామని ఎగ్జిబిటర్లు ఆవేదన వ్యక్తం చేశారు. "అద్దె ప్రాతిపదికన థియేటర్లను ఇకపై నడిపించలేం. మాకు పర్సంటేజీ రూపంలోనే వాటా కావాలి. అప్పుడే మాకు గిట్టుబాటు అవుతుంది," అని వారు తేల్చిచెప్పినట్లు తెలిసింది. ఈ మేరకు తమ డిమాండ్లను, నిర్ణయాన్ని వివరిస్తూ నిర్మాతలకు అధికారికంగా

వివరాలు 2లో..

## భారత్ కు మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది... పాకిస్థాన్ లో కాల్చివేత

- పాకిస్థాన్‌లో లష్కరే ఉగ్రవాది అబు సైఫుల్లా హతం
- సింధ్ ప్రావిన్స్‌లో గుర్తుతెలియని వ్యక్తుల కాల్పులు
- నాగ్‌పూర్ ఆర్ఎస్ఎస్ కార్యాలయం దాడిలో ప్రధాన సూత్రధారి
- రాంపూర్, బెంగళూరు దాడుల్లోనూ కీలక పాత్ర ప్రభుత్వ భద్రత ఉన్నప్పటికీ హత్య



వివరాలు 2లో..

## మళ్లీ ఉద్ధృతంగా కరోనా వ్యాప్తి... కొత్త వ్యాక్సిన్ కు అమెరికా గ్రీన్ సిగ్నల్

- ఆసియా దేశాల్లో మళ్లీ పెరుగుతున్న కరోనా కేసులు
- హాంకాంగ్, సింగపూర్‌లలో ఆసుపత్రుల్లో చేరుతున్న వారి సంఖ్య అధికం
- వ్యాక్సిన్ రోగనిరోధక శక్తి తగ్గడమే కారణమంటున్న నిపుణులు
- LP.8.1, XFC కొత్త వేరియంట్ల వ్యాప్తిపై ఆందోళన
- ప్రజలు బూస్టర్ డోసు తీసుకోవాలని వైద్య నిపుణుల సూచన
- నోవావాక్స్ కొత్త వ్యాక్సిన్‌కు అమెరికా FDA ఆమోదం




పెన్ పవర్ డెస్క్: ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో, ముఖ్యంగా హాంకాంగ్, సింగపూర్ వంటి ఆసియా దేశాల్లో కరోనా కేసులు మళ్లీ పెరుగుతున్నాయి. గత కొన్ని వారాలుగా ఇన్ఫెక్షన్ల సంఖ్య గణనీయంగా పెరగడమే కాకుండా, ఆసుపత్రుల్లో చేరేవారి సంఖ్య కూడా అధికమవుతుండటం ఆందోళన కలిగిస్తోంది. బ్లూమ్‌బెర్గ్ నివేదిక ప్రకారం, ఈ నగరాల్లో కోవిడ్ కేసులు, ఆసుపత్రి చేరికలు, మరణాలు కూడా పెరుగుతున్నట్లు తెలుస్తోంది. వ్యాక్సిన్ల ద్వారా లభించిన

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# షరతులు వర్తిస్తాయ్

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుమహిళలకు గుడ్ న్యూస్ చెప్పారు. ఆగస్టు 15వ తేదీ నుంచి ఉచిత బస్సు సౌకర్యాన్ని అమలు చేస్తామని ప్రకటించారు. ఎన్నికలకు ముందు మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని ప్రకటించారు. ఇతర రాష్ట్రాల్లో అధ్యయనం చేసిన తర్వాత మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని ప్రకటించడం పట్ల మహిళలు ఉచిత బస్సు పథకం అమలు కోసం సుదీర్ఘకాలం నుంచి వెయిట్ చేస్తున్నారు. ఇంకా మూడు నెలలు సమయం ఉండటంతో మహిళలు అప్పటి వరకూ వెయిట్ చేయాల్సి ఉన్నప్పటికీ ఉచిత బస్సు పథకం అమలులో ప్రభుత్వం ఏ ఏ నిబంధనలను విధిస్తుందోనన్న ఆందోళన అయితే మాత్రం ప్రతి ఒక్కరిలో వ్యక్తమవుతుంది.

**ఖజానాకు భారం కాకుండా...**

ఈ పథకం ఇప్పటికే అమలులో ఉన్న తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో తెలంగాణలో కొంత సక్సెస్ గా కనిపిస్తున్నప్పటికీ, కర్ణాటకలో మాత్రం సర్కార్ కు ఈ పథకం భారంగా మారింది. ఈ రెండు రాష్ట్రాల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఉచిత మహిళ బస్సు అమలు చేయడంతో ఆర్టీసీకి నష్టం వచ్చి, వాటిని భరించేందుకు ఇతర ఛార్జీలను పెంచుతున్నారు. దీంతో పాటు సరైన ముందస్తు చర్యలు తీసుకోకుండా హడావిడిగా అమలు చేయడంతో బస్సుల్లో మహిళలు సీట్ల కోసం కొట్టుకుంటున్నారు. టటిక్కెట్ కొన్న పురుషులకు సీట్లు దొరకడం లేదు. పథకం అమలు చేసే ముందు సరిపడా బస్సులను కొనుగోలు చేయకపోవడం వల్లనే ఈ సమస్య తలెత్తిందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గుర్తించింది.

**అధ్యయనం చేసిన తర్వాత...**

కానీ ఆంధ్రప్రదేశ్ బాగా అధ్యయనం చేసిన తర్వాత మాత్రం ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. ఎలక్ట్రిక్ బస్సుల కొనుగోలు చేసింది. ఇప్పటికే కొన్ని బస్సులను కొనుగోలు చేసిన ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ లోని ముఖ్యమైన నగరాలకు, పట్టణాలకు పంపుతూనిర్ణయం తీసుకుంది. తక్కువ ఖర్చుతో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందించేందుకు ఎలక్ట్రిక్ బస్సులు ఉపయోగపడనున్నాయి. నగరాల్లోనే ఎక్కువ రద్దీ ఉంటుందని భావించి అక్కడ ఎక్కువ బస్సులను కొనుగోలు చేస్తుంది. అలాగే ఈ పథకం జిల్లాలకే పరిమితం చేయాలని నిర్ణయించింది. ఆ యా జిల్లాలకు చెందిన మహిళలు ఆ జిల్లా పరిధిలోనే ఉచితంగా ప్రయాణం చేయాల్సి ఉంటుంది. దీంతో పాటు ఉచిత బస్సు పథకంలో మరికొన్ని నిబంధనలు అమలు చేసే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం.

# డాక్టర్ గా మారిన మంత్రి నాదెండ్ల..!

- మొదటి పేజీ తరువాయి

వారిని ఆయా విభాగాల వైద్యుల వద్దకు తోడ్కొనివెళ్లి, సరైన వైద్యం అందేలా పర్యవేక్షించారు. పరీక్షలు పూర్తయిన వారికి అవసరమైన మందులను కూడా తన చేతుల మీదుగా అందించడం విశేషం. ఆయన ఆప్యాయత, చొరవ అక్కడున్న వారిని ఎంతగానో ఆకట్టుకున్నాయి. అధికారిక హోదాను పక్కనపెట్టి, ఒక సాధారణ వ్యక్తిలా, ఒక వైద్యుడిలా ఆయన అందించిన సేవలు ప్రజల మన్ననలు పొందాయి. "ప్రజల మంత్రిగా, ఇప్పుడు 'ప్రజల డాక్టర్‌గా' కూడా ఆయన మా మనసు గెలుచుకున్నారంటూ" స్థానికులు, రోగులు హర్షం వ్యక్తం చేశారు.

**రక్తనిధి కేంద్రం ఏర్పాటుకు హామీ**

భవిష్యత్తులో ఈ ప్రాంత ప్రజల సౌకర్యార్థం కొల్లిపర సీహెచ్‌సీలో ఒక రక్తనిధి కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని ఈ సందర్భంగా మంత్రి హామీ ఇచ్చారు. ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని, ఇలాంటి శిబిరాల ద్వారా మారుమూల ప్రాంత ప్రజలకు కూడా నాణ్యమైన వైద్య సేవలు చేరువవుతాయని మంత్రి మనోహర్ పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# తిరుపతిలో దళిత విద్యార్థి జేమ్స్‌పై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాను

- మొదటి పేజీ తరువాయి

మీడియాలో స్పందించారు. "తిరుపతిలో ఇంజినీరింగ్ దళిత విద్యార్థి జేమ్స్‌పై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాను. రాష్ట్రంలో దిగజారిపోయిన శాంతి భద్రతలకు, దళితులపై తీవ్రమవుతున్న దాడులకు ఈ ఘటన ఒక ఉదాహరణ. దళితులు, తమ గొంతు గట్టిగా వినిపించలేని వర్గాల వారికి ఈ రాష్ట్రంలో రక్షణ లేకుండా పోయింది. చంద్రబాబు, అధికారపార్టీ నాయకుల డైరెక్షన్‌లో కక్ష సాధింపు చర్యల్లో మునిగితేలుతున్న పోలీసు యంత్రాంగం పౌరులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యతను పూర్తిగా విస్మరించడంవల్లే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయి. ప్రతిరోజూ ఎక్కడో ఒకచోట దళితులపైన దాడులు జరుగుతూనే ఉన్నాయి. పోలీస్‌స్టేషన్లకు వెళితే న్యాయం

జరుగుతుందన్న నమ్మకం పోవడమేకాదు, ఫిర్యాదుదారులమీదే ఎదురు కేసులు పెట్టడం పరిపాటిగా మారింది. జేమ్స్‌పై దాడి ఘటనలో పోలీసు యంత్రాంగం వైఫల్యమే కాదు, రాజకీయ జోక్యంతో కనీసం ఫిర్యాదునుకూడా స్వీకరించలేని పరిస్థితి. తిరుపతి ఘటనకు కారకులైన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాను" అంటూ జగన్ ట్వీట్ చేశారు.

# హైదరాబాద్ గుల్జార్ హౌస్ అగ్నిప్రమాదంపై రాహుల్ గాంధీ స్పందన

పెన్ పవర్ డెస్క్:హైదరాబాద్‌లోని చార్మినార్ సమీపంలోని గు ల్జార్ హౌస్ ప్రాంతంలో జరిగిన ఘోర అగ్నిప్రమాదంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటనలో 17 మంది ప్రాణాలు కోల్పోవడం, అనేక మంది గాయపడటం పట్ల వారు ప్రగాఢ విచారం తెలిపారు. మృతుల కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.తెలంగాణలోని హైదరాబాద్‌లో జరిగిన భారీ అగ్నిప్రమాదంలో పలువురు మరణించడం, అనేక మంది గాయపడటం అత్యంత బాధాకరమని రాహుల్ గాంధీ సోషల్ మీడియా ద్వారా పేర్కొన్నారు. "ఈ కష్ట సమయంలో మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆశిస్తున్నాను" అని తన సందేశంలో తెలిపారు.మల్లికార్జున ఖర్గే కూడా ఈ అగ్నిప్రమాదంపై స్పందించారు. ఆయన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఫోన్‌లో మాట్లాడి ఘటన వివరాలు తెలుసుకున్నారు. "హైదరాబాద్‌లోని చార్మినార్ ప్రాంతంలో జరిగిన ఘోర అగ్నిప్రమాదంలో అనేక అమూల్యమైన ప్రాణాలు కోల్పోవడం నన్ను తీవ్రంగా కలచివేసింది. ఈ దుఃఖ సమయంలో బాధితుల కుటుంబాలకు నా హృదయపూర్వక సానుభూతి" అని ఖర్గే 'ఎక్స్' వేదికగా పోస్ట్ చేశారు.ముఖ్యమంత్రితో మాట్లాడిన అనంతరం, ప్రభుత్వం అవసరమైన అన్ని సహాయక చర్యలు తీసుకుంటుందని, బాధితులకు తక్షణమే తగిన పరిహారం అందిస్తుందని తనకు భరోసా లభించిందని ఖర్గే తెలిపారు. "కాంగ్రెస్ కార్యకర్తలు బాధిత కుటుంబాలకు అండగా నిలవాలని, వారికి సాధ్యమైనంత సహాయం అందించాలని విజ్ఞప్తి చేస్తున్నాను. ఈ కష్టకాలంలో మనమందరం కలిసి బాధితులకు అండగా నిలబడదాం" అని ఆయన పిలుపునిచ్చారు.

# కూటమికి అనంతపురం మీద ప్రేమ ఉందా?

పెన్ పవర్ డెస్క్:జిల్లాలో అనేక ఏళ్లుగా విశేష సేవలం దిస్తున్న రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఆర్డీటీ) సంస్థ ప్రస్తుతం ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతోందని, దీనికి అందాల్సిన విదేశీ విరాళాల (నియంత్రణ) చట్టం (ఎఫ్‌సీఆర్ఏ) నిధులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే విడుదల చేయాలని వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి యాంకర్ శ్యామల డిమాండ్ చేశారు. ఆర్డీటీ ఎదుర్కొంటున్న సంక్షోభం పట్ల ప్రభుత్వాలు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నా యని ఆమె ఆరోపించారు. ఈ సందర్భంగా శ్యామల స్పందిస్తూ, "కొన్నేళ్లుగా అనంతపురం ప్రజలకు తల్లిలా సేవలు అందిస్తున్న ఆర్డీటీ నేడు తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విషయాన్ని ఏమాత్రం పట్టించుకోకుండా చేతులు కట్టుకుని చూస్తున్నాయి," అని విమర్శించారు. "కులం, మతం, ప్రాంతం వంటి భేదాలు చూడకుండా నిస్వార్థంగా సేవలు అందించిన ఆర్డీటీ లాంటి సంస్థపై కొందరు రాజకీయాలు చేయడం దారుణం. సేవ చేయని వారిని వదిలేసి, అలుపెరుగక సేవ చేస్తున్న వారిపై ఇలా తూట్లు పొడవడం దేనికి సంకేతం?" అని ఆమె సూటిగా ప్రశ్నించారు.

"రాయలసీమకు ఎప్పుడూ అన్యాయమే జరుగుతోంది. అడిగితే గానీ అమ్మయినా అన్నం పెట్టదన్నట్లు, సీమకు దక్కేదేమీ లేదు, కొత్తగా వచ్చేదేమీ లేదు," అని శ్యామల ఆవేదన వ్యక్తం చేశారు. "ప్రజల ప్రాణంగా నిలిచిన ఇలాంటి సేవా సంస్థపై కుట్రలు జరుగుతుంటే చూస్తూ "ప్రస్తుత కూటమి ప్రభుత్వానికి అనంతపురం జిల్లాపైన గానీ, రాయలసీమపైన గానీ ఏమాత్రం పట్టింపు ఉందా?" అని శ్యామల నిలదీశారు. "కేంద్రంతో పొత్తులో ఉన్నందున, ఆర్డీటీకి ఆగిపోయిన నిధుల గురించి ఎందుకు ఒక్క మాట కూడా మాట్లాడటం లేదు?" అని ఆమె ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆర్డీటీకి సంబంధించిన ఎఫ్‌సీఆర్ఏ నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ, ఈరోజు (ఆమె ప్రకటన చేసిన రోజు) అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంలో బైక్ ర్యాలీ నిర్వహించినట్లు శ్యామల తెలిపారు. అనంతరం, ఈ డిమాండ్‌తో కూడిన వినతిపత్రాన్ని స్థానిక రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో)కి అందజేసినట్లు ఆమె వివరించారు. ఈ నిధులు విడుదల కాకపోతే ఆర్డీటీ సేవలకు తీవ్ర అంతరాయం కలుగుతుందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు.

# గాజాపై మరోసారి ఇజ్రాయెల్ నిప్పుల వర్షం... 66 మంది మృతి

పెన్ పవర్ డెస్క్:గాజాలో మరోసారి భయానక వాతావరణం నెలకొంది. ఇజ్రాయెల్ దళాలు గాజాలోని పలు ప్రాంతాలపై శనివారం అర్ధరాత్రి భీకర వైమానిక దాడులకు పాల్పడ్డాయి. ఈ దాడుల్లో నిరాశ్రయులు తలదాచుకుంటున్న నివాసాలు, శిబిరాలు లక్ష్యంగా మారడంతో పెద్ద ఎత్తున ప్రాణనష్టం సంభవించింది. మొత్తం 66 మంది పాలస్తీనియన్లు మరణించినట్లు గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది.ఈఆరోగ్య మంత్రిత్వ శాఖ అందించిన వివరాల ప్రకారం, ఖాన్ యూనిస్‌లో 20 మంది, ఉత్తర గాజాలో 36 మంది, జబాలియాలోని శరణార్థి శిబిరంలో మరో 10 మంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ఏడుగురు చిన్నారులు ఉండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. అంతేకాకుండా, ఒకే కుటుంబానికి చెందిన తొమ్మిది మంది ఈ దాడుల్లో దుర్మరణం పాలయ్యారు. పదుల సంఖ్యలో ప్రజలు గాయపడగా, వారిని సమీపంలోని ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. అయితే, ఈ తాజా దాడులపై ఇజ్రాయెల్ సైన్యం ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. శనివారం ఒక్కరోజే మొత్తం 150 మంది పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయారని, మరో 450 మంది గాయపడ్డారని గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ శనివారం తెలిపింది. మార్చి 18న కాల్పుల విరమణ ఒప్పందం ఉల్లంఘనకు గురైనప్పటి నుంచి ఇప్పటివరకు మూడు వేల మందికి పైగా పాలస్తీనియన్లు మరణించినట్లు పేర్కొంది. ఈ దాడుల నేపథ్యంలో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఇటీవల కీలక వ్యాఖ్యలు చేశారు. కాల్పుల విరమణ ఒప్పందాన్ని కొనసాగించేందుకు హమాస్ నిరాకరించడం వల్లే దాడులను తీవ్రతరం చేయాల్సి వచ్చిందని ఆయన తెలిపారు.

# భారత్ కు మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది... పాకిస్థాన్ లో కాల్చివేత

పెన్ పవర్ డెస్క్:భారత్‌లో అనేక ఉగ్రదాడులకు ప్రణాళిక రచించి, వాటిని అమలుపరచడంలో కీలకపాత్ర పోషించిన లష్కరే తోయిబా (ఎల్ఈటీ) సీనియర్ ఉగ్రవాది రజావుల్లా నిజామనీ అలియాస్ అబు సైఫుల్లా పాకిస్థాన్‌లో హతమయ్యాడు. భారత్‌కు మోస్ట్ వాంటెడ్ జాబితాలో ఉన్న సైఫుల్లాను, పాకిస్థాన్‌లోని సింధ్ ప్రావిన్స్‌లో కొందరు గుర్తుతెలియని సాయుధులు కాల్చి చంపారు. ఈ ఘటన పాకిస్థాన్ ఉగ్రవాదులకు అభయారణ్యంగా మారిందన్న వాదనలకు బలం చేకూరుస్తోంది. అదే సమయంలో అక్కడి ప్రభుత్వ భద్రత ఉన్నప్పటికీ ఇలాంటి హత్యలు జరగడం పలు ప్రశ్నలను లేవనెత్తుతోంది. వివరాల్లోకి వెళితే, పాకిస్థాన్ ప్రభుత్వ వర్గాల నుంచి పరోక్షంగా భద్రత పొందుతున్నట్లు భావిస్తున్న అబు సైఫుల్లా, ఆదివారం మధ్యాహ్నం సింధ్ ప్రావిన్స్‌లోని మట్లీ పట్టణంలో ఉన్న తన నివాసం నుంచి బయటకు వచ్చాడు. సమీపంలోని ఓ కూడలి వద్దకు చేరుకున్న సమయంలో, గుర్తుతెలియని వ్యక్తులు అతడిని లక్ష్యంగా చేసుకుని ఒక్కసారిగా కాల్పులకు తెగబడి హతమార్చినట్లు తెలుస్తోంది. ఈ దాడి పక్కా ప్రణాళికతో జరిగినట్లు ఘటనా స్థలంలోని ఆధారాలు సూచిస్తున్నాయి. భారత్‌లో జరిగిన పలు భారీ ఉగ్రదాడుల్లో అబు సైఫుల్లా కీలక సూత్రధారిగా వ్యవహరించాడు. ముఖ్యంగా, 2006లో మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో ఉన్న రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆరెస్సెస్) ప్రధాన కార్యాలయంపై జరిగిన ఉగ్రదాడికి ఇతడే ప్రధాన కుట్రదారు అని భారత దర్యాప్తు సంస్థలు గుర్తించాయి. ఈ దాడి దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. అంతేకాకుండా, 2001లో ఉత్తరప్రదేశ్‌లోని రాంపూర్‌లో సీఆర్పీఎఫ్ క్యాంపుపై జరిగిన దాడి, 2005లో బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్‌సీ)పై జరిగిన ఉగ్రదాడి ఘటనల్లోనూ సైఫుల్లా ప్రమేయం ఉన్నట్లు బలమైన ఆరోపణలు ఉన్నాయి.

భారత్‌లో మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాదుల జాబితాలో ముందువరుసలో ఉన్న సైఫుల్లా, పాకిస్థాన్‌లో స్వేచ్ఛగా తిరుగుతూ, అక్కడి నుంచి భారత్ వ్యతిరేక కార్యకలాపాలకు నిధులు సమకూర్చడం, యువతను ఉగ్రవాదం వైపు మళ్లించడం వంటి చర్యలకు పాల్పడుతున్నట్లు భారత నిఘా వర్గాలు చాలాకాలంగా ఆరోపిస్తున్నాయి. ఇతని మరణం, పాకిస్థాన్ గడ్డపై ఉగ్రవాదులకు రక్షణ కల్పిస్తున్నారన్న భారత్ వాదనకు ఈ ఘటన మరింత బలాన్ని చేకూర్చింది. సైఫుల్లా హతం కావడం లష్కరే తయ్యిబా సంస్థకు పెద్ద ఎదురుదెబ్బగా భావిస్తున్నారు.

# జూన్ 1 నుంచి తెలుగు రాష్ట్రాల్లో సినిమా థియేటర్లు బంద్

- మొదటి పేజీ తరువాయి

ఒక లేఖ రాయాలని కూడా ఈ సమావేశంలో నిర్ణయించారు.ఈ నిర్ణయం అమల్లోకి వస్తే, జూన్ 1 నుంచి విడుదల కావాల్సిన పలు సినిమాలపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది. ముఖ్యంగా చిన్న, మధ్య తరహా చిత్రాల విడుదలకు ఇబ్బందులు తలెత్తవచ్చని పరిశ్రమ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఎగ్జిబిటర్ల నిర్ణయంతో తెలుగు సినిమా పరిశ్రమలో కొత్త చర్చ మొదలైంది. ఈ సమస్యకు నిర్మాతలు, ఎగ్జిబిటర్లు కలిసి ఎలాంటి పరిష్కారం కనుగొంటారో చూడాలి.

# మళ్లీ ఉద్ధృతంగా కరోనా వ్యాప్తి... కొత్త వ్యాక్సిన్ కు అమెరికా గ్రీన్ సిగ్నల్

- మొదటి పేజీ తరువాయి

రోగనిరోధక శక్తి క్రమంగా తగ్గడం, LP.8.1, XFC వంటి కొత్త వేరియంట్ల వ్యాప్తి దీనికి కారణంగా నిపుణులు భావిస్తున్నారు. దీంతో ప్రజలు ముందుజాగ్రత్తగా కరోనా బూస్టర్ డోసు తీసుకోవాలని, ఫ్లూ మాదిరిగానే కోవిడ్ వ్యాక్సిన్‌ను కూడా పరిగణించాలని సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో, పెరుగుతున్న ముప్పును దృష్టిలో ఉంచుకుని అమెరికా ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ నోవావాక్స్ సంస్థ అభివృద్ధి చేసిన కొత్త వ్యాక్సిన్‌కు ఆమోదం తెలిపింది.

అమెరికాకు చెందిన అంటువ్యాధుల నిపుణుడు డాక్టర్ మార్క్ ఈ రూప్ ప్రకారం, ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఎల్‌పీ.8.1 వేరియంట్ కారణంగా కేసులు అధికమవుతున్నాయి. నమోదవుతున్న కేసుల్లో సుమారు 70% ఈ వేరియంట్ వల్లేనని, మరో 9% కేసులకు ఎక్స్‌ఎఫ్‌సీ వేరియంట్ కారణమని ఆయన తెలిపారు. ఒమిక్రాన్ అసలు వేరియంట్ స్థానంలో దాని ఉప వేరియంట్లు వ్యాప్తిలో ఉన్నాయని పేర్కొన్నారు.ఈ కొత్త వేరియంట్లు తీవ్ర ప్రాణాంతకమైనవి కానప్పటికీ, తగ్గిన రోగనిరోధక శక్తి వల్ల సులభంగా వ్యాప్తి చెందుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. ఏప్రిల్ నుంచి ఎల్‌పీ.8.1 వేరియంట్ యూకే, ఆస్ట్రేలియా సహా అనేక దేశాల్లో ప్రభావం చూపుతోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ జనవరిలోనే ఎల్‌పీ.8.1ను 'అండర్ మానిటరింగ్ వేరియంట్'గా గుర్తించింది. ప్రజలు అప్రమత్తంగా ఉంటూ, అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# విజయనగరంలో విషాదం.. కారులో ఊపిరి ఆడక నలుగురు చిన్నారుల మృతి

- మొదటి పేజీ తరువాయి

ఎంతసేపైనా తిరిగి రాలేదు. వారి తల్లిదండ్రులు వెతికినా కనిపించలేదు. చివరికి స్థానిక మహిళా మండలి కార్యాలయం వద్ద ఆగి ఉన్న కారులో నలుగురు చిన్నారుల మృతదేహాలను అక్కడున్నవారు గుర్తించారు.

సరదాగా ఆడుకునేందుకు కారులోపలికి వెళ్లిన తర్వాత.. లాక్ పడటంతో ఊపిరి ఆడక మృతి చెందినట్లు తెలుస్తోంది. మృతులను ఉదయ్ (8), చారుమతి (8), చరిష్మా (6), మనస్విగా గుర్తించారు.వీరిలో చారుమతి, చరిష్మా అక్కాచెల్లెళ్లు. ఒకేసారి నలుగురు పిల్లలు కన్నుమూయడంతో ద్వారపూడిలో విషాద ఛాయలు అలుముకున్నాయి. చిన్నారుల మృతదేహాలను పట్టుకుని తల్లిదండ్రులు, బంధువులు రోధించడం ప్రతి ఒక్కరి హృదయాన్ని ద్రవింపజేస్తోంది.

పెన్ పవర్
ఉభయ గోదావరి
కాకినాడ । డా॥ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ । తూర్పు గోదావరి । పశ్చిమ గోదావరి । ఏలూరు

## కాకినాడలో నేడే ప్రజా ఫిర్యాదుల పరిష్కార (పీజీఆర్ఎస్) వేదిక కార్యక్రమం



జిల్లా కలెక్టర్ షణ్మోహన్.

**కాకినాడ. పెన్ పవర్ మే 18 :**ప్రజా సమస్యల పరిష్కారం నిమిత్తం ఏర్పాటు చేయబడిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ(పీజీఆర్ఎస్) కార్యక్రమం జిల్లా స్థాయిలో 19 వ తేదీన సోమవారం కాకినాడ కలెక్టరేట్ గ్రీవెన్స్ హాలులో ఉదయం 10:00 గంటల నుంచి 01:00 గంట వరకు నిర్వహించడం జరుగుతుందని కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు అందరూ విధిగా హాజరు కావాలని ఆయన ఆదేశించారు. మండల స్థాయిలో జరిగే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ(పీజీఆర్ఎస్) కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు అందరూ విధిగా ఉదయం 9:30 గంటలకు హాజరుకావాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు.

అర్జీదారులు కాకినాడ రావలసిన అవసరం లేకుండానే వారి యొక్క అర్జీలను మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్ వెబ్సైట్ నందు నమోదు చేసుకోవచ్చునని తెలిపారు. అర్జీ దార్లు వారి యొక్క అర్జీల నమోదు, నమోదైన అర్జీల గురించి వాటి యొక్క స్థితి దానికి సంబంధించి సమాచారం తెలుసుకోవాలి అన్నప్పుడు 1100 (డబల్ వన్ డబల్ జీరో) కి నేరుగా కాల్ చేయవచ్చని కాకినాడ జిల్లా కలెక్టర్ తెలిపారు.

## సైనికుల పోరాటం త్యాగం స్వేచ్ఛ కు కారణం.

- మండపేట లో తిరంగా యాత్ర.
- సర్వమత ప్రార్థనలు.
- ఆకట్టుకున్న అతి పెద్ద జాతీయ జెండా.



**మండపేట. పెన్ పవర్.మే 18 :**దేశ సరిహద్దులో త్రివిధ దళాల సైనికులు చేస్తున్న పోరాటం, త్యాగాల వల్లే భారత భూభాగంలో పౌరులు ఆనందంగా జీవిస్తున్నామని మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. ఆదివారం మండపేట పట్టణంలోని రథం ఆలయం నుండి బస్ స్టాండ్ వరకు నిర్వహించిన భారీ తిరంగా యాత్ర ర్యాలీలో ఎమ్మెల్యే వేగుళ్ళతో పాటు జనసేన ఇన్ ఛార్జ్ రాష్ట్ర నీటి పారుదల సంస్థ కార్పొరేషన్ చైర్మన్ వేగుళ్ళ లీలా కృష్ణ, బిజెపి నియోజక వర్గ కన్వీనర్ కోటిపల్లి వివి సాయి రామ్ తదితరులు పాల్గన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పెహల్గామ్ ఉగ్రదాడికి వ్యతిరేకంగా, ఉగ్రవాదులను అణచడానికి, భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సింధూర్ విజయోత్సవం సందర్భంగా త్రివిధ దళాల సైనికులకు సంఘీభావంగా తిరంగా యాత్ర నిర్వహిస్తున్నామన్నారు. ఎంతో ధైర్యంతో భారతదేశం ముందడుగు వేసి భారతీయత చాటి ప్రజలే భారతీయత – ప్రజలే దేశమని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెలుగెత్తి చాటాయన్నారు. భిన్నత్వంలో ఏకత్వానికి తిరంగా ర్యాలీ ఒక చిహ్నమని, భారతీయతకు ఇదొక నిదర్శనమని తెలిపారు. దేశరక్షణ, సరిహద్దుల రక్షణలో అహర్నిశలు నిమగ్నమైన భారత సైనికులకు సంఘీభావం తెలపాలన్నారు. తిరంగా యాత్ర ర్యాలీలో స్వచ్ఛందంగా భాగస్వాములైన ప్రతి ఒక్కరికి క ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. లీలా కృష్ణ మాట్లాడుతూ భారత దేశం ధర్మాన్ని నమ్ముకుందని, భారత సైన్యం ఆపరేషన్ సింధూర్ తో పాకిస్తాన్ కు, శత్రుదేశాలకు స్పష్టంగా అర్థమయ్యేలా నిరూపించారన్నారు. దేశ మహిళల సింధూరం తుడిపిన తీవ్రవాదులకు దేశ మహిళా సైనికుల ద్వారానే గట్టి బుద్ధి చెప్పడం జరిగిందన్నారు. ప్రపంచంలో ఎక్కడ దాక్కున్నా వెతికి వెంట బడి తీవ్రవాదుల తలలు తీసే సత్తా ప్రతి భారతీయుడికి ఉందన్నారు.. రథం సెంటర్ నుంచి బస్ స్టాండ్ వరకు భోలో భారత్ మాతాకీ జై, ఉగ్రవాదులు నశించాలి, భారతీయుల ఐక్యత వర్ధిల్లాలి అనే నినాదాలతో ఉత్సహంగా సాగింది. కలువ పువ్వు సెంటర్ వద్ద సర్వ మత ప్రార్థనలు చేశారు. అనంతరం యుద్ధంలో అసువులు బాసిన అమర జవాన్ మురళీ నాయక్ కు, పహాల్గాం మృతులకు వారు సంతాపం తెలిపారు. ఈ ర్యాలీ లో అతి పెద్ద జాతీయ జెండా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమం లో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు కొన సత్యనారాయణ, దూలీ జయరాజు, నల్లమిల్లి వీర్రెడ్డి, ఉంగరాల రాంబాబు, గడి రాంబాబు,తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ గడి సత్యవతి,మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ మందపల్లి చంద్రశేఖర్, బిజెపి జిల్లా కార్యదర్శి గోడవర్తి రామచంద్రరావు, ఎండి కరీం ఖాదారీ, ఎండి కరీం , ఎండి అల్తాఫ్, బొద్దు రామకృష్ణ,కౌవ్వాడ అప్పన్న బాబు, మద్దుల సుబ్బారావు, వివిధ సంఘాల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**పెద్దాపురం, పెన్ పవర్, మే 18 :** పెద్దాపురం పట్టణంలో జవహర్ లాల్ నెహ్రూ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 2003–2004 సంవత్సరం పదవ తరగతి చదివిన విద్యార్థినీ, విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. పూర్వ విద్యార్థులు సుమారు 21 సంవత్సరాల తర్వాత కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధులులేకుండా పోయాయి. నాడు పాఠశాలలో గడిపిన మధురస్మృతులను, జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకుని సంతోషంగా గడిపారు. ఇక్కడ చదవిన విద్యార్థులు ఉన్నత చదువులు అభ్యసించి దేశ, విదేశాల్లో ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారు. నాడు తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ సుమారు 21 సంవత్సరాల తరువాత తమకు తీపి జ్ఞాపకాలను తిరిగి ఆస్వాదించేలా చేయడం, ప్రతీ విద్యార్థి ఉన్నత స్థానంలో ఉండడం చాలా సంతోషంగా ఉందన్నారు. అనంతరం పూర్వ విద్యార్థులు ఉపాధ్యాయులను దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించి మెమోంటోలను అందజేశారు. అనంతరం విందు భోజనాలు చేశారు.

## అభివృద్ధి సంక్షేమమే తెలుగుదేశం పార్టీ లక్ష్యం



పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప

**పెద్దాపురం, పెన్ పవర్, మే 18 :** రాష్ట్ర అభివృద్ధి, ప్రతీ పేదవాని కుటుంబానికి సంక్షేమ పథకాల అమలు చేయడమే తెలుగుదేశం పార్టీ లక్ష్యమని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన పెద్దాపురం నియోజకవర్గస్థాయి మినీ మహానాడు కార్యక్రమం పండగ వాతావరణంలో నిర్వహించారు. తొలుత తెలుగుదేశం పార్టీ పతాకావిష్కరణ చేసి అనంతరం నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చినరాజప్ప మాట్లాడుతూ ప్రతీ పేదవాడికి సంక్షేమ ఫలాలు అందించాలనే ఆశయంతో స్వర్గీయ నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించారని అన్నారు. పేద వర్గాల కోసం తెలుగుదేశం పార్టీ అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిందని, ఆంధ్ర రాష్ట్ర ప్రజల కోసం నిరంతరం పరితపించే ఏకైక నాయకుడు నారా చంద్రబాబు నాయుడు అని తెలిపారు. తెలుగుదేశం పార్టీని అధికార గద్దెనెక్కి%శీ%చేందుకు ప్రతీ కార్యకర్త నిరంతరం శ్రమించారని, అటువంటి కార్యకర్తలు ఉన్న పార్టీ తెలుగుదేశం పార్టీ అని పేర్కొన్నారు. అన్న ఎన్టీఆర్ ఆశయాలతో తెలుగుదేశం పార్టీ ముందుకు సాగుతుందని, కార్యకర్తల సంక్షేమం కోసం ఆలోచించే ఏకైక పార్టీ అని అన్నారు. పేద వర్గాలకు పింఛన్ అమలు, కిలో రెండు రూపాయలకే బియ్యం వంటి సంక్షేమ పథకాలు అమలు చేసిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని, 45 సంవత్సరాల సుదీర్ఘకాలంలో ఎన్ని ఆటుపోట్లు ఎదుర్కొని పేద వర్గాల కోసం నిరంతరం ఆలోచించే పార్టీ తెలుగుదేశం పార్టీ అని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాజా సూరిబాబు రాజు, బోళ్ళ వెంకటరమణ, రంధి సత్యనారాయణ, అడబాల కుమారస్వామి, తోటకూర శ్రీనివాస్, అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆపరేషన్ సింధూర్ అద్భుత విజయం




**పెద్దాపురం, పెన్ పవర్, మే 18 :** పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా చేపట్టిన ఆపరేషన్ సింధూర్ ద్వారా భారత సైన్యం సత్తా ప్రపంచానికి తెలిసి వచ్చిందని పెద్దాపురం పట్టణంలో నిర్వహించిన తిరంగా ర్యాలీలో పలువురు పేర్కొన్నారు. ఆపరేషన్ సింధూర్ విజయవంతమైన సందర్భంగా భారత సైనికులకు సంఘీభావంగా భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద గల భారతమాత విగ్రహానికి భారతీయ జనతా పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు, బీజేపీ పెద్దాపురం నియోజకవర్గ కార్యక్రమ ఇన్ ఛార్జి డాక్టర్ గౌరకపూడి చిన్నయ్యదొర పూలమాలలు వేసి జాతీయ జెండాలు చేతబూని జై జవాన్, జై కిసాన్, వందేమాతరం, భారత్ మాతాకి జై అంటూ నినదించారు. ఈ సందర్భంగా బీజేపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు మాట్లాడుతూ పాక్ ఎయిర్ బేస్‌లపై బ్రహ్మోస్ క్షిపణుల వర్షంతో భీతిల్లిన పాకిస్తాన్ మూడు రోజుల్లోనే కాళ్లబేరానికి వచ్చిందన్నారు. కాల్పుల విరమణకు ఒప్పుకోవడం ద్వారా యుద్ధాన్ని నివారిస్తూ దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కీలకంగా వ్యవహరించారని కీర్తించారు. పాకిస్థాన్‌తో చర్చలు జరిగితే పీఓకే విలీనంపైనే జరుగుతాయని, ఈ విషయంలో ఇతర దేశాల జోక్యం అవసరం లేదని, సమస్యను పరిష్కరించుకునే సత్తా భారత్‌కు ఉందన్నారు. ఆపరేషన్ సింధూర్‌లో వీరోచిత పోరాటం చేసిన సైనికులందరికీ జేజేలు కొట్టాలన్నారు. దేశాన్ని కాపాడుకోవడానికే భారత్ ఎదురు దాడికి దిగిందని, ప్రధాని మోడీ వ్యూహాత్మకంగా వ్యవహరించారని చెప్పారు. దేశ ఐకమత్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని అన్నారు. ఆపరేషన్ సింధూర్ కనీవినీ ఎరుగని గొప్ప విజయమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పెద్దాపురం పట్టణ అధ్యక్షుడు బొలిశెట్టి రామ్ కుమార్, సామర్లకోట పట్టణ అధ్యక్షుడు పుప్పాల నాగ గోవిందు, పెద్దాపురం మండల అధ్యక్షుడు పోతుల ప్రభాకర్, అధిక సంఖ్యలో బీజేపీ శ్రేణులు, తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత ఎముకల సాంద్రత పరీక్షలు.



**మండపేట. పెన్ పవర్.మే 18 :**టోరెంట్ కంపెనీ ఆధ్వర్యంలో బురుగుంట వైఎస్ ఆర్ పార్కులో డొక్కా సీతమ్మ వాకర్స్ క్లబ్ నేతృత్వంలో క్లబ్ అధ్యక్షులు కోన సత్యనారాయణ ఆద్వర్యంలో ఆదివారం ఉచిత ఎముకల సాంద్రత పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ వైద్యులు డాక్టర్ బిక్కిన తాతబ్బాయి చౌదరి,ఫిజియోథెరపీ వైద్యులు డాక్టర్ ఎమ్.డి హైదర్ పాల్గొని రోగులకు పరీక్షలు నిర్వహించారు.

ఎముకల సాంద్రత పరీక్ష అనేది బలాన్ని నిర్ణయించడానికి ఉపయోగించే ఒక వైద్య ప్రక్రియ అని కొన సత్యనారాయణ పేర్కొన్నారు. ఇది బోలు ఎముకలు వ్యాధి, భవిష్యత్తులో ఎముకల పగుళ్ల ప్రమాదాన్ని గుర్తించగలదన్నారు. ఎముక సాంద్రతను కొలవగల వివిధ విధానాలు ఉన్నాయన్నారు.

ఈ కార్యక్రమంలో టెక్నీషియన్ రమేష్,మెడికల్ రిప్రజెంట్ జావిద్ క్లబ్ ప్రదాన కార్యదర్శి అబ్బాస్, ఉపాద్యక్షులు రెడ్డిరాజు, సిహెచ్ భాస్కరరాజు, గంపలసత్యప్రసాద్, వెంకట్రావు,తాతపూడి సుధీర్,పార్కు సిబ్బంది కన్న,వాసు సహాయసహకారాలు అందించారు. 150 మందికి పరీక్షలు నిర్వహించారు. మందులు పంపిణీ చేశారు.

## రాధాకృష్ణ ను పరామర్శించిన మాజీ మంత్రి వేణు.



**మండపేట. పెన్ పవర్.మే 18 :** రాష్ట్ర వైసిపి రైతు విభాగం కన్వీనర్, మునిసిపల్ కో ఆప్షన్ సభ్యులు రెడ్డి రాధాకృష్ణ ను మాజీ మంత్రి చెల్లుబోయిన వేణు ఆదివారం పరామర్శించారు. రాధాకృష్ణ తనయుడు రెడ్డి సందీప్ ఇటీవల ప్రమాదానికి గురి అయి హైదారాబాద్ యశోద లో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో వేణు రాధాకృష్ణ ను పరామర్శించారు. సందీప్ త్వరగా కోలుకోని సంపూర్ణ ఆరోగ్యం తో ఇంటికి రావాలని వేణు పేర్కొన్నారు.

ఓగిరాల దేవి, పెంకే గంగాధర్, సాధనలా శివ, పిఠాపురం సత్యనారాయణ, 29 వ వార్డు కౌన్సిలర్ పిల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మరిడమ్మ దేవస్థానంలో అన్నదానం



**పెద్దాపురం, పెన్ పవర్, మే 18 :** భక్తుల పాలిట కొంగుబంగారంలా విరాజిల్లుతున్న పెద్దాపురం మరిడమ్మ అమ్మవారి దేవస్థానంలో ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.. భక్తుల సౌకర్యార్థం వారం వారం ఈ అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ అసిస్టెంట్ కమీషనర్ కె. విజయలక్ష్మి తెలిపారు. అలాగే భవిష్యత్తులో నిత్య అన్నదాన కార్యక్రమం నిర్వహించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం సీనియర్ అసిస్టెంట్ ఎస్.వెంకటరమణ, ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఆపరేషన్ సింధూర్ ఉగ్రవాదానికి గుణపాఠం

ఆలమూరు, పెన్ పవర్, మే 18: మదర్ తెరిస్సా స్పోర్ట్స్ అండ్ సెల్ఫ్ ... ఆధ్వర్యంలో



ఆదివారం కొత్తూరు సెంటర్ జంక్షన్ నుండి రైస్ మిల్లుల వరకు టైక్వాండో మార్షల్ ఆర్ట్స్ విద్యార్థులతో ఇండియా ఆర్మీ సైనికులు నిర్వహించిన ఆపరేషన్ సింధూర్ తో పాకిస్తాన్ ఉగ్రవాదులను మట్టికరిపించిన విధానాన్ని విద్యార్థులకు వివరిస్తూ వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా మే 7న ఆపరేషన్ సిందూర్ ను చేపట్టింది భారత ఆర్మీ. పాకిస్థాన్‌లోని 9 కీలక ఉగ్ర స్థావరాలపై భారత్ మెరుపుదాడులు నిర్వహించింది. కేవలం 25 నిమిషాల్లోనే పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్ లోని 9 కీలక ప్రాంతాల్లో దాడులు చేసింది. భారత్ నిర్వహించిన ఈ దాడుల్లో దాదాపు 100 మంది ఉగ్రవాదులు మృతి చెందినట్లు కేంద్ర రక్షణశాఖ పేర్కొన్నాయి. అయితే భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ పాకిస్తాన్ కే కాదు ప్రపంచ దేశాలు ఉలికి పడ్డాయి. భారత ఆయుధ సంపద చూసి ఇప్పుడే ప్రపంచ దేశాలు అవాక్కయ్యాయి. ఆపరేషన్ సిందూర్ లో స్వదేశీయ సాంకేతికతో సత్తా చాటింది. భారత మేక్ ఇన్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా పథకాలు ఇందుకు దోహద పడ్డాయి. మన డిఫెన్స్ వ్యవస్థ బలోపాతం కావడంతో తెలుగు సైంటిస్ట్ కృషి దాగి ఉంది. రాకెట్ మ్యాన్ గా పేర్కొందిన డిఆర్డిఓ మాజీ చైర్మన్ డాక్టర్ సతీష్ రెడ్డి భారత రక్షణ రంగంలో కీలక పాత్ర పోషించారని అన్నారు. భారతీయులుగా పుట్టి ఇలాంటి విజయోత్సవాలలో పాల్గొనడం మాకు చాలా ఆనందంగా ఉందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కోచస్ టి.లక్ష్మీ సందీప్ కిరణ్, ఎం.సత్య కాంత్, ఎం.మోషే, జి.ప్రసాద్, కె.సింహాద్రి, విద్యార్థులు పాల్గొన్నారు.

18 ఆలమూరు 2 : కొత్తూరు సెంటర్లో టైక్వాండో విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న అబ్బులు

# జిజిహెచ్ సిబ్బందికి ఎన్ 95 మాస్కులు అందించిన ఎంపీ తంగేళ్ల



కాకినాడ.పెన్ పవర్ మే 18 :కరోనా కేసులు మళ్లీ అక్కడక్కడ కనిపిస్తున్న కారణంగా ఆసుపత్రి సిబ్బందికి రక్షణ కల్పించేందుకు ఎంపీ తంగే శ్రీనివాస్ ఆధ్వర్యంలో 5000 ఎన్95 మాస్కులను అందించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ విట్టల్ మాట్లాడుతూ కరోనా మళ్లీ కొన్ని ప్రాంతాల్లో కనిపిస్తున్న తరుణంలో,ముందస్తు జాగ్రత్త చర్యలుగా కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ అందించిన ఎన్-95 మాస్కులు ఆరోగ్య సంరక్షణ రంగానికి ఎంతో మేలు చేయగలవని పేర్కొన్నారు, ఆదివారం ఆయన చాంబర్లో ఏర్పాటు చేసిన కార్యక్రమం లో ఎం పి ఉదయ్ శ్రీనివాస్ ఔదార్యంతో కొనుగోలు చేసి తీసుకువచ్చిన మాస్క్ లను ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు రావు సత్య గోపాల్ అక్షయ్,నున్న దొరబాబు చేతులు మీదుగా ఆసుపత్రి అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ విఠల్ మాట్లాడుతూ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ ప్రజల ఆరోగ్యానికి మొదటి ప్రాధాన్యతగా పెట్టి చర్యలు తీసుకుంటున్నారనే అంశం స్పష్టమవుతోందని అన్నారు. ఈ విధంగా రాజకీయ నాయకులు ప్రజల సంక్షేమం కోసం ముందడుగు వేయడం ఇతరులకు కూడా స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని అన్నారు. కరోనా వంటి సంక్షోభంలోకుడా ధైర్యం గా సేవలు అందించెందుకు ఇటువంటి సహకారం స్ఫూర్తి గా నిలుస్తాయని కొనియాడారు. ఇప్పటికే ఆసుపత్రి అభివృద్ధికి పలు ప్రణాళికలు రూపొందించి కార్యాచరణ దిశగా అడుగులు వేయడం అభినందనీయ మన్నారు. ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ అందించిన మాస్క్ లు వైద్యులకు, సిబ్బందికి ఎంతో ఉప యుక్తం అవుతాయని తెలిపారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు రావు సత్య గోపాల్ అక్షయ్ మాట్లాడుతూ క్యాన్సర్ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో కాకినాడ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ప్రత్యేక క్యాన్సర్ యూనిట్‌ను ఏర్పాటు చేయడానికి ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ శ్రీకారం చుట్టారని తెలిపారు. ఈ యూనిట్ స్థాపనకు లోక్‌సభ సభ్యుడు ఉదయ్ శ్రీనివాస్ ఇప్పటికే కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. ఈ యూనిట్ ద్వారా సమగ్ర క్యాన్సర్ చికిత్స సేవలు, ల్యాబ్ పరీక్షలు, కీమోథెరపీ,అవసరమైన యంత్రాలు,నిపుణుల సలహాలు తదితర సేవలు అందుబాటులో ఉండనున్నాయన్నారు. ప్రజలకు అత్యాధునిక వైద్యసేవలు అందించేందుకు ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ చొరవ క్యాన్సర్ రోగులకు సత్వర మేలు జరుగుతుందని ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు రావు సత్య గోపాల్ అక్షయ్ తెలిపారు. నున్న దొరబాబు మాట్లాడుతూ కాకినాడ ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ కార్పొరేట్ ఆసుపత్రులకు ధీటుగా వైద్య సేవలు అందించడంలో మంచి ప్రగతి కనబరుస్తూ అరుదైన వైద్య సేవలు,శస్త్ర చికిత్సలు నిర్వహించి కీర్తిని చాటుకుంటుందని తెలిపారు.

ఈ హాస్పిటల్ లో సమర్థ వంత మైన పర్యవేక్షణ, నిపుణులైన వైద్యులు, ఆధునిక వైద్య పరికరాలు, అత్యవసర సేవలు రోగుల కు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. జిజి హెచ్ ఆసుపత్రి కార్పొరేట్ ఆసుపత్రుల స్థాయిలో, పేద, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో గొప్ప అభివృద్ధిని సాధిస్తున్న తరుణం లో కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ నేతృత్వం లో రాబోయే అయిదేళ్ల లో కాకినాడ జిజిహెచ్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం లో అగ్రగ్రామిగా నిలువ నుందని నున్న దొర బాబు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో డిప్యూటీ కలెక్టర్, అడ్మినిస్ట్రేటర్ ఎన్. శ్రీ ధర్, ఏ ఆర్ ఎమ్ వో డాక్టర్ వై. లావణ్య, అసిస్టెంట్ ప్రొఫెసర్ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ యమున,హెల్త్ ఇన్ స్పెక్టర్ సువర్ణ రాజు, తదితరులు ఉన్నారు.

# అభివృద్ధి సంక్షేమమే తెలుగుదేశం పార్టీ లక్ష్యం



కాకినాడ సిటీ నియోజకవర్గ మహానాడులో వనమాడి కొండబాబు,జ్యోతుల నవీన్

కాకినాడ.పెన్ పవర్ మే 18 :రాష్ట్ర అభివృద్ధి, ప్రతి పేదవాని కుటుంబానికి సంక్షేమ పథకాల అమలు చేయడమే తెలుగుదేశం లక్ష్యమని కాకినాడ సిటీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక సూర్య కళామందిరం నందు శాసనసభ్యులు వనమాడి కొండబాబు గారి ఆధ్వర్యంలో కాకినాడ సిటీ నియోజకవర్గ మహానాడు పండగ వాతావరణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్, సీనియర్ నాయకులు చిక్కాల రామచంద్రరావు, శాసనమండలి సభ్యులు పేరాబత్తుల రాజశేఖర్, నియోజకవర్గ పరిశీలకులు దేశంశెట్టి వెంకట లక్ష్మీనారాయణ, మరియు తెలుగుదేశం పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. ముందుగా తెలుగుదేశం పార్టీ పతాకావిష్కరణ చేసి అనంతరం స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సమావేశంలో బీసీ, ఎస్సి, మైనారిటీ, వాణిజ్య, మహిళ, యువత, కార్మికుల సంక్షేమంపై పలు తీర్మానాలు చేసి ఆమోదింప చేశారు. ఈ సందర్భంగా వనమాడి కొండబాబు మాట్లాడుతూ ప్రతి పేదవాడికి కూడు, గుడ్డ, నీడ, అందించాలని ఆశయంతో ఆనాడు స్వర్గీయ నందమూరి తారక రామారావు గారు తెలుగుదేశం పార్టీని స్థాపించారని, పేద వర్గాల కోసం తెలుగుదేశం పార్టీ అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిందని, ఆంధ్ర రాష్ట్ర ప్రజల కోసం నిరంతరం పరితపించే ఏకైక నాయకుడు నారా చంద్రబాబు నాయుడు అని గత వైసీపీ ప్రభుత్వ పాలనలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలను అనేక వేధింపులకు గురిచేసిన ప్రతి కార్యకర్త తెలుగుదేశం పార్టీని అధికార గెద్దనెక్కి%శీ%చేందుకు ప్రతి కార్యకర్త నిరంతరం శ్రమించారని, అటువంటి కార్యకర్తలు ఉన్న పార్టీ తెలుగుదేశం పార్టీ అని పేర్కొన్నారు. జ్యోతుల నవీన్ మాట్లాడుతూ అన్న ఎన్టీఆర్ ఆశయాలతో తెలుగుదేశం పార్టీ ముందుకు సాగుతుందని, కార్యకర్తల సంక్షేమమే కోసం ఆలోచించే ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ అని స్వర్గీయ నందమూరి తారకరామారావు జయంతిని పురస్కరించుకొని మే 27, 28, 29 తేదీలలో రాష్ట్ర మహానాడు నిర్వహించడం, నియోజకవర్గ మరియు జిల్లాస్థాయిలో మహానాడు నిర్వహించడం ఆనవాయితీ అని పేర్కొన్నారు.

చిక్కాల రామచంద్రరావు మాట్లాడుతూ పేద వర్గాలకు పింఛన్ అమలు, కిలో రెండు రూపాయలకే బియ్యం వంటి సంక్షేమ పథకాలు అమలు చేసిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని, 45 సంవత్సరాల సుదీర్ఘకాలంలో ఎన్ని ఆటుపోట్లు ఎదుర్కొన్న పేద వర్గాల కోసం ఆలోచించే పార్టీ తెలుగుదేశం పార్టీ అని పేర్కొన్నారు. శాసనమండలి సభ్యులు పేరాబత్తుల రాజశేఖర్ మాట్లాడుతూ నేను తెలుగుదేశం పార్టీ కార్యకర్తను అని గర్వంగా చెప్పుకునే ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ అని, అటువంటి తెలుగుదేశం పార్టీలో ఉంటూ ప్రజలకు సేవ చేయడం మనమందరి అదృష్టమని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు మల్లిపూడి వీరు, గ్రంధి నారాయణరావు, సుంకర తిరుమల కుమార్, పెంకే శ్రీనివాస బాబా, కొండమూరి సత్యనారాయణ, పినపోతు తాతారావు, వాసిరెడ్డి ఏసుదాసు, బోళ్ల కృష్ణ మోహన్, తుమ్మల రమేష్, కలగా శివరాణి, మెంటారావు, మల్లిపూడి నాగ దీపిక, బంగారు సూర్యావతి, గుజ్జు దుర్గ, కటకంశెట్టి ప్రభాకర్, కొల్లాబత్తుల అప్పారావు, బచ్చు శేఖర్, వనపర్తి బద్రి, తాజుద్దీన్, తుమ్మల సునీత, బోనేపల్లి శ్రీనివాస్, దండుప్రోలు నాగబాబు, రహీమ్, ఓమ్మి బాలాజీ, పంతాడి రాజు, చొల్లంగి వీరబాబు, బాలసాడి రంగారావు, సీకోటి అప్పలకొండ, అంబటి చిన్న, చెక్కా శ్రీనివాస్, గుజ్జు లక్ష్మణరావు, మల్లాడి గంగాధరం, మూగు రాజు, గెద్దం పూర్ణ చంద్రశేఖర్,గాది శివరామకృష్ణ, కోపనాతి నాగకుమారి,బంగారు సత్యనారాయణ,వడిసెల దాలమ్మ,పోలిపల్లి జగన్ తదితరులు పాల్గొన్నారు.

# హామీలను తుంగలోకి తొక్కి మహిళలను మోసం చేసిన కూటమి ప్రభుత్వం

రాష్ట్ర వైసీపీ మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి



కాకినాడ.పెన్ పవర్ మే 18 :సూపర్ సిక్స్ అంటూ సాధ్యం కానీ పథకాలను ఎజెండాలో చేర్చి సూపర్ మోసాలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పథకాలను అమలు చేయలేక చేతులెత్తేసిందని రాష్ట్ర వైసీపీ మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి విమర్శించారు. ఆడబిడ్డల భవిష్యనిధి, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం ఉచిత గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం పథకాలను ఇచ్చి మహిళలను ఉద్ధరిస్తానని గొప్పలు చెప్పిన చంద్రబాబు ఎప్పటిలాగే తనకు అలవాటైన మోసాలతో మహిళలను మరొక్కసారి మోసం చేశారని అన్నారు. అధికారం చేపట్టి ఏడాదికాలం గడుస్తున్న ఇచ్చిన హామీలను నిలబెట్టుకునే దిశగా ఈ ప్రభుత్వం ప్రయత్నం చేయకపోగా కర్నూలు లో జరిగిన సభలో ఇప్పటికే మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించారని కర్నూలు సభలో చంద్రబాబు మాట్లాడడం విడ్డూరంగా ఉందని ఆమె అన్నారు. మహిళలలో పేదరికం తనకు కనిపిస్తే 2029 లో పథకాలు అమలు చేస్తానని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని ఆమె అన్నారు. ఎన్నికల ముందు మహిళలలో కనిపించిన పేదరికం అధికారం చేపట్టాక చంద్రబాబు కళ్ళకు కనిపించడం లేదని దీనిని బట్టి చూస్తే ముఖ్యమంత్రి తనకు నచ్చిన కొంతమంది అభివృద్ధి చెందిన ముఖ్యులకే ముఖ్యమంత్రి కానీ పేదలైన వారికి పేదలైన మహిళలకు ముఖ్యమంత్రి కాదు అన్నట్లు వ్యవహరిస్తున్నారని ఆమె విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పాలనలో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా నేరుగా వాళ్ళ అకౌంట్లోకి డబ్బులు జమ చేసే వారని దీంతో మహిళలు ఆర్థికంగా బలపడి అభివృద్ధి చెందేవారని తెలిపారు. అయితే ఇప్పుడున్న కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మహిళలకు అన్ని విధాల ఆదుకుంటానంటూ గొప్పలు చెప్పిన చంద్రబాబు ఏడాది పాలన గడుస్తున్న ఏ ఒక్క పథకాన్ని మహిళలకు అందజేయలేదని ఆమె వాపోయారు. ఇలా ఇచ్చిన వాగ్దానాలన్నింటినీ ఒక్కొక్కటి నిర్వీర్యం చేస్తూ మహిళలను మరొకసారి చంద్రబాబు మోసం చేశారని అన్నారు. ప్రజలు ఈ ప్రభుత్వ పాలనను గమనిస్తున్నారని ఇప్పటికే కూటమి పాలనపై వ్యతిరేకతతో ఉన్నారని ఆమె అన్నారు. మహిళలను మోసం చేసిన ఏ ప్రభుత్వం ఎక్కువ కాలం మనజాలదని త్వరలోనే ప్రభుత్వంపై ప్రభుత్వం ఇచ్చిన బూటకపు హామీలపై మహిళలు తిరగబడే రోజు వస్తుందని ఆమె హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 1 లక్ష 61 వేల కోట్లు అప్పు చేసిందని ఆ ధనాన్ని ఏమి చేసిందో శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# నేడు గూడెంలో తిరంగా ర్యాలీ

తాడేపల్లిగూడెం, పెన్ పవర్,మే 18:తిరంగా ర్యాలీ సోమవారం తాడేపల్లిగూడెంలో నిర్వహించనున్నారు. ఉదయం ఎనిమిదినర గంటలకు టౌన్ పోలీస్ స్టేషన్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం నుండి మోడ్రన్ కేఫ్ పోలీస్ ఐలాండ్ వరకు ఈ ర్యాలీ సాగుతుంది. శాసనస భ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో అమరవీరుల సంస్మరణార్థం తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్నారు. నియోజకవర్గంలోని ప్రజలు బిజెపి, తెలుగుదేశం, జనసేన కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

# అయినవిల్లి శ్రీ విఘ్నేశ్వర స్వామి వారికి 369 గ్రాముల బంగారు పాదుకలు



అయినవిల్లి, పెన్ పవర్ మే 18:ప్రముఖ పుణ్యక్షేత్రమైన అయ్యనవిల్లి శ్రీ విఘ్నేశ్వర స్వామి వారికి కొత్తపేట వాసులు వెంకట సూర్య సుబ్బరాజు, శ్వేత దంపతులు తమ భక్తిశ్రద్ధలతో 369 గ్రాముల బంగారు శఠారిని (పాదుకలు) సమర్పించారు. ఈ బంగారు శఠారి విలువ సుమారు రూ. 30 లక్షలు.

వెంకట సూర్య సుబ్బరాజు గారు, పూర్వ ఆంధ్రప్రదేశ్ తొలినాళ్లలో శాసనసభ్యులుగా సేవలందించిన కీ.శే. మంతెన సుబ్బరాజు గారి వంశవారు. తల్లిదండ్రులు వెంకట కృష్ణం రాజు, దుర్గావతి దంపతులు.

ఈ సందర్భంగా ఆలయ అర్చక స్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించి, పాదుక సంప్రోక్షణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం దంపతులను శేష వస్త్రములతో సత్కరించి వేదాశీర్వచనములు అందించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి వారు దంపతులకు అభినందనలు తెలియజేసి, స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు.

# జనసేన సభ్యత్వ కిట్టు అందజేత



తాడేపల్లిగూడెం, పెన్ పవర్, మే 18: జనసేన క్రియాశీలక సభ్యత్వ కిట్టును స్థానిక ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ నాయకులకు అందజేశారు. ఉభయగోదావరి జిల్లా కోఆర్డినేటర్ కసిరెడ్డి మధులత అధ్యక్షతన ఆదివారం సమావేశం జరిగింది. పట్టణ జనసేన పార్టీ వార్డు వాలంటీర్స్ కి ఈ కిట్టును ఎమ్మెల్యే అందజేశారు. శాసనస భ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ రాజకీయాల్లో కార్యకర్తలు ముందుండి నడిపితేనే పార్టీ పరుగులు తీస్తుందని ఈ విషయాన్ని గుర్తించిన పవన్ కళ్యాణ్ కార్యకర్తలను వారి కుటుంబంలో ఒక్కరిగా చూస్తారన్నారు. మిగిలిన రాజకీయ పార్టీల మాదిరి కాకుండా జనసేన పార్టీ ఎల్లప్పుడు కార్యకర్తలకు వెన్నంటి ఉంటుందన్నారు. జనసేన కుటుంబంలో ఎవరైనా ప్రాణాలు కోల్పోతే మనం అందించిన ప్రతి రూపాయి ఆ కుటుంబానికి 5 లక్షల పార్టీ ఆర్థిక సహాయంగా అందుతుందని తెలిపారు. యాక్సిడెంట్ జరిగితే 50 వేల రూపాయలు ఆర్థిక సాయం గా ఆయా కుటుంబాలకు అందిస్తున్న ఏకైక పార్టీ జనసేన అని అన్నారు. ఈ కార్యక్రమంలో వర్తనపల్లి కాశి, పుల్లా బాబి, అడపా ప్రసాద్, ఎన్ వి, నేలపాల దినేష్ ,పాలూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


## భూములు కౌలు హక్కు బహిరంగ వేలం ప్రకటన

డా॥బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, అయినవిల్లి మండలం, మాగాం గ్రామములో వేంచేసియున్న శ్రీ మల్లేశ్వరస్వామివారి దేవస్థానం హక్కు భుక్తంలో గల ఈ క్రింది పేర్కొనబడి పల్లపు మెరక భూములు 2025 - 2026 సంవత్సరం నుండి 2027-2028 సంవత్సరం వరకూ అనగా 3 సం॥ల కాలమునకు కౌలుకు ఇచ్చు నిమిత్తము దేవాదాయ, ధర్మాదాయశాఖ అధికారులు సమక్షమున బహిరంగ వేలంపాట జరుపబడును. ఆంధ్రప్రదేశ్ హిందుమత దేవాదాయ, ధర్మాదాయశాఖ చట్టములోని సెక్షన్ (82)లోని ఉపసెక్షన్ (1) ప్రకారం మరియు ఆంధ్రప్ప్రదేశ్ ప్రభుత్వ జి.ఓ.యం.యస్.నెం. 379. ది. 11-03-2003 ప్రకారం జారీ చేయబడిన నిబంధనలను అమసరించి సదరు భూములు కౌలు హక్కునకు వేలం పాట జరుపబడును.

ది. 22-05-2025 ఉదయం 10-00గం॥లకు మాగాం గ్రామంలో సదరు దేవస్థానం ఆవరణలో ఈ క్రింది ఉదయహరించిన భూములను కౌలుకు బహిరంగ వేలంపాట జరుపబడును.

| వ.నెం. | భూమి ఉన్న గ్రామం | రి.స.నెం | భూమి విస్తీర్ణం | పల్లం / మెరక | పాటధరావత్తు | సాల్వెన్సీ సర్టిఫికెట్ |
|---|---|---|---|---|---|---|
| 1. | మాగాం కొబ్బరి చెట్టుఫల సాయం అనుభవించు హక్కునకు | 5/2 | 5-14 | మెరక | రూ. 10000/- | రూ. 500000/- |
| 2. | మాగాం | 302/4<br>304 | 1-13<br>5-36<br>6-49 | పల్లం | రూ. 10000- | రూ. 500000/- |
| 3. | మాగాం | 53/2 | 0-27 | పల్లం | రూ. 1000/- | రూ. 50000/- |
| 4. | కె. జగన్నాధపురం | 75/10 | 0.16 | పల్లం | రూ. 500/- | రూ. 5000/- |

**పాట షరతులు :**

1) ఈ వేలంపాట హిందూ దేవాదాయ ధర్మాదాయశాఖ డిపార్ట్‌మెంటు వారి ఉత్తర్వులకు లోబడి జరుగుచున్నది.
2. ప్రతీ పాటదారుడు సదరు వేలంపాటలో పాల్గొనదలచినవారు పాటకు ముందుగా ప్రతీ ప్లాటుకు పైన తెలియచేసిన ప్రకారం ధరవాత్తు చెల్లించి ఆధార్‌కార్డు జిరాక్స్ కాఫీ సమర్పించి పాటలో పాటలో పాల్గొనవలెను.
3. ప్రతీ పాటదారుడు గత స్థితుగతులను తెలుపు స్వాల్వెన్సీ సర్టిఫికెట్ భూమియొక్క విలువను రెవిన్యూ అధికారుల వద్దనుండి తీసుకును పాటకు ముందుగా దాఖలు చేయవలెను. స్వాల్వెన్సీ సర్టిఫికెట్ లేనివారు పాటలో పాల్గొనకుండా తిరస్కరించుటకు డిపార్టుమెంట్ అధికారులకు సంపూర్ణహక్కు కలదు.
4. దేవాస్థానమునకు ఏవిధమైన బకాయిలు ఉన్నవారుకాని, లావాదేవీలుగాని పాటలో పాల్గొనరాదు.
5. అతివృష్టి, అనావృష్టి మరియు చీడ, పీడ వగైరాలు సంబందించిన యెడల దేవస్థానం వారికి ఏ విధమైన సంబందములు లేదు. కష్టనష్టములు హెచ్చుపాటదారుడే భరించేనిర్ణయం.
6. సదరు వేలంపాట భూములను ముందుగా చూసుకొని వేలం పాటలో పాల్గొనవలెను.
7. రైతులు స్వయంగా ప్రకటించిన క్రాపహాలీడేతో దేవస్థానం వారికి ఏవిధమైన సంబందములేదు.
8. సదరు వేలంపాట భూములను హెచ్చుపాటదారుడు తమ సొంత ఖర్చులతో వ్యవసాయము చేసుకొని హక్కునకు మాత్రమే పాట పెట్టుబడను.
9. హెచ్చుపాటదారుడు పేరున పాట కొట్టివేసిన వెంటనే హెచ్చుపాటదారుడు ఒక సంవత్సరము పాట మొత్తం సొమ్ము సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించి రశీదు పొందవలెను. అట్లు చెల్లించకుండా పాట షరతులను భంగపరిచిన యెడల అతని కట్టిన ధరావత్తు సొమ్ము మొత్తం అపరాధం క్రిందం దేవస్థానముకు జమకట్టుకొనుటయే గాక వెంటనే మరలా ఆ భూమిని నిలపి వేలం పాట పెట్టబడును.
10. హెచ్చుపాటదారుడు శ్రీయుత సహాయక కమీషనర్‌వారు శాఖ, అమలాపురం వారినుండి ఆమోదపు ఉత్తర్వులు ఇచ్చిన తరువాత మాత్రమే భూమిని స్వాధీనం చేయునిర్ణం
11) మిగిలిన షరతులు, వివరములు పాటకాలమందు, పాట సమయంలో తెలుపుపబడును.

మాగాం
ది. 8-05-2025

సం/ అల్లవరపు సుబ్రహ్మణ్యదీక్షితులు
అర్చక & సింగల్ ట్రస్టీ

## నేడు కాకినాడకు రానున్న పద్మశ్రీ మందకృష్ణ మాదిగ



**కాకినాడ.పెన్ పవర్ మే 18 :** మాదిగ జాతి అభ్యున్నతికి అలుపెరుగని పోరాటం చేసిన కొండేపూడి శ్యామ్ బాబు మాదిగకు నివాళులు అర్పించేందుకు ఈనెల 19వ తేదీన మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ కాకినాడ నగరానికివిచ్చేయనున్నారని ఎంఆర్పిఎస్, ఎంఎస్పి జాతీయ నాయకులు ముమ్మడివరపు చినసుబ్బారావు మాదిగ తెలిపారు. కాకినాడ నగరంలో స్థానిక లేడీస్ క్లబ్ వద్దగల పార్కు ఆవరణలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎంఆర్పిఎస్, ఎంఎస్పి జాతీయ నాయకులు ముమ్మడివరపు చినసుబ్బారావు మాదిగ పాల్గొని మాట్లాడుతూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎం.ఆర్.పి.ఎస్ అధ్యక్షులుగా పనిచేసిన కొండేపూడి శ్యామ్ బాబు మాదిగ ఇటీవల పరమపదించిన నేపథ్యంలో ఎంఆర్పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మంద కృష్ణమాదిగ శ్యామ్ బాబు కుటుంబాన్ని పరామర్శించి, సంస్మరణ సభలో పాల్గొనడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా కాకినాడ జిల్లాలో అన్ని నియోజకవర్గాలకు ఇన్చార్జిలను ఏర్పాటు చేసి కూటమి ప్రభుత్వం ద్వారా పార్టీ బలోపేతానికి కృషి చేయడం జరుగుతుందన్నారు.అలాగే ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని అడ్డుపెట్టుకొని అక్రమాలకు,దౌర్జన్యాలకు పాల్పడుతున్న వ్యక్తులను గుర్తించి వారిని నియంత్రించే విధంగా కార్యాచరణ చేపట్టడం జరుగుతుందని తెలిపారు.ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో దొంగలను నియంత్రించడమే కొండేపూడి శ్యాంబాబు మాదిగకు తాము ఇచ్చే నిజమైన నివాలి అని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాకినాడ జిల్లా ఎంఎస్పి అధ్యక్షులు వల్లూరి సత్తిబాబు మాదిగ,వీరబాబు, ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు డోకుబుర్ర భద్రం మాస్టర్,ఎంఎస్ పి కాకినాడ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పలివెల నవీన్ మాదిగ,ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కాకాడ నూకరాజు మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు అనంతవరపు రాజు మాదిగ, ఎం.ఎస్.పి జిల్లా ప్రధాన కార్యదర్శి దూలపల్లి వెంకటరమణ,మాదిగ లాయర్ల ఫెడరేషన్ కాకినాడ జిల్లా అధ్యక్షులు కిలాడి దయానందరాజు,ఎంఇఎఫ్ జిల్లా అధ్యక్షులు చాట్ల ఆశీర్వాదం,ఎంఎంఎస్ నాయకురాలు మోటుకూరి వరలక్ష్మి, తుమ్మలపల్లి చిన్న, కింతాడ సత్తిబాబు, నందిక వీరబాబు,తదితరులు పాల్గొన్నారు.ం

## అంతర్రాష్ట్ర కూరగాయ మార్కెట్ పనివేళలు మార్పు.



**ఆలమూరు, పెన్ పవర్,మే18:** 216 ఏ జాతీయ రహదారి పక్కన మండలంలోని మడికి వద్ద ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర కూరగాయ మార్కెట్ పనివేళలలో ఈనెల 20 నుంచి మార్పులు చేస్తున్నట్లు మార్కెట్ కమిటీ అధ్యక్షుడు పాలూరి సత్యనారాయణ(సత్తిబాబు) ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రదేశంలో మార్కెట్ ఏర్పాటు చేసిన దగ్గర నుంచి ప్రతి రోజు రెండు దఫాలుగా క్రయ విక్రయాలు జరుగుతున్నయన్నారు. ఇక్కడకు వచ్చే రైతుల సౌకర్యార్థం ఉదయం జరిగే మార్కెట్ సమయం వేకువ జామున యధావిధిగాను, మధ్యాహ్నం జరిగే మార్కెట్ సమయం లో మార్పు చేస్తూ మధ్యాహ్నం తరువాత రెండు గంటల నుంచి మాత్రమే మార్కెట్ నందు క్రయ విక్రయాలు జరుగుతాయన్నారు. దీనికి కారణం చెబుతూ మధ్యాహ్నం జరిగే మార్కెట్ సమయంతో రైతులకు భోజనానికి అంతరాయం ఏర్పడటంతో ఇబ్బందులు పడుతున్న విషయం కమిటీ దృష్టికి వచ్చిందన్నారు. దీంతో మార్కెట్ కమిటీ స్పందించి, సభ్యులతో కూలంకషంగా చర్చించి, ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధ్యక్షుడు సత్తిబాబు తెలిపారు. పై విషయాలపై వినియోగదారులు వ్యాపారులు రైతులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి చెల్లబోయిన సింహాచలం, ఉపాధ్యక్షుడు దొండపాటి వెంకటేశ్వరరావు(బుల్లి రెడ్డి), అందే బుజ్జి, నల్ల వీరబాబు, వెంకట రామారావు, కొత్తపల్లి బుజ్జి దొండపాటి సాయి, తదితర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## కంబాల ఆధ్వర్యంలో భారీ తిరంగా ర్యాలీ





**పెన్ పవర్,మే18:** పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతికారంగా చేపట్టిన ఆపరేషన్ సింధుర్ విజయవంతం కావడంతో దేశ సైనికులకు సంఘీభావం తెలుపుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆదేశాల మేరకు విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ నాయకులు కంబాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రం గోకవరంలో 330 అడుగుల జాతీయ జెండాతో భారీ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో కులమత, పార్టీలకతీతంగా ప్రజలు పాల్గొన్నారు. పంచాయతీ కార్యాలయం నుంచి ర్యాలీ ప్రారంభమై, ప్రధాన రహదారిలో దేవిచౌక్ మీదగా మండల పరిషత్ కార్యాలయం వరకు సాగింది.

మండల పరిషత్ కార్యాలయం వద్ద, జవాన్లు రామకృష్ణ, నరేష్ కుమార్ లను కంబాల శ్రీనివాసరావు ఘనంగా సత్కరించారు.ఆపరేషన్ సింధూర్ లో దేశం కోసం ప్రాణాలర్పించిన మురళి నాయక్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు.

# సైనికుల పోరాటం త్యాగం స్వేచ్ఛ కు కారణం.

- మండపేట లో తిరాంగా యాత్ర.
- సర్వమత ప్రార్థనలు.
- ఆకట్టుకున్న అతి పెద్ద జాతీయ జెండా.




**మండపేట. పెన్ పవర్.మే 18 :** దేశ సరిహద్దులో త్రివిధ దళాల సైనికులు చేస్తున్న పోరాటం, త్యాగాల వల్లే భారత భూభాగంలో పౌరులు ఆనందంగా జీవిస్తున్నామని మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. ఆదివారం మండపేట పట్టణంలోని రథం ఆలయం నుండి బస్ స్టాండ్ వరకు నిర్వహించిన భారీ తిరంగా యాత్ర ర్యాలీలో ఎమ్మెల్యే వేగుళ్ళతో పాటు జనసేన ఇన్ ఛార్జ్ రాష్ట్ర నీటి పారుదల సంస్థ కార్పొరేషన్ చైర్మన్ వేగుళ్ళ లీలా కృష్ణ, బిజెపి నియోజక వర్గ కన్వీనర్ కోటిపల్లి వివి సాయి రామ్ తదితరులు పాల్గన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పెహాల్గామ్ ఉగ్రదాడికి వ్యతిరేకంగా, ఉగ్రవాదులను అణచడానికి, భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సింధూర్ విజయోత్సవం సందర్భంగా త్రివిధ దళాల సైనికులకు సంఘీభావంగా తిరంగా యాత్ర నిర్వహిస్తున్నామన్నారు. ఎంతో ధైర్యంతో భారతదేశం ముందడుగు వేసి భారతీయత చాటి ప్రజలే భారతీయత – ప్రజలే దేశమని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెలుగెత్తి చాటాయన్నారు. భిన్నత్వంలో ఏకత్వానికి తిరంగా ర్యాలీ ఒక చిహ్నమని, భారతీయతకు ఇదొక నిదర్శనమని తెలిపారు. దేశరక్షణ, సరిహద్దుల రక్షణలో అహర్నిశలు నిమగ్నమైన భారత సైనికులకు సంఘీభావం తెలపాలన్నారు. తిరంగా యాత్ర ర్యాలీలో స్వచ్ఛందంగా భాగస్వాములైన ప్రతి ఒక్కరికి క ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. లీలా కృష్ణ మాట్లాడుతూ భారత దేశం ధర్మాన్ని నమ్ముకుందని, భారత సైన్యం ఆపరేషన్ సింధూర్ తో పాకిస్తాన్ కు, శత్రుదేశాలకు స్పష్టంగా అర్థమయ్యేలా నిరూపించారన్నారు. దేశ మహిళల సింధూరం తుడిపిన తీవ్రవాదులకు దేశ మహిళా సైనికుల ద్వారానే గట్టి బుద్ధి చెప్పడం జరిగిందన్నారు. ప్రపంచంలో ఎక్కడ దాక్కున్నా వెతికి వెంట బడి తీవ్రవాదుల తలలు తీసే సత్తా ప్రతి భారతీయుడికి ఉందన్నారు.. రథం సెంటర్ నుంచి బస్ స్టాండ్ వరకు భోలో భారత్ మాతాకీ జై, ఉగ్రవాదులు నశించాలి, భారతీయుల ఐక్యత వర్ధిల్లాలి అనే నినాదాలతో ఉత్సహంగా సాగింది. కలువ పువ్వు సెంటర్ వద్ద సర్వ మత ప్రార్థనలు చేశారు. అనంతరం యుద్ధంలో అసువులు బాసిన అమర జవాన్ మురళీ నాయక్ కు, పహాల్గాం మృతులకు వారు సంతాపం తెలిపారు. ఈ ర్యాలీ లో అతి పెద్ద జాతీయ జెండా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమం లో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు కొన సత్యనారాయణ, దూలీ జయరాజు, నల్లమిల్లి విర్రెడ్డి, ఉంగరాల రాంబాబు, గడి రాంబాబు,తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ గడి సత్యవతి,మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ మందపల్లి చంద్రశేఖర్, బిజెపి జిల్లా కార్యదర్శి గోడవర్తి రామచంద్రరావు, ఎండి కరీం ఖాదారీ, ఎండి కరీం , ఎండి అల్టాఫ్, బొడ్డు రామకృష్ణ,కొవ్వాడ అప్పన్న బాబు, మద్దుల సుబ్బారావు, వివిధ సంఘాల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## ఈనెల 21 నుండి మూలారెడ్డి కళాపరిషత్ జాతీయ స్థాయి సాంఘిక నాటిక పోటీలు.. ఎమ్మెల్యే నల్లమిల్లి..



**అనపర్తి, పెన్ పవర్, మే 18.** నల్లమిల్లి మూలారెడ్డి కళాపరిషత్ జాతీయస్థాయి సాంఘిక నాటిక పోటీలు ఈనెల 21వ తేదీన ప్రారంభమై మే 21,22,23, మే 24 బహుమతి ప్రధానోత్సవం జరుగుతుందని అ నపర్తి ఎమ్మెల్యే పరిషత్ అధ్యక్షులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. అనపర్తి ఎస్ఎన్ఆర్ ఫంక్షన్ హాల్ లో విలేకరుల సమావేశంలో పరిషత్ గురించి ఆయన వివరించారు. 1989లో స్థాపించి ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలో ఒక ప్రతిష్టాత్మక సంస్థగా ఉన్న నల్లమిల్లి మూలారెడ్డి కళాపరిషత్ ప్రతి సంవత్సరం కూడా వివిధ రంగాల్లో నిష్ణాతులు అయిన మహానుభావులకి పరిషత్ తరపున సత్కారం చేయడం మొదటిరోజు ప్రారంభ వేడుకలు, ప్రధానత్సవ సభ అత్యంత వైభవంగా నిర్వహించడం నాటికలు పోటీలు ఎక్కడ రాజీ లేకుండా చేయడమే ఈ పరిషత్ యొక్క ప్రత్యేకత అన్నారు. దానిలో భాగంగానే ఈ సంవత్సరం విశిష్ఠ అతిధులు మహా గ్రూప్స్ ఛానల్ మేనేజింగ్ డైరెక్టర్ వంశీ కృష్ణ దంపతులకు సత్కారం జరుగుతుందన్నారు.

అదే విధంగా ఆరోజు ముఖ్య అతిధులుగా రాష్ట్ర గనుల మరియు అబ్కారీ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, పర్యాటక శాఖ మాత్యులు కందుల దుర్గేష్, రాష్ట్ర బిజెపి అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, అదే విధంగా సాహితీ రంగానికి, కళారంగానికి సేవలందిస్తున్న పూర్వపు మంత్రివర్యులు, ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్, ముఖ్య అతిథులుగా పాల్గొంటారన్నారు. అదే విధంగా ప్రముఖ సినీ నటుడు గౌతమ్ రాజు, హైదరాబాద్ కు చెందిన అభినయ నాటక కళాపరిషత్తు అభినయ శ్రీనివాస్, రాష్ట్ర పరిషత్తు నిర్వహకుల సమాఖ్య అధ్యక్షులు బుద్దాల వెంకట రామారావు మొదటి రోజు కార్యక్రమలలో పాల్గొనడం జరుగుతుందని చెప్పారు. తదుపరి నాటికలు ప్రదర్శన మే 22,23 నాటిక నాటికల ప్రదర్శనలు అయిన తర్వాత మే 24 బహుమతి ప్రధానోత్సవ సభలో రాష్ట్ర కార్మిక శాఖ మాత్యులు వాసంశెట్టి సుభాష్ రాష్ట్ర శాసనసభ ఉపసభాపతి కనుమూరి రఘురామకృష్ణంరాజు ముఖ్య అతిథిగా పాల్గొంటారు.

ఇటీవల ఉభయ గోదావరి జిల్లాల నుంచి శాసనమండలి కి,రాజ్యసభ కి ఎన్నికైన సభ్యులకు సత్కార కార్యక్రమాలు ఉంటాయన్నారు. తెలుగుదేశం పార్టీ నుంచి రాజ్యసభ ఎన్నికైన సానా సతీష్ కి, బిజెపి నుంచి రాజ్యసభ సభ్యులు పాక వెంకట సత్యనారాయణకి బిజెపి తరఫున శాసనమండలికి ఎన్నికైన సోము వీర్రాజుకి, తెలుగుదేశం పార్టీ నుంచి శాసనమండలికి ఎన్నికైన పేరాబత్తుల రాజశేఖర%శీ%కి ఈ నలుగురికి సత్కార కార్యక్రమం ఉంటుందన్నారు. ఆ తదుపరి అదే వేదిక పైన బహుమతి ప్రధానోత్సవం జరుగుతుంది. ఈ మధ్యకాలంలో పరిషత్ నిర్వహణకు కొన్ని అనివార్య కారణాలవల్ల విరామం రావడం జరిగింది. మా పరిషత్ కి మూల స్తంభంగా ఉన్న వెంకట కృష్ణారెడ్డి అకాల మరణం వల్ల, కొంత సమాచారం లోపం వల్ల అందరికీ ఆహ్వానాలు పంపించలేకపోయామన్నారు.

కళాకారులు,కళాభిమానులు మూలారెడ్డి అభిమానులు ఈ నాటక పరిషత్తు పట్ల, కళల ఆసక్తి ఉన్నవారు అందరూ ఇదే ఆహ్వానంగా భావించి మే 21 నుండి మే 24 వరకు జరిగే నల్లమిల్లి మల్లారెడ్డి కళాపరిషత్ కార్యక్రమాల్లో పాల్గొని మీ అభిమానాన్ని, మీ ఆప్యాయతను కళాపరిషత్ కు అందించాలని కోరారు.

ఆహ్వానం ఎవరికైనా అందకుంటే ఇదే ఆహ్వానంగా భావించి ఈ కార్యక్రమంలో పాల్గొనాలని హృదయ పూర్వకంగా ప్రతి ఒక్కరిని ఆహ్వానిస్తున్నన్నారు.

## టీడీపీ తోనే బడుగు,బలహీన వర్గాలకు రాజ్యాధికారం.






**కె గంగవరం పెన్ పవర్ మే 18:** రాష్ట్ర అభివృద్ధి, ప్రతి పేదవాని కుటుంబానికి సంక్షేమ పథకాల అమలు చేయడమే తెలుగుదేశం లక్ష్యమని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ నీతి, నిబద్ధతకు క్రమశిక్షణకు మారుపేరన్నారు. ఆదివారం స్థానిక లయన్స్ క్లబ్ కళ్యాణ్ మండపంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం అధ్యక్షతన రామచంద్రపురం నియోజకవర్గ మహానాడు పండగ వాతావరణంలో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నియోజకవర్గ పరిశీలకులు గన్ని కృష్ణ, తెలుగు దేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు రెడ్డి సుబ్రహ్మణ్యం, సీనియర్ నాయకులు గోపాలబాబు,చింతపల్లి వీరభద్రరావు,మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు శ్రేణులు పాల్గొన్నారు. ముందుగా తెలుగుదేశం పార్టీ పతాకావిష్కరణ చేసి అనంతరం స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పిచారు.ఈ సమావేశంలో పార్టీ కోసం, భవిష్యత్ లో తీసుకొనే సంక్షేమ కార్యక్రమాలు మైనారిటీ, వాణిజ్య, మహిళ, యువత, కార్మికుల సంక్షేమంపై, నిరుద్యోగ నిర్మూలన పై పలు తీర్మానాలు చేసి ఆమోదింప చేశారు.తొలుత సభాధ్యక్షులు వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ ప్రతి పేదవాడికి గూడు, గుడ్డ, నీడ, అందించాలని ఆశయంతో ఆనాడు స్వర్గీయ నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించారని,పేద వర్గాల కోసం తెలుగుదేశం పార్టీ అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిందని,ఆంధ్ర రాష్ట్ర ప్రజల కోసం నిరంతరం పరితపించే ఏకైక నాయకుడు నారా చంద్రబాబు నాయుడు గారి అని అన్నారు.గత వైసీపీ ప్రభుత్వ పాలనలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలను అనేక వేధింపులకు గురిచేశారన్నారు.స్వర్గీయ ఎన్టీఆర్, చంద్రబాబు నాయుడు ఆశయాలను పునికి పుచ్చుకుని మంత్రి సుభాష్ పార్టీ కోసం, ప్రజల కోసం నిరంతరం శ్రమిస్తున్నారన్నారు.కడప మహానాడు సభల పరిశీలనకు వెల్లిన రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ చరవాణి ద్వారా మాట్లాడుతూ రామచంద్రపురం నియోజకవర్గ ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని హామీ ఇచ్చారు.ప్రణాళిక బద్ధంగా నియోజకవర్గంఅభివృద్ధి చేస్తానని, పది మాసాల కాలంలో రూ.116 కోట్లతో నియోజకవర్గం అభివృద్ధి చేశామన్నారు.తెలుగు దేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ మాట్లాడుతూ అన్న ఎన్టీఆర్ ఆశయాలతో తెలుగుదేశం పార్టీ ముందుకు సాగుతుందని, కార్యకర్తల సంక్షేమం కృషి చేసే ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ అని స్వర్గీయ నందమూరి తారకరామారావు జయంతిని పురస్కరించుకొని మే 27, 28, 29 తేదీలలో రాష్ట్ర మహానాడు నిర్వహించడం, నియోజకవర్గ మరియు జిల్లాస్థాయిలో మహానాడు నిర్వహించడం ఆనవాయితీ అని పేర్కొన్నారు. పొలిట్ బ్యూరో సభ్యులు రెడ్డి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పేద వర్గాలకు పింఛన్ అమలు, కిలో రెండు రూపాయలకే బియ్యం వంటి సంక్షేమ పథకాలు అమలు చేసిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని, 45 సంవత్సరాల సుదీర్ఘకాలంలో ఎన్ని ఆటుపోట్లు ఎదుర్కొన్న పేద వర్గాల కోసం ఆలోచించే పార్టీ తెలుగుదేశం పార్టీ అని పేర్కొన్నారు.ఈ నెల 22 పార్లమెంట్ మహానాడు అమలాపురం లో జరుగుతుంది అన్నారు.రానున్న ఆగస్టు నాటికి హామీలన్నీ అమలు చేస్తామన్నారు. అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, అమలు జరుగుతాయి అన్నారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు కడియాల రాఘవన్ స్వర్గీయ ఎన్టీ రామారావు కు భారతరత్న అవార్డు ఇవ్వాలని, పలు తీర్మానాలు ప్రవేశపెట్టి సభ్యులచే ఆమోదింప చేశారు. ఈ కార్యక్రమంలో గరికపాటి సూర్య నారాయణ, అక్కల రిశ్వంత్ రాయ్,నెక్కింటి బాల కృష్ణ, మేడిశెట్టి సూర్యనారాయణ, గుత్తుల బుల్లి రాజు, సలాది పట్టాభి రామయ్య, పెంకే సాంబశివరావు, కొత్తపల్లి శ్రీను, జాస్తి విజయలక్ష్మి, చిన్ని కృష్ణ, పేపకాయల నారాయణరావు, మేడిశెట్టి రవికుమార్, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## బురద వలస గ్రామానికి రహదారి సౌకర్యం ఏర్పాటు చేసుకున్న యువత





**వై రామవరం,పెన్ పవర్, మే 18:** మండలంలో గుర్తేడు పంచాయతీ బురదవలస గ్రామానికి రహదారి సౌకర్యం లేకపోవడంతో, గ్రామస్తులు అందరూ కలిపి రహదారి సౌకర్యం ఏర్పాటు చేసుకున్న సంఘటన ఇది.

మారుమూల గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించడం జరుగుతుందని ప్రకటనలకే అధికారులు పరిమితం అవుతున్నారని బురద వలస గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించలేకపోయారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

వర్షాలు వస్తే కొండలపై ఉన్న తమ గ్రామం రహదారి కొట్టుకుపోతుందని ఈ విషయం అధికారులకు తెలిసిన నిరోధక చర్యలు తీసుకోలేక పోతున్నారని ఆరోపిస్తున్నారు. సంవత్సరానికి ఒక్కసారైనా ఏ అధికారి తమ గ్రామం సందర్శించిన దాఖలాలు లేవని వారు ఆరోపిస్తున్నారు. ఐ టి డిఏ అధికారులు ఉన్న గిరిజనాభివృద్ధి అంటూ ప్రకటనలకే పరిమితం అవుతున్నారు గాని, నేటికీ పక్కా రహదారి బురద వలస గ్రామానికి రహదారి ఏర్పాటు చేయలేకపోయారని బురద వలస గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఎవరో వస్తారు ఏదో చేస్తారని ఆశించకుండా గ్రామస్తులు అందరూ ఏకమై రహదారి సౌకర్యం ఏర్పాటు చేసుకున్న సంఘటన చోటుచేసుకుంది. ఇక నుండైన ఐటిడిఏ అభివృద్ధి అధికారులు స్పందించి తమ గ్రామానికి శాశ్వతంగా రహదారి సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# రెండు మండలాల సరిహద్దుల్లో ఉన్న పెద్దేరు పై ఇసుక బకాసురులు





**తెలిసినా కేసులు నమోదు చేయలేని అధికారులు**

**వై రామవరం,పెన్ పవర్, మే 18:** రెండు మండలాల సరిహద్దుల్లో ఉన్న పెద్దేరు లో ఇసుకను నిబంధనలకు విరుద్ధంగా సేకరిస్తున్న ఇసుక బకాసురులపై ఏ విధమైన కేసులు నమోదు చేసిన దాఖలాలు లేవని స్థానికులు ఆరోపిస్తున్నారు.

వివరాల్లోనికి వెళ్తే అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు, వై.రామవరం మండలాల సరిహద్దుల్లో పెద్దేరు ప్రవహిస్తుందని తెలిపారు. యు. చీడిపాలెం, బూరుగు వాడ సరిహద్దు గ్రామాలలో ఉన్న పెద్దేరు నుండి అక్రమంగా నిబంధనలకు విరుద్ధంగా యంత్రాలతో ఇసుకను సేకరిస్తూ స్టాక్ చేయుచున్నారని ఆయా గ్రామస్తులు తెలిపారు. సెలయేర్ల నుండి యంత్రాలతో ఇసుక సేకరించడం ఒక నేరమైతే, ఇసుకను నిలువ చేయడం మరో నేరమని అంటున్నారు. ఏజెన్సీలో ఇసుక రీచ్ లు లేకపోవడంతో ఎక్కువగా కొండ కాలువలు,సెలయేర్ల నుండే ఇసుకను సేకరిస్తూ తమ అవసరాలకు ఉపయోగించుకుంటూ ఉంటామని తెలిపారు. కాంట్రాక్టర్లు,దళారుల వ్యవస్థ పెరగడంతో అక్రమ మార్గాలలో ఇసుకను సేకరిస్తూ లక్షలాది రూపాయల ధనాన్ని అర్జిస్తున్నారని తెలిపారు. అత్యవసర పరిస్థితులలో ట్రాక్టర్ ఇసుక మూడు వేల నుండి నాలుగు వేల రూపాయలు వరకు అమ్మకాలు సాగిస్తున్నారని అంటున్నారు. ఇసుక సేకరించేది ఎవరో రెవెన్యూ సిబ్బందికి,సచివాలయం సిబ్బందికి తెలిసిన ఏ ఒక్కరిపై కేసులు నమోదు చేసిన దాఖలాలు లేవని స్థానికుల ఆరోపిస్తున్నారు. ఇసుక నిలువలు ఉన్న చోటికి శుక్రవారం వైరామవరం తహసిల్దార్ వెళ్లి ప్రత్యక్షంగా చూశారని స్థానికులు అంటున్నారు. ఇసుక నిలువలు ఉన్నచోట ఏ విధమైన యంత్రాలు లేకపోవడంతో ఎవరి మీద కేసు పెడతామని అంటున్నారని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇసుకను తరలిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని అన్నారే తప్పా 24 గంటలు గడిచిన ఏ ఒక్కరి మీద కేసు నమోదు చేయలేదని అంటున్నారు. ఏదేచ్ఛగా రాత్రి సమయంలో ఇసుకను ట్రాక్టర్లతో రవణా చేసుకో పోవుచున్నారని స్థానిక గిరిజనులు తెలిపారు. ఇకనైనా పై అధికారులు స్పందించి అక్రమంగా నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను సేకరించి నిలువ చేసిన వారిపై కేసులు నమోదు చేయాలని గిరిజనులు కోరుతున్నారు.

## సరిపడా గోనె సంచులు రైతులు తీసుకునే అవకాశం



**పెనుమంట్ర, పెన్ పవర్, మే-18:**మండలంలో రబీ సీజన్ లో 12123 ఎకరాలలో వరి పంట సాగు చేయబడినదని,
దీనికి గాను 43900 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చినట్లు గుర్తించినట్లు మండల వ్యవసాయ అధికారి జ్యోషీలా శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల ద్వారా మొత్తం ధాన్యం కొనుగోలు సరిపడా గోనె సంచులు రైతులకు అందజేసినట్లు తెలిపారు. క్రమ పద్ధతిలో రోజుకి 1000 నుండి 1500 ఎం టి ఎస్ వరకు రైతులు కోరిన మిల్లులకు నాణ్యత ప్రమాణాలకు లోబడి కొనుగోలు చేస్తున్నామని అన్నారు. మరియు ప్రభుత్వం వారు నిర్ణయించిన మద్దతు ధర రైతుల ఖాతాలకు నేరుగా జమ చేయబడుతున్నాయన్నారు. ఇప్పటి వరకూ మొత్తం 40150 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయడం పూర్తి చేశామని అన్నారు. ఇంకా 3750 మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేయవలసి ఉందని అన్నారు. రాబోవు మూడు రోజులలో కొనుగోలు పూర్తి చేస్తామని తెలిపారు.ం

## గ్రంథాలయంలో విద్యార్థుల కు శిక్షణ



**పెనుమంట్ర,పెన్ పవర్, మే-18:**మండలంలోని మార్టేరు శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా 20వ రోజు విశ్రాంత ఆంగ్ల ఉపాధ్యాయులు పి. సువర్ణగౌరి పిల్లలకు ఇంగ్లీష్ స్టోరీ రీడింగ్ మరియు టెల్లింగ్ నేర్పించడం జరిగినదని గ్రంథ పాలకుడు పిటిఎస్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ
పిల్లల చేత కథలు బుక్స్ చదివించడం జరిగినదని తెలిపారు.ఈ వేసవి విజ్ఞాన శిబిరంలో యమ్. జాహ్నవి, కె. భవ్య, కె. కళా శ్రీ, బి. పూర్విక, యస్. సుభాష్, బి. గీత, కె. సాయి, సి.ఆర్. రోనాల్డ్, జె. మోహన్, బి. కార్తిక, కె. దీపిక తదితర విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని మానవత మరియు గ్రంథాలయ సిబ్బంది కలిసి నిర్వహించినట్లు తెలిపారు.

## రెండు మద్యం బెల్ట్ షాపులపై పోలీసుల దాడి

**15 మద్యం బాటిల్ స్వాధీనం**

**రాజవొమ్మంగి పెన్ పవర్ మే 18:** రాజవొమ్మంగి మండలం కిమ్మలగడ్డ గ్రామంలో అక్రమంగా మద్యం అమ్ముతున్న వారిని వద్ద నుంచి ఐదు మద్యం బాటిల్ స్వాధీనం చేసుకున్నారు . అదుపులోకి తీసుకున్నారు .అలాగే రాజవొమ్మంగి ,గ్రామంలో అక్రమ మద్యం బెల్ట్ షాప్ 10, బాటిల్స్ స్వాధీనపరుచుకున్నారు, పోలీసుల సమాచారం మేరకు రాజవొమ్మంగిలోని అక్రమంగా మద్యం అమ్ముతున్న వారి వద్ద నుంచి 15. మద్యం బాటిల్స్ ని ఇరుచోట్ల అక్రమ మద్యం బాటిల్స్ విలువ 1197 రూపాయలు విలువ ఉన్నట్లు రాజవొమ్మంగి ఎస్సై నరసింహమూర్తి మీడియాకు తెలిపారు అలాగే బహిరంగ ప్రదేశంలో మద్యం సేవించడం కానీ అసంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆయన తెలిపారు.

# ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ






- మంత్రి రామానాయుడు ఆదేశాలకు మట్టపర్రు సర్పంచి ఆధ్వర్యంలో..
- కృతజ్ఞతలు తెలిపిన కూలీలు

**పెనుమంట్ర, పెన్ పవర్, మే 18:** మండలం మట్టపర్రులో ఆదివారం ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ పంపిణీ చేశారు. రాష్ట్ర జలవనరుల అభివృద్ధి శాఖ మంత్రిని నిమ్మల రామానాయుడు ఆదేశాల మేరకు మట్టపర్రు సర్పంచి దొమ్మేటి శీను ఆధ్వర్యంలో కూలీలకు మజ్జిగ అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచి దొమ్మేటి శ్రీను మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో గ్రామస్తులు ఉపాధి హామీ పనులు చేయడానికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. నివాసాలకు దూరంగా పొలాల మధ్యలో దాహార్తి తీర్చేందుకు మజ్జిగ పంపిణీ చేయడం ఆత్మసంతృప్తిని కలిగించింది అన్నారు. మజ్జిగ తాగిన కూలీలు దాహం తీరి సంతోషించటం తనకెంతో ఆనందాన్నిస్తుంది అన్నారు. తమను భాగస్వాములుగా చేసినందుకు మంత్రి రామానాయుడు కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మట్టపర్రు టిడిపి గ్రామ అధ్యక్షుడు కేత హరి వెంకటకృష్ణ, బూత్ కన్వీనర్ విష్ణు, పంచాయతీ కార్యదర్శి శేఖర్ బాబు, కూలీలు తదితరులు పాల్గొన్నారు.

# పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు ఆధ్వర్యంలో తిరంగా యాత్ర ర్యాలీ





● ఆపరేషన్ సిందూర్ సైనికులకు కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే

**గోపాలపట్నం, పెన్ పవర్, మే 18 :** విశాఖ పశ్చిమ నియోజకవర్గం కార్యాలయం, గోపాలపట్నం నందు
ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పెథకం శెట్టి గణబాబు
ఆధ్వర్యంలో తిరంగా యాత్ర ర్యాలీ ఘనంగా నిర్వహించారు. గోపాలపట్నం పశ్చిమ నియోజకవర్గ కార్యాలయం నుండి బాజీ జంక్షన్, ఎన్ఏడి వరకు
ఆపరేషన్ సింధూర్ విజయవంతం చేసిన భారత సైన్యానికి కృతజ్ఞతలు తెలుపుతూ దేశ రక్షణలో ప్రాణత్యాగం చేసిన వీర జవాన్లకు శ్రద్ధాంజలి అర్పిస్తూ తిరంగా ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే గణబాబు మాజీ సైనిక అధికారులకు, సైనికులకు ఘనంగా సత్కరించి, గౌరవించడం జరిగింది. ఆపరేషన్ సింధూర్ లో పాల్గొని సెలవుపై నగరానికి విచ్చేసిన వీర సైనికున్ని సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ
ఉగ్రవాదులు జమ్మూకాశ్మీర్లో పర్యాటకులపై విచక్షణ రహితంగా కాల్పులు జరిపి, అమాయకులైన ప్రజలు, పర్యాటకులను వెంటాడి డైరెక్టుగా కాల్పులు జరిపారని,
ఈ టెర్రలిస్టులు అరచకమైన వాతావరణం నెలకొల్పడానికి భారతదేశంలో ఎన్డీఏ ప్రభుత్వంలో ప్రశాంతమైన వాతావరణం నెలకొల్పడానికి చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. మృతి చెందిన వారిలో విశాఖ నగరవాసి జె.చంద్రమౌళిని కోల్పోయామని తెలిపారు.ఆపరేషన్ సింధూర్ విజయవంతంతో పాకిస్తాన్ ఉగ్రవాదులకు మన సైనికుల వీరోచిత పోరాటంతో మన శక్తి ఏంటో తెలిసిందాని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గున్న టీడీపీ యువనేత మౌర్య సింహ, జోనల్ కమిషనర్ హేమలత, టీడీపీ వార్డ్ కార్పొరేటర్లు దాడి వెంకట రమేష్, బొమ్మిడి రమణ, గల్లా చిన్న, శరగడం రాజశేఖర్ మరియు మాజీ సైనికులు, ఎన్సిసి స్టూడెంట్స్, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, ముస్లిం సోదరులు, కార్యకర్తలు, మహిళ నాయకులు, రెవెన్యూ అధికారులు, అధిక సంఖ్యలో స్టూడెంట్స్, మహిళలు పాల్గున్నారు.



## ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో ఒకరు మృతి ఇద్దరు కు తీవ్ర గాయాలు

**విషాదంలో మునిగిన పెంటపాడు గ్రామం**

**చింతపల్లి పెన్ పవర్ మే 17: -** చింతపల్లి నర్సీపట్నం ప్రధాన రహదారిరౌరింతాడ గ్రామ సమీపంలో జాతీయ రోడ్డుపై జరిగినఘోరరోడ్డుప్రమాదంఒకకుటుంబాన్ని విషాదంలో ముంచేసింది. పెంటపాడు గ్రామానికి చెందిన నల్లాల చంద్రరావు (38), భార్య కృష్ణవేణి (32), చంద్రరావు అన్నయ్య కుమారుడు అఖిలేష్ (13) కలిసి బంధువుల రజస్వల కార్యక్రమానికి చిట్రాలగొప్పు వెళ్లి హాజరై తిరిగివస్తుండగా ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. విషాదకర ఘటన రౌరింతాడ గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై జరిగింది. భద్రాచలం నుండివిశాఖపట్నం వెళున్న ఏపీఎస్ ఆర్టీసీ బస్సు ఆ కుటుంబం ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని తీవ్రంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో చంద్రరావుకు రెండు కాళ్లు, చేతులు విరిగిపోగా, కృష్ణవేణికి తలపై తీవ్ర గాయమైంది. అఖిలేష్ రెండు కాళ్లు విరిగిపోయాయి. అటుగా వెళుతున్న ప్రయాణికులు వెంటనే 108 సర్వీసు వాహనానికి సమాచారం అందించగా, సిబ్బంది అప్రమత్తంగా స్పందించి ముగ్గురినీ నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు. చంద్రరావుకు చికిత్స చేసేందుకు వైద్యులు సిద్ధపడుతున్న సమయంలోనే చంద్రరావు మృతిచెందారు. తీవ్ర గాయాలపాలైన కృష్ణవేణి, అఖిలేష్‌ను మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నంలోని కేజీహెచ్ కి తరలించారు. మృతుడు చంద్రరావుకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

మృతి చెందిన నల్లల చంద్రరావు బైక్ మెకానిక్ గా పెంటపాడు గ్రామంలో ఎటువంటి బైక్ అయినా రిపేర్ చేసే నైపుణ్యం ఆయనలో ఉందని రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంచాలా బాధాకరంగా ఉందని స్నేహితులు వాపోతున్నారు సమాచారం అందుకున్న చింతపల్లి సీఐ ఎం. వినోద్ బాబు, ఎస్ఐ వెంకటేశ్వరరావు సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విచారించి, సంబంధిత కేసును నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## ఉత్సవ విగ్రహాలతో గ్రామోత్సవం



**టి నర్సాపురం, పెన్ పవర్, మే 18:** బొర్రంపాలెం గ్రామంలో శ్రీ వల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వినాయక జంట సర్పాల వత్సవాయి విగ్రహాలను హిందూ సాంప్రదాయం తో మేళతాళాలతో గ్రామంలో ట్రాక్టర్ మీద ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలోఊరేగించారు. భక్తులు స్వామివార్లకు పసుపు, కుంకుమలు, పండ్లు పలహారములు అందజేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.ం

## ఆలయ పున:ప్రతిష్ట మహోత్సవం

**సుబ్రహ్మణ్యేశ్వరస్వామి,వినాయక జంట సర్పాల విగ్రహాల ప్రతిష్ట**



**టీ నర్సాపురం, పెన్ పవర్,మే 18:** శ్రీవల్లి దేవసేనసమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి మరియు వినాయక జంట సర్పాల ఆలయ పున:ప్రతిష్ట మహోత్సవం కార్యక్రమములు 19 5 2018 సోమవారం నుండి రియాల్టీ అయిదు 2025 బుధవారం వరకు ఈ కార్యక్రమం నిర్వహించబడును. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ 1957 సంవత్సరంలో ఆలయ ధర్మకర్తలు ముక్కు వెంకన్న భార్య అచ్చమ్మ జయవరపు పుల్లయ్య భార్య లక్ష్మీకాంతం సంయుక్తముగా ప్రతిష్టించిన శ్రీ వల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యస్వామి మరియు వినాయక జంట సర్పాల ఆలయ పున:ప్రతిష్ట మహోత్సవము స్వస్తిశ్రీ చంద్రమాన వ్యవహారిక శ్రీ విశ్వ వసు నామ సంవత్సర వైశాఖ మాస బహుళ పక్షనవమి అనగా 21-5-2025 బుధవారం ఉదయం గంటల 8-51 నిమిషాలకు శతభిషా నక్షత్ర యుక్త మిధున లగ్న పుస్కారాంశము నందు బొర్రంపాలెం గ్రామంలో నూతన ఆలయం ప్రతిష్ట జరుగునని తెలిపారు. శ్రీ సీతారామాంజనేయ భజన మండలి వారిచే భజన కార్యక్రమం సోమవారం నిర్వహించబడునని, సాయంత్రం పూజా కార్యక్రమాలు హెూమములు తీర్థప్రసాదాలు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జరుగుతాయని కమిటీ సభ్యులుతెలిపారు. జాలాదివాసములో ఆడపడుచులు ఇచ్చే బిందువులతో నీళ్లు సమర్పణ జలాది వాసం, తీర్థ ప్రసాదాలు, సాయంత్రం గ్రామంలో ప్రభూతి బలి, విశేషం మహా శాంతి హెూమం తీర్థప్రసాదాలు మంగళవారం జరుగుతాయని ఈ కార్యక్రమములు శ్రీమన్ అగ్నిహెూత్రం శ్రీనివాస చార్యులు మరియు ఫణి కుమార్ ఆచార్యులు కృష్ణాజిల్లా వారిచే నిర్వహించబడును అని కమిటీ సభ్యులు తెలిపారు. బుధవారం ఉదయం 11 గంటల నుండి మహా అన్న సమారాధన జరుగునని ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, గ్రామ ఇరువైపుల ఉన్న భక్తులు యవన్మంది పాల్గొని స్వామివారి కార్యక్రమాలు తిలకించి తీర్థ ప్రసాదములు స్వీకరించి తరించవలసినదిగా కమిటీ వారు కోరుచున్నమని తెలిపారు. ఆలయ కమిటీ -బొర్రంపాలెం

## మండపేట ను రాజమహేంద్రవరం లో విలీనం చేయాలి.

**మినీ మహానాడు లో తీర్మానం.**



**మండపేట.పెన్ పవర్. మే18:**మండపేట నియోజకవర్గ మహానాడు కార్యక్రమంలో పలు తీర్మానాలు చేశారు.ఎన్.టి.ఆర్ కు భారత రత్న ఇవ్వాలని తీర్మానించారు. మండపేట నియోజకవర్గాన్ని రాజమహేంద్రవరం కేంద్రంగా ఏర్పడిన తూర్పుగోదావరి జిల్లాలో కలపాలనీ ప్రతిపాదించారు. వైసీపీ ప్రభుత్వంలో వివిధ కారణాలతో తొలగించిన ఫించన్లు, రేషన్ కార్డులు పున:రుద్ధరించాలన్నారు.
వైసీపీ ప్రభుత్వంలో రద్దు చేసిన కమ్యూనిటీ హాల్స్, లింకు రోడ్లు, పుంత రోడ్లు, బిటి రోడ్లు తిరిగి నిర్మించాలన్నారు. బ్యాంకు ఋణాలు రద్దు చేసి టిడ్కో గృహాలు లబ్దిదారులకు అందించాలన్నారు.
జొన్నాడ ఎన్.హెచ్ 16 నుండి మండపేట %-% ద్వారపూడి మీదిగా రాజానగరం ఎన్.హెచ్ 16 వరకు నాలుగు లైన జాతీయ రహదారి నిర్మించాలని నిర్ణయించారు.పుష్కరాల సమయానికి జొన్నాడ-యానం ఏటిగట్టు రోడ్డు ను నాలుగు లైన్లు రోడ్డుగా నిర్మించాలాన్నారు.
తాపేశ్వరం బైపాస్ రోడ్డు పూర్తి చెయ్యాలని పేర్కొన్నారు. 2014-2019 లో చేసిన వివిధ పనులకు సంబంధించి పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని తీర్మానించారు.2019-2024 మధ్య కాలంలో మండపేట నియోజకవర్గ టీడీపీ నాయకులు, కార్యకర్తలపై వైసీపీ నాయకులు అక్రమంగా పెట్టిన కేసులను తొలగించాలన్నారు.2014-2019 మధ్య కాలంలో కాపు సామాజిక వర్గానికి ఇచ్చిన 5 శాతం రిజర్వేషన్ ను అమలు చెయ్యాలనే తీర్మానాలు చేశారు.

# షిప్ యార్డ్ జూనియర్ కాలేజీ లో పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం




**గాజువాక :పెన్ పవర్ ,మే 18** షిప్ యార్డ్ జూనియర్ కాలేజీ లో 2009 సంవత్సరం విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం విశ్వా , రాణి ,గణేష్ ఆద్వర్యం లో కాలేజీ ప్రాంగణం లో ఘనంగా నిర్వహించారు. చిన్ననాడు చదువు చెప్పిన గురువులను తలచుకుంటూ చిన్ననాటి చదువుకున్న మధుర స్మృతులను నెమరు వేసుకుంటూ ఆత్మీయంగా ఆనందంగా గత 16 సంవత్సరాలు క్రితం ఒకచోట చదువుకున్న మధుర జ్ఞాపకాలు ఒకచోట కలవడం సంతోషంగా ఉందని భావోద్వేగానికి గురై సంతోషం వ్యక్తం చేశారు. ఇకనుండి ప్రతి సంవత్సరం అందరం ఒకచోట కలుసుకొని కష్టసుఖాలు పాలు పంచుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రక్తహీనతతో బాధపడుతున్న పేషెంట్‌కు బ్లడ్ మరియు ఆర్థిక సాయం

- బీజేపీ నేత దుక్కేరి ప్రభాకరరావు




**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, మే 18:**అల్లూరి సీతారామరాజు జిల్లా, జి. మాడుగుల మండలానికి చెందిన సొలొభం గ్రామ నివాసి పాంగి శివరత్నం, రక్తహీనతతో విశాఖపట్నం కేజీహెచ్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్నారు. వైద్యుల వివరాల ప్రకారం శరీరంలో కేవలం మూడు గ్రాముల రక్తం మాత్రమే మిగిలి ఉండటంతో పరిస్థితి విషమంగా మారింది. అయితే, హాస్పిటల్‌లో రక్త నిల్వలు లేకపోవటంతో శివరత్నం బంధువులు బీజేపీ నేత, జై ఆదివాసీ జై భీమ్ స్వయంసేవ ట్రస్ట్ చైర్మన్ దుక్కేరి ప్రభాకరరావును సంప్రదించారు. వార్త తెలియగానే తక్షణమే స్పందించిన ప్రభాకరరావు డాక్టర్లతో సంప్రదించి మూడు యూనిట్ల రక్తాన్ని సమకూర్చి అందించారు. అంతేకాకుండా, పలువురు దాతల సహకారంతో ఆర్థిక సాయం కూడా ఏర్పాటు చేశారు. అందించిన ఈ సాయం మొత్తాన్ని శివరత్నం కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నేరుగా పాడేరు వద్ద వారి నివాసంలో అందజేశారు. ప్రస్తుతం శివరత్నం ఆరోగ్యం మెరుగుపడుతున్నదని ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా సహాయం చేసిన దుక్కేరి ప్రభాకరరావుకి, ట్రస్ట్ బృందానికి, రక్తదాతలకు మరియు ఆర్థిక సహాయదాతలకు శివరత్నం కుటుంబం కృతజ్ఞతలు తెలిపింది.

## చింతపల్లి గ్రామంలో మంచినీటి సమస్య పరిష్కారం



**చింతపల్లి పెన్ పవర్ మే 17:-**చింతపల్లి రామాలయం వీధిలో సర్పంచ్ దురియా పుష్పలత జడ్పిటిసి పోతురాజుబాలయ్య ఎంపిటిసి1 దాసరిదారలక్మి కలిసి మంచినీటి బోర్ శంకుస్థాపన చేసినారు జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండాకాలం మొదలవగానే చింతపల్లి లో మంచినీటి సమస్యా చాలా తీవ్రంగా ఉంటుందనీదీనినిఅధిగమించడానికిఅధికారులుప్రజాప్రతినిధులసమన్వయంతోప్రణాళికలుతయారుచేస్తున్నామన్నారు. అందులో భాగంగానే సాయినగర్ లో మంచినీటి సమస్యపై జిల్లా పరిషత్ చైర్ పర్సన్మరియుసిఇఒమాట్లాడి పదిలక్షలరూపాయలుమంజూరు చేయించడం జరిగిందని తెలిపారు. అలాగేరామాలయం వీధి లో మహిళలుఎండాకాలం వస్తే మంచినీటి కోసం చాలా ఇబ్బందులు పడుతున్నా మనీ తెలుపగా వెంటనే మంచినీటి బోరు మంజూరి చేయడం జరిగిందని అన్నారు. సర్పంచు ఎంపిపిటీ సహకరిస్తే నాకు కేటాయించిన నిధులతో రామాలయం వీధి లో మంచినీటి సమస్య లేకుండా శాశ్వితంగా పరిష్కారం చేస్తాం అన్నారు. ఇన్నాళ్ళకుమంచినీటీ సమస్య తీరుతున్నందుకు రామాలయం వీధి మహిళలు ఆనందం వ్యక్తం చేశారు. దీనికి కృషి చేసిన జెడ్పీటీసీబాలయ్య కు ధన్యవాదాలు తెలిపారు. ఈకార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యులు నాజర్ వల్లీ , మాజీ వైస్ఎంపిపిబూసరికృష్ణారావు , నాయకులు హేమంత్ కుమార్ గ్రామ పెద్ద మీరా మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## మా గుంతలరహదారికి మోక్షం లేదా గుంతలమయమైన రోడ్లపై ప్రజలు నరకయాతన




**చింతపల్లి పెన్ పవర్ మే 17:-** చింతపల్లి మండలం కడశిల్ప, కొత్తపాలెంగ్రామాలమధ్యరహదారి గుంతల మయంగా మారి వర్షం పడితే మా రహదారి గుంత ఎక్కడో మంచి రోడ్డు ఎక్కడో తెలియదు సంబంధిత అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లువ్యవహరిస్తున్నారనిస్థానికులుతీవ్రఆగ్రహంవ్యక్తంచేస్తున్నారు. చింతపల్లి, నర్సీపట్నం, కొత్తపల్లి జలపాతం, పాడేరు, అరకు వంటి ప్రాంతాలకు నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్న ఈ ప్రధాన రహదారిపై ప్రయాణం నరకంగా మారింది. ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొన్నా, అధికారులు మాత్రం కనీసంపట్టించుకోవడం లేదనిప్రజలుమండిపడుతున్నారు. విద్యార్థులుపాఠశాలలకు వెళ్లాలన్నా, కళాశాలలకు చేరుకోవాలన్నా ఈ గుంతల రోడ్లపై పడి లేస్తూ వెళ్లాల్సి వస్తోంది. కనీసం రోడ్డు మరమ్మతులకు కూడా నోచుకోవడంలేదనిగ్రామస్తులు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొత్తపాలెం పంచాయతీలోని కడశిల్ప గ్రామం వద్ద ఉన్న వంతెనకు రక్షణ గోడలు నిర్మించాలని ఎన్నోసార్లు విన్నవించినా అధికారులు పట్టించుకోలేదు. అంతేకాదు, వంతెనకు ఇరువైపులా ఉన్న అధ్వానమైన రోడ్డును కూడా అభివృద్ధి చేయలేదు. దీంతో ఈ మార్గం గుండా ప్రయాణించే గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొత్తపాలెం, కడశిల్ప గ్రామాల మధ్య రహదారిప్రమాదకరంగా తయారైంది. అన్నవరం నుండి లోతుగడ్డ జంక్షన్ వరకు ఉన్న 12 గ్రామాల ప్రజలు ఈ గుంతల రోడ్డు కారణంగా ప్రతిరోజూ నరకయాతన అనుభవిస్తున్నారు."వాహనాలు ఎంత జాగ్రత్తగా నడిపినా గుంతల్లో పడితే ఆసుపత్రి పాలవడం ఖాయం" అని వారు ఆందోళన చెందుతున్నారు. రోడ్డు ఎక్కడ ఉందో, గుంతలు ఎక్కడ ఉన్నాయో తెలియక ప్రమాదాలుజరుగుతున్నాయని పలువురు వాపోతున్నారు. రోజులు గడుస్తున్నా ఈ రోడ్డు సమస్యను పరిష్కరించడానికి నాయకులు, పాలకులు, అధికారులు ఏమాత్రం చొరవ చూపడం లేదని స్థానికులు తీవ్రంగా విమర్శిస్తున్నారు. గుంతల కారణంగా ప్రమాదాలు జరుగుతున్నా కనీసం గుప్పెడు మట్టి కూడా వేయకపోవడం దారుణమని ద్విచక్ర వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో ప్రయాణం మరింత ప్రమాదకరంగా మారిందని, ఆటో ప్రయాణాలు భారంగా మారాయని, ఈ రోడ్డుదెబ్బకుఆటోలుషెడ్డులకుపరిమితమవుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుంతలమయమైన ఈ రోడ్డు కారణంగా తమ ప్రయాణం నరకప్రాయంగా మారిందని స్థానికులు కన్నీటితో చెబుతున్నారు.

ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి ఈ ప్రాంత ప్రజల కష్టాలను అర్థం చేసుకుని వెంటనే రహదారుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## ఏకలవ్య ప్రహరీగోడ నిర్మాణపనులు ప్రారంభించిన మాజీ సర్పంచ్ రామస్వామి




- 2 కోట్ల 80 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో పనులు ప్రారంభం.
- సుమారు 2వేల మీటర్ల ప్రహరీ గోడతో పాటు 600 మీటర్ల సిసి రోడ్డు నిర్మాణానికి శ్రీకారం.
- మండల టీడిపి మాజీ అధ్యక్షుడు, సీనియర్ నేత, మాజీ సర్పంచ్ వంతాల రామస్వామి.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, మే 18.**మండలంలో గల జోలపుట్టు పంచాయతీ, లబ్బూరులో నిర్మాణ దశలో ఉన్న ఏకలవ్య పాఠశాలలో ప్రహరీగోడ, సీసీ రోడ్డు నిర్మాణానికి మండల టీడిపి పార్టీ మాజీ అధ్యక్షుడు, టిడిపి సీనియర్ నేత, జోలపుట్టు పంచాయితి మాజీ సర్పంచ్ వంతాల రామస్వామి ఆదివారం భూమి పూజ చేసి నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. ముంచంగిపుట్టు ఏకలవ్య పాఠశాలలో ప్రహరీగోడతో పాటు సిసి రోడ్డు నిర్మాణానికి కూటమి ప్రభుత్వం 2కోట్ల 80లక్షల రూపాయలు నిధులు కేటాయించిందని, దీంతో ఆదివారం నిర్మాణ పనులను ప్రారంభించామని తెలిపారు. ఏకలవ్య పాఠశాల సరిహద్దుల్లో ప్రహరి గోడ సుమారు 2వేల మీటర్ల నిర్మాణంతో పాటు 6 వందల మీటర్ల సిసి రోడ్డు నిర్మాణానికి కూటమి ప్రభుత్వం ఎన్ఆర్ఈజీఎస్ నిధులు విడుదల చేసిందన్నారు. పాఠశాల ప్రారంభానికి ముందే ప్రహరి గోడ నిర్మాణ పనులు పూర్తి చేయుటతో పాటు మూడు నెలల్లో సిసి రోడ్ల నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులతో, గుత్తేదారునితో మాట్లాడినట్లు ఆయన తెలిపారు. ముంచంగిపుట్టు ఏకలవ్య పాఠశాలకు సంబంధించి పాఠశాల భవన సముదాయము నిర్మాణానికి తమ భూములు ఉచితంగా ధారాదత్తం చేశామన్నారు. ఇవే కాకుండా లబ్బూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సుమారు రెండు ఎకరాలు తమ సొంత భూమిని ఉచితంగానే కేటాయించామని ఆయన తెలిపారు. లబ్బూరు ఆశ్రమ పాఠశాల భవన నిర్మాణానికి గతంలో తమ గ్రామస్తులే స్థలాన్ని కేటాయించారని, గిరిజనుల విద్యాభివృద్ధి, ఆరోగ్యమే తమకు ప్రధానమని దీంతోనే సేవాగుణంతో ప్రభుత్వానికి తమ భూములు ధారదత్తం చేసినట్లు మాజీ సర్పంచ్ రామస్వామి తెలిపారు. ఏకలవ్య ప్రహరి గోడ, సిసి రోడ్డు నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సదరు కాంట్రాక్టర్ ను సూచించారు. అయితే ముంచంగిపుట్టు ఏకలవ్య పాఠశాల నిర్వహణ పెదబయలు వైటిసిలో కొనసాగుతున్న విషయం అందరికీ తెలిసిందే. లబ్బూరులో నిర్మాణ దశలో ఉన్న పాఠశాల భవన సముదాయాలు పూర్తి చేసి విద్యార్థిని విద్యార్థులను వెంటనే తరలించాలని పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో మాకవరం మాజీ సర్పంచ్ నీలకంఠం, వర్క్ టెక్నికల్ అసిస్టెంట్ మల్లేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలలోని ఎరువులు, పురుగుమందులు విత్తన డీలర్ల సంఘం యొక్క సర్వసభ్య సమావేశం

- జిల్లా అధ్యక్షుడు సంతోష్ రాము అధ్యక్షతన




**చోడవరం పెన్ పవర్ మే 18:** ఈ సమావేశమునకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర అధ్యక్షులు గౌరవనీయులు శ్రీ వజ్రాల వెంకట నాగిరెడ్డి హాజరై సంఘ సభ్యులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి వ్యాపారస్తుడు రైతులకు నాణ్యమైన మరియు అవసరమైన ఎరువులు పురుగుమందులు ఇచ్చి రైతులకు తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు పొందే విధముగా వ్యాపారస్తులు సహాయ పడవలసినదిగా సూచించారు.

మరియు ఈ మూడు జిల్లాలలో అనధికారికంగా ఎరువులు, పురుగుమందులు వ్యాపారము చేసే వ్యక్తులను గుర్తించి వారిని చట్టానికి అప్ప చెప్పవలసిందిగా సూచించారు అనధికారికంగా నకిలీ పురుగుమందులు, విత్తనములు అమ్మే వారి వలన రైతులు ఇబ్బందులు పడటమే కాకుండా వారు చేస్తున్న తప్పులకు చట్ట పరిధిలో వ్యాపారం చేసే వారికి చెడ్డ పేరు వస్తున్నదని తెలియజేశారు. రైతులు లైసెన్స్ పొందిన షాపుల నుండి మాత్రమే ఎరువులు పురుగుమందులు విత్తనములు కొనుగోలు చేసి దానికి సంబంధించిన రసీదు షాపు నుండి తప్పనిసరిగా తీసుకోవలసినదిగా రైతులకు సూచించారు . మరియు రైతులకు అవసరమైన ఎరువులను మాత్రమే ఇవ్వవలసినదిగా తెలియజేస్తూ అనకాపల్లి దగ్గర బయ్యారం వద్ద రైలు రేక్ పాయింట్ కోసము ప్రయత్నం చేద్దామన్నారు. దానివలన ఎరువుల లభ్యత పెరుగుతుంది అని వెల్లడించారు.

ఈ సమావేశంలో జోనల్ ఉపాధ్యక్షులు శ్రీ చక్కా రవి కుమార్ , దాసరి సుబ్రహ్మణ్యం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఉదయ భాస్కర్, బుల్లి వెంకట రమణ, జిల్లా కోశాధికారి కళ్యాణ్, జిల్లా పూర్వాధ్యక్షులు నాయుడు,లోకేష్, మరియు మూడు జిల్లాలలోని ఎరువులు, పురుగు మందులు మరియు విత్తన వ్యాపారస్తులు పాల్గొన్నారు.

## సీ.బీ.ఎస్.సీ 10 క్లాస్ ఫలితాల్లో సత్తా చాటిన ద్వారపురెడ్డి హారిణి



**చోడవరం పెన్ పవర్ మే 18:**సీ.బీ.ఎస్.సి పదవ తరగతి ఫలితాల్లో చోడవరం కు చెందిన ద్వారపురెడ్డి హారిణి సన్/ఆఫ్ ద్వారపు రెడ్డి శ్రీనివాసరావు 94% తో సత్తా చాటింది...

హారిణి. మాట్లాడుతూ కొమ్మాది నవోదయ స్కూల్ లో టీచర్ల బోధనతో పాటు తన ప్రిన్సిపల్ ప్రోత్సాహం వలనే ఈ మార్కులు సాధించగలిగానని తెలిపారు...

భవిష్యత్ లో ఇలాగే మరిన్ని విజయాలు సాధించి చోడవరం పట్టణం కు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షిస్తూ పలువురు పట్టణ వాసులు తమ అభినందనలు తెలియజేసారు

## పాపహోమ్ లో మొల్లి అప్పారావు జన్మదిన వేడుకలు



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, విశాఖపట్నం మే18:** వైసిపి తూర్పు నియోజకవర్గం పరిశీలకులు,మాజీ ఎపిఐఐసి డైరక్టర్ మొల్లి అప్పారావు. జన్మదిన వేడుకలు కిడ్ పవర్, పాపహోమ్ అనాధ పిల్లల మధ్య మొల్లి అప్పారావు దంపతులు ఆదివారం ఉదయం అల్పాహారం మధ్యాహ్నం భోజన ఏర్పాట్లతో వారి మధ్యనే పుట్టినరోజు జరుపుకున్నారు. అనంతరం16 వ వార్డు సీతమ్మధార,రాధాకృష్ణ కళ్యాణ మండపంలో కార్యకర్తలు,నాయకుల సమక్షంలో జన్మదిన వేడుక జరుపుకున్నారు. సందర్భంగా తూర్పు నియోజకవర్గం నగరంలో కార్పొరేటర్లు,వివిధ కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు, డైరెక్టర్లు,వివిధ హెూదాల నాయకులు,నియోజకవర్గ వివిధ సంఘాలసభ్యులు, నాయకులు,కార్యకర్తలు పాల్గొనీ ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# జీకే వీధి మండలంలో కూటమి ఆధ్వర్యంలో భారీ తిరంగా ర్యాలీ

- భారత ఆర్మీకి సెల్యూట్
- ఆపరేషన్ సిందూర్ విజయాన్ని కొనియాడిన కూటమి





**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,మే 18:**అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలం కేంద్రంలో బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి ఆధ్వర్యంలో భారీ తిరంగా ర్యాలీ ఘనంగా నిర్వహించబడింది. భారత్ ప్రభుత్వం విజయవంతంగా చేపట్టిన “ఆపరేషన్ సిందూర్” కు మద్దతుగా, మరియు భారతీయుల ఐక్యతను ప్రపంచానికి చాటిచెప్పిన ప్రధాని నరేంద్ర మోడీకి అభినందనలు తెలియజేస్తూ ఈ ర్యాలీ నిర్వహించారు.గత నెల 22వ తేదీన జమ్మూ కశ్మీర్‌లోని పహాల్గామ్ వద్ద ఉగ్రవాదులు 28 మంది అమాయక యాత్రికులపై జరిపిన దారుణ దాడికి ప్రతిగా భారత ప్రభుత్వం గట్టి నిర్ణయం తీసుకొని, భారత ఆర్మీ నిర్వహించిన ఆపరేషన్ సిందూర్ విజయవంతంగా పూర్తయింది. ఈ నేపథ్యంలో జీకే వీధిలో జరిగిన ఈ ర్యాలీలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ ఎంపీటీసీ రిమెల రాజేశ్వరి బీజేపీ మండల అధ్యక్షులు కాకురు శేఖర్, టీడీపీ మండల అధ్యక్షులు ముక్కల రమేష్, బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు బోండ్ల చిరంజీవి, మాజీ జడ్పీటీసీ గంటా నలిని, బీజేపీ అరకు పార్లమెంట్ కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి దుక్కేరి ప్రభాకరరావు, ఉమ్మడి జిల్లా మాజీ టిడిపి కార్యదర్శి ముక్కలి మహేష్, కూటమి నాయకులు ముక్కలి కళ్యాణి,కంకిపాటి గిరిబాబు, సురకత్తి నాగేశ్వరరావు, రిమెల పాల్, మొట్టడం లక్ష్మణ్, లకే రాము,దేవరపల్లి చిన్నబాబు, లోత రాజు తదితరులు పాల్గొన్నారు.ఈ ర్యాలీతో భారత ఆర్మీకి ప్రజల మద్దతు మరోసారి స్పష్టమైంది. “దేశ భద్రత కోసం ఎవ్వరైనా ఎంతదూరమైనా వెళ్ళగలము” అనే సంకల్పాన్ని ఈ ర్యాలీ చాటిచెప్పింది.

# జీవీఎంసీ కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ అభ్యర్ధన

- జనసేన అధినేత కొణిదెల పవన్ కళ్యాణ్ కు,పి.ఏ.సి చైర్మన్ నాదెండ్ల మనోహర్ కు



**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, విశాఖపట్నం మే 18 :**
విశాఖ జీవీఎంసీ లో జనసేన పార్టీ వ్యక్తి డిప్యూటీ మేయర్ గా ఉంటే పార్టీ కి గర్వకార ణం.కూటమి సఖ్యతకి ఒక మణిహారం. జీవీ ఎంసీ లొ నేడు జరగనున్న డిప్యూటీ మేయర్ ఎన్నిక నేపథ్యంలో,సాధారణ ప్రజలు, ముఖ్యం గా మన పార్టీ క్యాడర్, మీ సమర్థ నాయకత్వం పట్ల విశ్వాసపాత్రులైన అభిమానులు మరియు పార్టీ నాయకత్వంలోని మెజారిటీ సభ్యులు జన సేన పార్టీకి డిప్యూటీ మేయర్ పదవిని సాధించ డానికి చాలా ఆసక్తిగా ఉన్నారని మీ దృష్టికి తీసుకురావాలనుకుంటున్నాను.గత ఏడాది జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో జనసేన పార్టీ కా ఇచ్చిన మద్దతు తో 10 మంది సభ్య లను టీడీపీ ఛేజిక్కించుకుంది.కూటమి అవగా హనకు విరుద్ధంగా ఎవరినీ కోరుకోకుండానే. జనసేన పార్టీ కార్యకర్తలు ఇప్పుడు కోరుకుం టున్న కూటమి ధర్మం ఏమిటంటే.డిప్యూటీ మేయర్ పదవిని జనసేనకు కేటాయించాలని టీడీపీని అడగడం.పార్టీ నాయకుడిగా మీ నిర్ణ యం అంతిమమైనది మరియు మీ నిర్ణయం కు కట్టుబడి ఉంటుందని నేను గట్టిగా భావిస్తున్నా ను, కానీ మెరుగైన నిర్ణయం తీసుకోవడానికి ప్రజాభిప్రాయాన్ని మీకు తెలియజేయడం ప్రజా ప్రతినిధిగా నా నైతిక బాధ్యత కూడా.జనసేన పార్టీకి మద్దతును గట్టిగా అందించిన జివిఎంసి పౌరులు తమ కోరికలు జనసేన డిప్యూటీ మేయర్ అభ్యర్థి ద్వారా మాత్రమే నెరవేరుతా యని ఆశిస్తున్నారు.ఈ కీలక సందర్భంలో మీ అందరినీ నేను కోరుతున్నానుఎందుకంటే మేయర్ ఎన్నికల సమయంలో టీడీపీ వారు డిప్యూటీ మేయర్ పదవిని జనసేన పార్టీ కి కేటాయిస్తారని హామీ ఇచ్చారు.ఎందుకంటే మన జనసేన పార్టీ 17 ఓట్ల బలం..జనసేనకు చెందిన 3 కార్పొరేటర్లు,3 ఎమ్మెల్యేలు మరియు జనసేన పై పార్టీ లో చేరిన 11 మంది కార్పొరేట ర్లు సమిష్టి సహకారమే మేయర్ పీఠం కూటమి గెలువడానికి అడుగులు వేయించింది..

# మన పుట్టుకతో పాటు పుట్టడానికి గల జన్మ రహస్యాన్ని తెలుసుకోవాలి

- నల్లి ధర్మారావుకు ఆచార్య చందు సుబ్బారావు సాహితీ పురస్కారం.
- భారత్ లాంటి సంక్లిష్టమైన దేశంలో పుట్టడం అదృష్టం.
- పూర్వ వైస్ ఛాన్సలర్ ముత్యాలనాయుడు.



**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్,విశాఖపట్నం,మే 18 :**
భారతదేశం లాంటి సంక్లిష్టమైన దేశంలో పుట్టడం గర్వకారణమని, ప్రపంచంలో ఏ దేశం కూడా మనకు తీసిపోదని పూర్వ వైస్ ఛాన్సలర్ ఆచార్య ఎం.ముత్యాల నాయుడు అన్నారు
ఆచార్య చందు సుబ్బారావు లిటరరీ అండ్ కల్చరల్ ట్రస్ట్ ఏటా అందిస్తున్న సాహితీ పుర స్కారం ఈ ఏడాది శ్రీకాకుళానికి చెందిన సీని యర్ జర్నలిస్టు, ప్రముఖ కవి, రచయిత నల్లి ధర్మారావుకు ప్రదానం చేశారు. ఆదివారం విశాఖ పౌర గ్రంథాలయంలో జరిగిన పురస్కార సభలో ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయ మాజీ వీసీ ఆచార్య ముర్రు ముత్యాల నాయుడు చేతుల మీదుగా నల్లి ధర్మారావుకు పురస్కారాన్ని అందజేశారు. అనంతరం ముత్యాల నాయుడు మాట్లాడుతూ మన పుట్టుకతో పాటు పుట్టడానికి గల జన్మ రహస్యాన్ని తెలుసుకోవాలన్నారు. సమాజానికి ఉపయోగపడుతున్న వారిని గౌరవించడం చాలా గొప్ప విషయం అన్నారు. ఈ క్రమంలో
నల్లి ధర్మారావుకు చందు సుబ్బారావు సాహితీ
పురస్కారం ఇవ్వాలనే ఆలోచన గొప్పదన్నారు.
పుట్టినందుకు జీవితం సాఫల్యం కావాలంటే ఇలాంటి కార్యక్రమాలు చేయడమేనన్నారు. ఈ సభకు అధ్యక్షత వహించిన చందు ట్రస్ట్ చైర్మన్, యూపీఎస్సీ మాజీ సభ్యులు ఆచార్య కేయస్. చలం అధ్యక్షత వహించి మాట్లాడుతూ సాహితీ విలువల గూర్చి మాట్లాడుతూ దిగజారి పోతు న్న తెలుగు భాష గూర్చి కృషి చేయాల్సిన అవ సరాన్ని వివరించారు. తెలుగు భాష కళింగాంధ్ర లోనే పుట్టింది అన్నారు. ఈ ప్రాంతం వారు సం స్కృతిక వారసులని మన అస్తిత్వాన్ని చాటు కోవడంటే చరిత్ర తిరిగి రాయాల్సిన అవసరం ఉంది అన్నారు. సామాజిక న్యాయం కోసం సా హిత్య అభివృద్ధికి పాటుపడుతున్న నల్లి ధర్మా రావుకు ఈ అవార్డు ఇవ్వడం సముచితమన్నా రు.సాహితీ సమాజానికి నల్లి ధర్మారావు అవస రం ఉందన్నారు. గుర్రం జాషువా, చిలకమర్తి వారి రచనల్ని విశదీకరించారు. ఉత్తరాంధ్ర సాహితీ వైభవాన్ని ప్రస్తుతించారు.చందు సు బ్బారావు సాహిత్యాన్ని గుర్తు చేశారు.పుర స్కార ప్రదాత ఆచార్య చందు సుబ్బారావు ప్రసంగిస్తూ సైన్స్ మానవాళికి వాస్తవాన్ని అందిస్తుందని ,సమాజ పురోగతికి దోహదపడు తున్నారు సాహిత్యం, సైన్స్ మధ్య ఉన్న సంబం ధాన్ని విశ్లేషించారు. భారతదేశ ఐకమత్యంలోని గొప్పతనాన్ని వివరించారు ఈ దేశంలో పుట్ట డమే అదృష్టమని చెప్పుకొచ్చారు. కార్ల్ మార్క్స్ మాటలు సమాజానికి ఏ విధంగా ఉపయోగ పడుతుందో చెప్పారు.ప్రజాస్వామ్యం అంటే స్వేచ్ఛ సమానత్వం అని పేర్కొన్నారు. పుర స్కార గ్రహీతను పరిచయం చేస్తూ ట్రస్ట్ కార్యదర్శి ఉప్పల అప్పలరాజు నల్లి ధర్మారావు రచనల్ని, సాహితీ కృషిని, ఆయన రచనలను సభకు పరిచయం చేశారు.నల్లి ధర్మారావు సాహితీ ప్రయాణాన్ని, జీవన గమనాన్ని వివరించారు. అతను గీతాలు చెతన్యవంత మైనవని, అతను ప్రజాకవి అని, రాటుదేలిన రచయిత అని చెప్పారు. చందు సుబ్బారావు సాహిత్యం గురించి ఆచార్య వెలమల సిమ్మన్న మాట్లాడుతూ, తెలుగు భాషా ప్రగతిని వివరించారు. ఉత్తరాంధ్ర సాహిత్య వైభవాన్ని విశదీకరించారు. తెలుగు సాహిత్య విమర్శలో చందు సుబ్బారావుది ప్రత్యేక శైలి, బహుముఖ ప్రజ్ఞ కలిగిన వారని కొనియాడారు.చందు సు బ్బారావు కు వచ్చిన అవార్డులు, అతని రచన ల్ని గుర్తు చేశారు. 60 విమర్శనా వ్యాసాలు రాశారని చెప్పారు. అతని విమర్శలో నిజాయి తీ ఉంటుందని, సూటిగా చెప్పదలుచుకున్నది చెప్పేస్తారన్నారు వెనుకబాటుతనం ఉన్న చోట తిరుగుబాటు ఉంటుంది,పురస్కార గ్రహీత నల్లి ధర్మారావు మాట్లాడుతూ చందు సుబ్బారావు హృదయాన్ని గెలవడం తన అదృష్టమన్నారు. తెలుగు భాషను ఇంకా భావజాలం సమస్య వెంటాడుతుందన్నారు. , దాని నుంచి బయట పడాల్సిన అవసరం ఉందని, సంస్కృతి ధ్వంస మవుతున్న తరుణంలో జాగ్రత్త పడాల్సిన అవ సరం కూడా ఉందన్నారు. వెనుకబాటు తనము ఉన్న చోట, తిరుగుబాటు ఉంటుందన్నారు. నిజమైన చరిత్ర ఎవరూ మాట్లాడడం లేదన్నా రు. ఉత్తరాంధ్ర నదులకు పవిత్రత లోపించడాని కి కారణాలు తెలుసుకోవాలన్నారు. వాస్తవాలు అధ్యయనం చేయాలన్నారు.అందరూ సమా నంగా ఉండాలనుకోవడమే మానవత్వన్నారు. ఆచార్య చలం తనకు స్ఫూర్తినిచ్చారని, ఆయన అడుగుజాడల్లో నడుస్తామన్నారు.మసిపూసిన చెక్కిలిపై' అనే స్వీయ గేయాన్ని పాడి వినిపిం చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ డివి సూర్యరా వు చందు సుబ్బారావు రచనలు,చేసిన సాహి త్య విమర్శలను వివరించారు.ఎస్.హనుమం తరావు,పీఏ రాజు, బసుపోతన,హరి వెంకటర మణ,గరిమ నరసింహ తదితరులు పాల్గొన్నా రు.

# ఉచిత మెగా వైద్య శిబిరంలో 100 మంది ఆర్థోపెడిక్ రోగులుకు వైద్య పరీక్షలు





- ఆరోగ్యకర జీవనానికి బోన్ డెన్సిటీ చాలా ముఖ్యం
- ఆర్థోపెడిక్ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ అబ్దుల్ డి ఖాన్

**విశాఖ ఉత్తరం, పెన్ పవర్, మే 18 :**మన ఆరోగ్యకర జీవనానికి బోన్ డెన్సిటీ చాలా ముఖ్యమని ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ అబ్దుల్ డి ఖాన్ పేర్కొన్నారు. ఆదివారం సీతమ్మధార టిపిటి కాలని క్రిసెంట్ ఆర్థో అండ్ చైల్డ్ క్లినిక్ లో అపోలో ఆసుపత్రి సహకారంతో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని రోగులకు సుమారు 3000 రూపాయల విలువ చేసే బోన్ మినరల్ డెన్సిటీ టెస్ట్, గ్రోత్ అసెస్మెంట్, డైట్ కౌన్సెలింగ్, చైల్డ్ వాక్సినేషన్ రివ్యూ, ఇసిజి, ఫాస్టింగ్ బ్లడ్ షుగర్ తదితర వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహించి పలు వైద్య సలహాలను ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లా డుతూ మన జీవన యానంలో నిత్యం కదులుతూ ఉండటం వల్ల ఎముకల మీద ఒత్తిడి పడి అవి నిత్యం అరుగు తుంటాయని అందుకే వాటి ఆరోగ్యం కోసం కాల్షియం, డి విటమిన్ అత్యవసర మన్నారు. మన దేశంలో చాలా మందిలో విటమిన్ డి లోపం ఉందని, వైద్యుల సలహా తీసుకుని విటమిన్ డి మాత్రలు వేసుకోవా లన్నారు. బోన్ మినరల్ డెన్సిటీ పరీక్షలను చేయించుకుంటే మన ఎముకల సాంద్రత తెలుస్తుందన్నారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో సుమారు 100 మంది రోగులు హాజరై పలు వైద్య పరీక్షలు చేయించుకుని వైద్యుల సలహాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కన్సల్టెంట్ పిడియాట్రిషియన్ అండ్ నియనటాలజిస్ట్ డాక్టర్ ఫజల్ మెహనాజ్ పాల్గొని మహిళలకు, పిల్లలకు పలు వైద్య పరీక్షలు చేసి వాక్సినేషన్ వివరాలు సమగ్రంగా తెలియ చేసారు.
ఈ కార్యక్రమంలో రేమండ్స్ హమీద్ ఖాన్, రియాజ్ ఖాన్, సీనియర్ హై కోర్ట్ లాయర్ ఐ ఎం అహమ్మద్, ఎక్యూజె గ్రూప్ ఐ హెచ్ ఫారూఖి, వుయ్ గ్రూప్ వఖీర, స్మృతి ఫిట్నెస్ ఫర్జానా, ఫ్యాబ్ తదితరులు పాల్గొని ఉచిత వైద్య శిబిరం నిర్వహించిన వైద్యులను అభినందించారు.

# గో ఆధారిత ప్రకృతి ఆధారిత రైతుల

- సేంద్రియ మామిడి మేళా విజయవంతం
- ఈ నెల 24, 25 తేదీ లలో తిరిగి సేంద్రియ మామిడి పండ్ల మేళా

**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, విశాఖపట్నం, మే 18:**మే 24, 25 తేదీ లలో సేంద్రియ మామిడి పండ్ల మేళా ను మరో సారి విశాఖపట్నం విశాలాక్షి నగర్ లోని బివికె కళాశాలలో నిర్వహించను న్నట్టు గో ఆధారిత ప్రకృతి ఆధారిత రైతుల సంఘం జాతీయ నేత జలగం కుమార్ స్వామి పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం బివికె కళాశాలలో నిర్వహించిన మామిడి పండ్ల మేళా లో ఆయన మాట్లాడారు. రెండు రోజులుగా నిర్వహించిన మేళా నగరవా సులు సహకారంతో విజయవంతం అయ్యిందని అన్నారు. ఇంత జయప్రదంగా ఆరోగ్యకరమైన మామిడి పండ్ల మేళాకు సహకారం అందించిన వారిందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. విశాఖ లో వచ్చే శని, ఆదివారాల్లో కూడా మేళాను ఏర్పాటు చేస్తామని చెప్పారు. అరుదైన మామి డి రకాలు ఈ మేళాలో అందుబాటులో ఉన్నా యని ఇవన్నీ రసాయనాలు లేకుండా సేంద్రియం గా పండించినవని కుమార్ స్వామి చెప్పారు.
విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పేరి రామకృష్ణ మాట్లా డుతూ, మన దేశంలో అనేక రకాల దేశీయ మా మిడి కాయలు ఉన్నాయని వాటిని కాపాడు కోవడం మన బాధ్యత అన్నారు. పంచదార కలిశాలు, పండూరి మామిడి, కొత్తపల్లి కొబ్బరి, స్వాగతం, అమృతం, పాపారాజు గోవా, నాగుల పల్లి ఇరసాలు, హైదర్ సాయిబు, జహంగీర్, పెద్ద రసాలు, చిన్న రసాలు, బంగినపల్లి, సువర్ణ రేఖ కొబ్బరి అంటు, ముంత మామిడి , సన్నా కులు, దొండకాయ , ఇమామ్ పసంద్ తదితర రకాలు ఈ మేళాలో అమ్మకానికి అందుబా టులో ఉంటాయని అన్నారు. ఈ మేళా కు వచ్చే వారు గుడ్డ సంచులు, గోగు నార సంచులు తీసుకుని రావాల్సిందిగా కోరుతున్నామన్నా రు . సేంద్రియ రైతు రిషికుమార్ మాట్లాడుతూ యువ రైతులు వ్యవసాయ రంగంలోనికి తీసుకు రావాలని కోరారు. దేశంలోని మామిడి రకాల అన్నింటిని ఒకే దగ్గర అందుబాటులో ఉంచటం అవసరం అన్నారు. ప్రాచీన కాలానికి చెందిన అన్ని రకాలను కాపాడుకోవడానికి ఇటువంటి మేళాలు ఉపయోగపడతాయని ప్రకటించారు, సంఘం కార్యదర్శి పాలెం నేచురల్స్ అశోక్ మాట్లాడుతూ ఉత్తరాంధ్రకు చెందిన అన్ని రకాల మామిడి తో రెగ్యులర్గా మేళాలు నిర్వహించాలని అనుకుంటున్నామ న్నారు.
ఈ కార్యక్రమంలో పలువురు నగరవాసులు, రైతులు పాల్గొన్నారు.



# పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం

**గాజువాక : పెన్ పవర్ ,మే 18** నడుపూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల 2010–2011 సంవత్సరం 10వ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నడుపూరు ఉన్నత పాఠశాల లో ఘనంగా నిర్వహించారు. చిన్ననాడు చదువు చెప్పిన ఉపాధ్యాయులు సన్మానించి అనంతరం చిన్ననాటి చదువుకున్న మధుర స్మృతులను నెమరు వేసుకుంటూ ఆత్మీయంగా ఆనందంగా గత 14 సంవత్సరాలు క్రితం ఒకచోట చదువుకున్న మధుర జ్ఞాపకాలు ఒకచోట కలవడం సంతోషంగా ఉందని భావోద్వేగానికి గురై సంతోషం వ్యక్తం చేశారు.ఇకనుండి ప్రతి సంవత్సరం అందరం ఒకచోట కలుసుకొని కష్టసుఖాలు పాలు పంచుకుంటామని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సింహాచలం నాయుడు,భాస్కర్,రాజకుమార్,సురేష్,శ్రీనివాస్,వీర్రాజు, రాజలక్ష్మి పూర్వ విద్యార్థులు వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# 87వ వార్డ్ తెలుగుదేశం పార్టీ నూతన కమిటీ నియామకం

-వార్డ్ అధ్యక్షుడు గా సాగి విజయరామరాజు



**గాజువాక: పెన్ పవర్ ,మే 18** మహా విశాఖ నగర పాలక సంస్థ 87వ వార్డ్ నూతన కమిటీ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు , గాజువాక నియోజకవర్గం శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావు ఆదేశాలమేరకు రాష్ట్ర కార్యదర్శి స్థానిక వార్డ్ కార్పొరేటర్ బోండా జగన్నాథం జగన్ ఆధ్వర్యంలో నియోజకవర్గ పరిశీలకులు ఎంపీఎస్ చౌదరి సమక్షంలో నియమించడం జరిగింది. వార్డ్ నూతన అధ్యక్షుడు గా సాగి విజయరామరాజు, ఉపాధ్యక్షుడు ప్రగడ దానయ్య, ప్రధాన కార్యదర్శి బొట్టా ప్రకాష్, క్లస్టర్ ఇంచార్జ్ సూరిశెట్టి పెంటారావు, ట్రెజరర్ మల్ల రాము, కమిటీ సభ్యులను , మహిళా కార్యకర్తలను ఎన్నుకున్నారు . ఈ సందర్భంగా ముఖ్య అతిధులు మాట్లాడుతూ తమకు ఇచ్చిన బాధ్యతను సక్రమంగా నిర్వహించి పార్టీకి అంకితభావంతో సేవ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రాజన్ రాజు,ప్రగడ దానయ్య, ద్రోణద్రి అప్పలరాజు, కళ్లేపల్లి శ్రీనివాసవర్మ, గండేపల్లి రాము, కడుపుట్ల శ్రీను, భాగ్య లక్ష్మి,పోతల కృష్ణ, జాన్ రమేష్,బొడ్డేటి దేమ్ముళు ,,ఆదినారాయణ,మురలి తదితరులు పాల్గొన్నారు.

## నేడు కాకినాడకు రానున్న పద్మశ్రీ మందకృష్ణ మాదిగ



**కాకినాడ.పెన్ పవర్ మే 18 :** మాదిగ జాతి అభ్యున్నతికి అలుపెరుగని పోరాటం చేసిన కొండేపూడి శ్యామ్ బాబు మాదిగకు నివాళులు అర్పించేందుకు ఈనెల 19వ తేదీన మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ కాకినాడ నగరానికివిచ్చేయనున్నారని ఎంఆర్పిఎస్, ఎంఎస్పి జాతీయ నాయకులు ముమ్మిడివరపు చినసుబ్బారావు మాదిగ తెలిపారు. కాకినాడ నగరంలో స్థానిక లేడీస్ క్లబ్ వద్దగల పార్కు ఆవరణలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎంఆర్పిఎస్, ఎంఎస్పి జాతీయ నాయకులు ముమ్మిడివరపు చినసుబ్బారావు మాదిగ పాల్గొని మాట్లాడుతూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎం.ఆర్.పి.ఎస్ అధ్యక్షులుగా పనిచేసిన కొండేపూడి శ్యామ్ బాబు మాదిగ ఇటీవల పరమపదించిన నేపథ్యంలో ఎంఆర్పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మంద కృష్ణమాదిగ శ్యామ్ బాబు కుటుంబాన్ని పరామర్శించి, సంస్మరణ సభలో పాల్గొనడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా కాకినాడ జిల్లాలో అన్ని నియోజకవర్గాలకు ఇన్చార్జిలను ఏర్పాటు చేసి కూటమి ప్రభుత్వం ద్వారా పార్టీ బలోపేతానికి కృషి చేయడం జరుగుతుందన్నారు.అలాగే ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని అడ్డుపెట్టుకొని అక్రమాలకు,దౌర్జన్యాలకు పాల్పడుతున్న వ్యక్తులను గుర్తించి వారిని నియంత్రించే విధంగా కార్యాచరణ చేపట్టడం జరుగుతుందని తెలిపారు.ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో దొంగలను నియంత్రించడమే కొండేపూడి శ్యాంబాబు మాదిగకు తాము ఇచ్చే నిజమైన నివాలి అని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాకినాడ జిల్లా ఎంఎస్పి అధ్యక్షులు వల్లూరి సత్తిబాబు మాదిగ,వీరబాబు, ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు డోకుబుర్ర భద్రం మాస్టర్,ఎంఎస్ పి కాకినాడ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పలివెల నవీన్ మాదిగ,ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కాకాడ నూకరాజు మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు అనంతవరపు రాజు మాదిగ, ఎం.ఎస్.పి జిల్లా ప్రధాన కార్యదర్శి దూలపల్లి వెంకటరమణ,మాదిగ లాయర్ల ఫెడరేషన్ కాకినాడ జిల్లా అధ్యక్షులు కిలాడి దయానందరాజు,ఎంఇఎఫ్ జిల్లా అధ్యక్షులు చాట్ల ఆశీర్వాదం,ఎంఎంఎస్ నాయకురాలు మోటుకూరి వరలక్ష్మి, తుమ్మలపల్లి చిన్న, కింతాడ సత్తిబాబు, నందిక వీరబాబు,తదితరులు పాల్గొన్నారు.ద

## అంతర్రాష్ట్ర కూరగాయ మార్కెట్ పనివేళలు మార్పు.



**ఆలమూరు, పెన్ పవర్,మే18:** 216 ఏ జాతీయ రహదారి పక్కన మండలంలోని మడికి వద్ద ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర కూరగాయ మార్కెట్ పనివేళలలో ఈనెల 20 నుంచి మార్పులు చేస్తున్నట్లు మార్కెట్ కమిటీ అధ్యక్షుడు పాలూరి సత్యనారాయణ(సత్తిబాబు) ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రదేశంలో మార్కెట్ ఏర్పాటు చేసిన దగ్గర నుంచి ప్రతి రోజు రెండు దఫాలుగా క్రయ విక్రయాలు జరుగుతున్నయన్నారు. ఇక్కడకు వచ్చే రైతుల సౌకర్యార్థం ఉదయం జరిగే మార్కెట్ సమయం వేకువ జామున యధావిధిగాను, మధ్యాహ్నం జరిగే మార్కెట్ సమయం లో మార్పు చేస్తూ మధ్యాహ్నం తరువాత రెండు గంటల నుంచి మాత్రమే మార్కెట్ నందు క్రయ విక్రయాలు జరుగుతాయన్నారు. దీనికి కారణం చెబుతూ మధ్యాహ్నం జరిగే మార్కెట్ సమయంతో రైతులకు భోజనానికి అంతరాయం ఏర్పడటంతో ఇబ్బందులు పడుతున్న విషయం కమిటీ దృష్టికి వచ్చిందన్నారు. దీంతో మార్కెట్ కమిటీ స్పందించి, సభ్యులతో కూలంకషంగా చర్చించి, ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధ్యక్షుడు సత్తిబాబు తెలిపారు. పై విషయాలపై వినియోగదారులు వ్యాపారులు రైతులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి చెల్లబోయిన సింహాచలం, ఉపాధ్యక్షుడు దొండపాటి వెంకటేశ్వరరావు(బుల్లి రెడ్డి), అందే బుజ్జి, నల్ల వీరబాబు, వెంకట రామారావు, కొత్తపల్లి బుజ్జి దొండపాటి సాయి, తదితర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## కంబాల ఆధ్వర్యంలో భారీ తిరంగా ర్యాలీ





**పెన్ పవర్,మే18:** పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతికారంగా చేపట్టిన ఆపరేషన్ సింధుర్ విజయవంతం కావడంతో దేశ సైనికులకు సంఘీభావం తెలుపుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆదేశాల మేరకు విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ నాయకులు కంబాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రం గోకవరంలో 330 అడుగుల జాతీయ జెండాతో భారీ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో కులమత, పార్టీలకతీతంగా ప్రజలు పాల్గొన్నారు. పంచాయతీ కార్యాలయం నుంచి ర్యాలీ ప్రారంభమై, ప్రధాన రహదారిలో దేవిచౌక్ మీదగా మండల పరిషత్ కార్యాలయం వరకు సాగింది.

మండల పరిషత్ కార్యాలయం వద్ద, జవాన్లు రామకృష్ణ, నరేష్ కుమార్ లను కంబాల శ్రీనివాసరావు ఘనంగా సత్కరించారు.ఆపరేషన్ సింధూర్ లో దేశం కోసం ప్రాణాలర్పించిన మురళి నాయక్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు.

# సైనికుల పోరాటం త్యాగం స్వేచ్ఛ కు కారణం.

- మండపేట లో తిరాంగా యాత్ర.
- సర్వమత ప్రార్ధనలు.
- ఆకట్టుకున్న అతి పెద్ద జాతీయ జెండా.




**మండపేట. పెన్ పవర్.మే 18 :** దేశ సరిహద్దులో త్రివిధ దళాల సైనికులు చేస్తున్న పోరాటం, త్యాగాల వల్లే భారత భూభాగంలో పౌరులు ఆనందంగా జీవిస్తున్నామని మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. ఆదివారం మండపేట పట్టణంలోని రథం ఆలయం నుండి బస్ స్టాండ్ వరకు నిర్వహించిన భారీ తిరంగా యాత్ర ర్యాలీలో ఎమ్మెల్యే వేగుళ్ళతో పాటు జనసేన ఇన్ ఛార్జ్ రాష్ట్ర నీటి పారుదల సంస్థ కార్పొరేషన్ చైర్మన్ వేగుళ్ళ లీలా కృష్ణ, బిజెపి నియోజక వర్గ కన్వీనర్ కోటిపల్లి వివి సాయి రామ్ తదితరులు పాల్గన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పెహాల్గామ్ ఉగ్రదాడికి వ్యతిరేకంగా, ఉగ్రవాదులను అణచడానికి, భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సింధూర్ విజయోత్సవం సందర్భంగా త్రివిధ దళాల సైనికులకు సంఘీభావంగా తిరంగా యాత్ర నిర్వహిస్తున్నామన్నారు. ఎంతో ధైర్యంతో భారతదేశం ముందడుగు వేసి భారతీయత చాటి ప్రజలే భారతీయత – ప్రజలే దేశమని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెలుగెత్తి చాటాయన్నారు. భిన్నత్వంలో ఏకత్వానికి తిరంగా ర్యాలీ ఒక చిహ్నమని, భారతీయతకు ఇదొక నిదర్శనమని తెలిపారు. దేశరక్షణ, సరిహద్దుల రక్షణలో అహర్నిశలు నిమగమైన భారత సైనికులకు సంఘీభావం తెలపాలన్నారు. తిరంగా యాత్ర ర్యాలీలో స్వచ్ఛందంగా భాగస్వాములైన ప్రతి ఒక్కరికి క ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. లీలా కృష్ణ మాట్లాడుతూ భారత దేశం ధర్మాన్ని నమ్ముకుందని, భారత సైన్యం ఆపరేషన్ సింధూర్ తో పాకిస్తాన్ కు, శత్రుదేశాలకు స్పష్టంగా అర్థమయ్యేలా నిరూపించారన్నారు. దేశ మహిళల సింధూరం తుడిపిన తీవ్రవాదులకు దేశ మహిళా సైనికుల ద్వారానే గట్టి బుద్ధి చెప్పడం జరిగిందన్నారు. ప్రపంచంలో ఎక్కడ దాక్కున్నా వెతికి వెంట బడి తీవ్రవాదుల తలలు తీసే సత్తా ప్రతి భారతీయుడికి ఉందన్నారు.. రథం సెంటర్ నుంచి బస్ స్టాండ్ వరకు భోలో భారత్ మాతాకీ జై, ఉగ్రవాదులు నశించాలి, భారతీయుల ఐక్యత వర్ధిల్లాలి అనే నినాదాలతో ఉత్సహంగా సాగింది. కలువ పువ్వు సెంటర్ వద్ద సర్వ మత ప్రార్థనలు చేశారు. అనంతరం యుద్ధంలో అసువులు బాసిన అమర జవాన్ మురళీ నాయక్ కు, పహాల్గాం మృతులకు వారు సంతాపం తెలిపారు. ఈ ర్యాలీ లో అతి పెద్ద జాతీయ జెండా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమం లో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు కొన సత్యనారాయణ, దూలీ జయరాజు, నల్లమిల్లి విర్రెడ్డి, ఉంగరాల రాంబాబు, గడి రాంబాబు,తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ గడి సత్యవతి,మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ మందపల్లి చంద్రశేఖర్, బిజెపి జిల్లా కార్యదర్శి గోడవర్తి రామచంద్రరావు, ఎండి కరీం ఖాదారీ, ఎండి కరీం , ఎండి అల్తాఫ్, బొడ్డు రామకృష్ణ,కొవ్వాడ అప్పన్న బాబు, మద్దుల సుబ్బారావు, వివిధ సంఘాల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**పెద్దాపురం, పెన్ పవర్, మే 18 :** పెద్దాపురం పట్టణంలో జవహర్ లాల్ నెహ్రూ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 2003-2004 సంవత్సరం పదవ తరగతి చదివిన విద్యార్థినీ, విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. పూర్వ విద్యార్థులు సుమారు 21 సంవత్సరాల తర్వాత కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధులులేకుండా పోయాయి. నాడు పాఠశాలలో గడిపిన మధురస్మృతులను, జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకుని సంతోషంగా గడిపారు. ఇక్కడ చదవిన విద్యార్థులు ఉన్నత చదువులు అభ్యసించి దేశ, విదేశాల్లో ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారు. నాడు తమకు విద్యాబుద్దులు నేర్పిన గురువులను సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ సుమారు 21 సంవత్సరాల తరువాత తమకు తీపి జ్ఞాపకాలను తిరిగి ఆస్వాదించేలా చేయడం, ప్రతీ విద్యార్థి ఉన్నత స్థానంలో ఉండడం చాలా సంతోషంగా ఉందన్నారు. అనంతరం పూర్వ విద్యార్థులు ఉపాధ్యాయులను దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించి మెమోంటోలను అందజేశారు. అనంతరం విందు భోజనాలు చేశారు.

## అభివృద్ధి సంక్షేమమే తెలుగుదేశం పార్టీ లక్ష్యం



పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప

**పెద్దాపురం, పెన్ పవర్, మే 18 :** రాష్ట్ర అభివృద్ధి, ప్రతీ పేదవాని కుటుంబానికి సంక్షేమ పథకాల అమలు చేయడమే తెలుగుదేశం పార్టీ లక్ష్యమని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన పెద్దాపురం నియోజకవర్గస్థాయి మినీ మహానాడు కార్యక్రమం పండగ వాతావరణంలో నిర్వహించారు. తొలుత తెలుగుదేశం పార్టీ పతాకావిష్కరణ చేసి అనంతరం నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చినరాజప్ప మాట్లాడుతూ ప్రతీ పేదవాడికి సంక్షేమ ఫలాలు అందించాలనే ఆశయంతో స్వర్గీయ నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించారని అన్నారు. పేద వర్గాల కోసం తెలుగుదేశం పార్టీ అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిందని, ఆంధ్ర రాష్ట్ర ప్రజల కోసం నిరంతరం పరితపించే ఏకైక నాయకుడు నారా చంద్రబాబు నాయుడు అని తెలిపారు. తెలుగుదేశం పార్టీని అధికార గద్దెనెక్కి%శీ%చేందుకు ప్రతీ కార్యకర్త నిరంతరం శ్రమించారని, అటువంటి కార్యకర్తలు ఉన్న పార్టీ తెలుగుదేశం పార్టీ అని పేర్కొన్నారు. అన్న ఎన్టీఆర్ ఆశయాలతో తెలుగుదేశం పార్టీ ముందుకు సాగుతుందని, కార్యకర్తల సంక్షేమం కోసం ఆలోచించే ఏకైక పార్టీ అని అన్నారు. పేద వర్గాలకు పింఛన్ అమలు, కిలో రెండు రూపాయలకే బియ్యం వంటి సంక్షేమ పథకాలు అమలు చేసిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని, 45 సంవత్సరాల సుదీర్ఘకాలంలో ఎన్ని ఆటుపోట్లు ఎదుర్కొని పేద వర్గాల కోసం నిరంతరం ఆలోచించే పార్టీ తెలుగుదేశం పార్టీ అని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాజా సూరిబాబు రాజు, బోళ్ళ వెంకటరమణ, రంధి సత్యనారాయణ, అడబాల కుమారస్వామి, తోటకూర శ్రీనివాస్, అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆపరేషన్ సింధూర్ అద్భుత విజయం




**పెద్దాపురం, పెన్ పవర్, మే 18 :** పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా చేపట్టిన ఆపరేషన్ సింధూర్ ద్వారా భారత సైన్యం సత్తా ప్రపంచానికి తెలిసి వచ్చిందని పెద్దాపురం పట్టణంలో నిర్వహించిన తిరంగా ర్యాలీలో పలువురు పేర్కొన్నారు. ఆపరేషన్ సింధూర్ విజయవంతమైన సందర్భంగా భారత సైనికులకు సంఘీభావంగా భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద గల భారతమాత విగ్రహానికి భారతీయ జనతా పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు, బీజేపీ పెద్దాపురం నియోజకవర్గ కార్యక్రమ ఇన్ ఛార్జి డాక్టర్ గొరకపూడి చిన్నయ్యదొర పూలమాలలు వేసి జాతీయ జెండాలు చేతబూని జై జవాన్, జై కిసాన్, వందేమాతరం, భారత్ మాతాకి జై అంటూ నినదించారు. ఈ సందర్భంగా బీజేపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు మాట్లాడుతూ పాక్ ఎయిర్ బేస్‌లపై బ్రహ్మోస్ క్షిపణుల వర్షంతో భీతిల్లిన పాకిస్తాన్ మూడు రోజుల్లోనే కాళ్లబేరానికి వచ్చిందన్నారు. కాల్పుల విరమణకు ఒప్పుకోవడం ద్వారా యుద్ధాన్ని నివారిస్తూ దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కీలకంగా వ్యవహరించారని కీర్తించారు. పాకిస్థాన్‌తో చర్చలు జరిగితే పీఓకే విలీనంపైనే జరుగుతాయని, ఈ విషయంలో ఇతర దేశాల జోక్యం అవసరం లేదని, సమస్యను పరిష్కరించుకునే సత్తా భారత్‌కు ఉందన్నారు. ఆపరేషన్ సింధూర్‌లో వీరోచిత పోరాటం చేసిన సైనికులందరికీ జేజేలు కొట్టాలన్నారు. దేశాన్ని కాపాడుకోవడానికే భారత్ ఎదురు దాడికి దిగిందని, ప్రధాని మోడీ వ్యూహాత్మకంగా వ్యవహరించారని చెప్పారు. దేశ ఐకమత్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని అన్నారు. ఆపరేషన్ సింధూర్ కనీవినీ ఎరుగని గొప్ప విజయమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పెద్దాపురం పట్టణ అధ్యక్షుడు బొలిశెట్టి రామ్ కుమార్, సామర్లకోట పట్టణ అధ్యక్షుడు పుప్పాల నాగ గోవిందు, పెద్దాపురం మండల అధ్యక్షుడు పోతుల ప్రభాకర్, అధిక సంఖ్యలో బీజేపీ శ్రేణులు, తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత ఎముకల సాంద్రత పరీక్షలు.



**మండపేట. పెన్ పవర్.మే 18 :** టోరెంట్ కంపెనీ ఆధ్వర్యంలో బురుగుంట వైఎస్ ఆర్ పార్కులో డొక్కా సీతమ్మ వాకర్స్ క్లబ్ నేతృత్వంలో క్లబ్ అద్యక్షులు కోన సత్యనారాయణ ఆద్వర్యంలో ఆదివారం ఉచిత ఎముకల సాంద్రత పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ వైద్యులు డాక్టర్ బిక్కిన తాతబ్బాయి చౌదరి,ఫిజియోథెరపీ వైద్యులు డాక్టర్ ఎమ్.డి హైదర్ పాల్గొని రోగులకు పరీక్షలు నిర్వహించారు.

ఎముకల సాంద్రత పరీక్ష అనేది బలాన్ని నిర్ణయించడానికి ఉపయోగించే ఒక వైద్య ప్రక్రియ అని కొన సత్యనారాయణ పేర్కొన్నారు. ఇది బోలు ఎముకలు వ్యాధి, భవిష్యత్తులో ఎముకల పగుళ్ల ప్రమాదాన్ని గుర్తించగలదన్నారు. ఎముక సాంద్రతను కొలవగల వివిధ విధానాలు ఉన్నాయన్నారు.

ఈ కార్యక్రమంలో టెక్నీషియన్ రమేష్,మెడికల్ రిప్రజెంట్ జావిద్ క్లబ్ ప్రధాన కార్యదర్శి అబ్బాస్, ఉపాధ్యక్షులు రెడ్డిరాజు, సిహెచ్ భాస్కరరాజు, గంపలసత్యప్రసాద్, వెంకట్రావు,తాతపూడి సుధీర్,పార్కు సిబ్బంది కన్న,వాసు సహాయసహకారాలు అందించారు.150 మందికి పరీక్షలు నిర్వహించారు. మందులు పంపిణీ చేశారు.

## రాధాకృష్ణ ను పరామర్శించిన మాజీ మంత్రి వేణు.



**మండపేట. పెన్ పవర్.మే 18 :** రాష్ట్ర వైసిపి రైతు విభాగం కన్వీనర్, మునిసిపల్ కో ఆప్షన్ సభ్యులు రెడ్డి రాధాకృష్ణ ను మాజీ మంత్రి చెల్లుబోయిన వేణు ఆదివారం పరామర్శించారు. రాధాకృష్ణ తనయుడు రెడ్డి సందీప్ ఇటీవల ప్రమాదానికి గురి అయి హైదారాబాద్ యశోద లో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో వేణు రాధాకృష్ణ ను పరామర్శించారు. సందీప్ త్వరగా కోలుకోని సంపూర్ణ ఆరోగ్యం తో ఇంటికి రావాలని వేణు పేర్కొన్నారు.

ఓగిరాల దేవి, పెంకే గంగాధర్, సాధనలా శివ, పిఠాపురం సత్యనారాయణ, 29 వ వార్డు కౌన్సిలర్ పిల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మరిడమ్మ దేవస్థానంలో అన్నదానం



**పెద్దాపురం, పెన్ పవర్, మే 18 :** భక్తుల పాలిట కొంగుబంగారంలా విరాజిల్లుతున్న పెద్దాపురం మరిడమ్మ అమ్మవారి దేవస్థానంలో ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.. భక్తుల సౌకర్యార్థం వారం వారం ఈ అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ అసిస్టెంట్ కమీషనర్ కె. విజయలక్ష్మి తెలిపారు. అలాగే భవిష్యత్తులో నిత్య అన్నదాన కార్యక్రమం నిర్వహించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం సీనియర్ అసిస్టెంట్ ఎస్.వెంకటరమణ, ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# రెండు మండలాల సరిహద్దుల్లో ఉన్న పెద్దేరు పై ఇసుక బకాసురులు





తెలిసినా కేసులు నమోదు చేయలేని అధికారులు

**వై రామవరం,పెన్ పవర్, మే 18:** రెండు మండలాల సరిహద్దుల్లో ఉన్న పెద్దేరు లో ఇసుకను నిబంధనలకు విరుద్ధంగా సేకరిస్తున్న ఇసుక బకాసురులపై ఏ విధమైన కేసులు నమోదు చేసిన దాఖలాలు లేవని స్థానికులు ఆరోపిస్తున్నారు.

వివరాల్లోనికి వెళ్తే అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు, వై.రామవరం మండలాల సరిహద్దుల్లో పెద్దేరు ప్రవహిస్తుందని తెలిపారు. యు. చీడిపాలెం, బూరుగు వాడ సరిహద్దు గ్రామాలలో ఉన్న పెద్దేరు నుండి అక్రమంగా నిబంధనలకు విరుద్ధంగా యంత్రాలతో ఇసుకను సేకరిస్తూ స్టాక్ చేయుచున్నారని ఆయా గ్రామస్తులు తెలిపారు. సెలయేర్ల నుండి యంత్రాలతో ఇసుక సేకరించడం ఒక నేరమైతే, ఇసుకను నిలువ చేయడం మరో నేరమని అంటున్నారు. ఏజెన్సీలో ఇసుక రీచ్ లు లేకపోవడంతో ఎక్కువగా కొండ కాలువలు,సెలయేర్ల నుండే ఇసుకను సేకరిస్తూ తమ అవసరాలకు ఉపయోగించుకుంటూ ఉంటామని తెలిపారు. కాంట్రాక్టర్లు,దళారుల వ్యవస్థ పెరగడంతో అక్రమ మార్గాలలో ఇసుకను సేకరిస్తూ లక్షలాది రూపాయల ధనాన్ని అర్జిస్తున్నారని తెలిపారు. అత్యవసర పరిస్థితులలో ట్రాక్టర్ ఇసుక మూడు వేల నుండి నాలుగు వేల రూపాయలు వరకు అమ్మకాలు సాగిస్తున్నారని అంటున్నారు. ఇసుక సేకరించేది ఎవరో రెవెన్యూ సిబ్బందికి,సచివాలయం సిబ్బందికి తెలిసిన ఏ ఒక్కరిపై కేసులు నమోదు చేసిన దాఖలాలు లేవని స్థానికుల ఆరోపిస్తున్నారు. ఇసుక నిలువలు ఉన్న చోటికి శుక్రవారం వైరామవరం తహసిల్దార్ వెళ్లి ప్రత్యక్షంగా చూశారని స్థానికులు అంటున్నారు. ఇసుక నిలువలు ఉన్నచోట ఏ విధమైన యంత్రాలు లేకపోవడంతో ఎవరి మీద కేసు పెడతామని అంటున్నారని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇసుకను తరలిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని అన్నారే తప్పా 24 గంటలు గడిచిన ఏ ఒక్కరి మీద కేసు నమోదు చేయలేదని అంటున్నారు. ఏదేచ్ఛగా రాత్రి సమయంలో ఇసుకను ట్రాక్టర్లతో రవణా చేసుకో పోవుచున్నారని స్థానిక గిరిజనులు తెలిపారు. ఇకనైనా పై అధికారులు స్పందించి ఆక్రమంగా నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను సేకరించి నిలువ చేసిన వారిపై కేసులు నమోదు చేయాలని గిరిజనులు కోరుతున్నారు.

# ఉత్సవ విగ్రహాలతో గ్రామోత్సవం




**టి నర్సాపురం, పెన్ పవర్, మే 18:** బొర్రంపాలెం గ్రామంలో శ్రీ వల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వినాయక జంట సర్పాల వత్సవాయి విగ్రహాలను హిందూ సాంప్రదాయం తో మేళతాళాలతో గ్రామంలో ట్రాక్టర్ మీద ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలోఊరేగించారు. భక్తులు స్వామివార్లకు పసుపు, కుంకుమలు, పండ్లు పలహారములు అందజేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.ం

# సరిపడా గోనె సంచులు రైతులు తీసుకునే అవకాశం



**పెనుమంట్ర, పెన్ పవర్, మే-18:**మండలంలో రబీ సీజన్ లో 12123 ఎకరాలలో వరి పంట సాగు చేయబడినదని,
దీనికి గాను 43900 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చినట్లు గుర్తించినట్లు మండల వ్యవసాయ అధికారి జ్యోషీలా శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల ద్వారా మొత్తం ధాన్యం కొనుగోలు సరిపడా గోనె సంచులు రైతులకు అందజేసినట్లు తెలిపారు. క్రమ పద్ధతిలో రోజుకి 1000 నుండి 1500 ఎం టి ఎస్ వరకు రైతులు కోరిన మిల్లులకు నాణ్యత ప్రమాణాలకు లోబడి కొనుగోలు చేస్తున్నామని అన్నారు. మరియు ప్రభుత్వం వారు నిర్ణయించిన మద్దతు ధర రైతుల ఖాతాలకు నేరుగా జమ చేయబడుతున్నాయన్నారు. ఇప్పటి వరకూ మొత్తం 40150 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయడం పూర్తి చేశామని అన్నారు. ఇంకా 3750 మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేయవలసి ఉందని అన్నారు. రాబోవు మూడు రోజులలో కొనుగోలు పూర్తి చేస్తామని తెలిపారు.ం

# ఈనెల 21 నుండి మూలారెడ్డి కళాపరిషత్ జాతీయ స్థాయి సాంఘిక నాటిక పోటీలు.. ఎమ్మెల్యే నల్లమిల్లి..



**అనపర్తి, పెన్ పవర్, మే 18.**నల్లమిల్లి మూలారెడ్డి కళాపరిషత్ జాతీయస్థాయి సాంఘిక నాటిక పోటీలు ఈనెల 21వ తేదీన ప్రారంభమై మే 21,22,23, మే 24 బహుమతి ప్రధానోత్సవం జరుగుతుందని అ నపర్తి ఎమ్మెల్యే పరిషత్ అధ్యక్షులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. అనపర్తి ఎస్ఎన్ఆర్ ఫంక్షన్ హాల్ లో విలేకరుల సమావేశంలో పరిషత్ గురించి ఆయన వివరించారు.
1989లో స్థాపించి ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలో ఒక ప్రతిష్టాత్మక సంస్థగా ఉన్న నల్లమిల్లి మూలారెడ్డి కళాపరిషత్ ప్రతి సంవత్సరం కూడా వివిధ రంగాల్లో నిష్ణాతులు అయిన మహానుభావులకి పరిషత్ తరపున సత్కారం చేయడం మొదటిరోజు ప్రారంభ వేడుకలు, ప్రధానత్సవ సభ అత్యంత వైభవంగా నిర్వహించడం నాటికలు పోటీలు ఎక్కడ రాజీ లేకుండా చేయడమే ఈ పరిషత్ యొక్క ప్రత్యేకత అన్నారు. దానిలో భాగంగానే ఈ సంవత్సరం విశిష్ఠ అతిథులు మహా గ్రూప్స్ ఛానల్ మేనేజింగ్ డైరెక్టర్ వంశీ కృష్ణ దంపతులకు సత్కారం జరుగుతుందన్నారు.
అదే విధంగా ఆరోజు ముఖ్య అతిధులుగా రాష్ట్ర గనుల మరియు అబ్కారీ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, పర్యాటక శాఖ మాత్యులు కందుల దుర్గేష్, రాష్ట్ర బిజెపి అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, అదే విధంగా సాహితీ రంగానికి, కళారంగానికి సేవలందిస్తున్న పూర్వపు మంత్రివర్యులు, ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్, ముఖ్య అతిథులుగా పాల్గొంటారన్నారు. అదే విధంగా ప్రముఖ సినీ నటుడు గౌతమ్ రాజు, హైదరాబాద్ కు చెందిన అభినయ నాటక కళాపరిషత్తు అభినయ శ్రీనివాస్, రాష్ట్ర పరిషత్తు నిర్వహకుల సమాఖ్య అధ్యక్షులు బుద్దాల వెంకట రామారావు మొదటి రోజు కార్యక్రమలలో పాల్గొనడం జరుగుతుందని చెప్పారు. తదుపరి నాటికలు ప్రదర్శన మే 22,23 నాటిక నాటికల ప్రదర్శనలు అయిన తర్వాత మే 24 బహుమతి ప్రధానోత్సవ సభలో రాష్ట్ర కార్మిక శాఖ మాత్యులు వాసంశెట్టి సుభాష్ రాష్ట్ర శాసనసభ ఉపసభాపతి కనుమూరి రఘురామకృష్ణంరాజు ముఖ్య అతిథిగా పాల్గొంటారు.
ఇటీవల ఉభయ గోదావరి జిల్లాల నుంచి శాసనమండలి కి,రాజ్యసభ కి ఎన్నికైన సభ్యులకు సత్కార కార్యక్రమాలు ఉంటాయన్నారు. తెలుగుదేశం పార్టీ నుంచి రాజ్యసభ ఎన్నికైన సానా సతీష్ కి, బిజెపి నుంచి రాజ్యసభ సభ్యులు పాక వెంకట సత్యనారాయణకి బిజెపి తరపున శాసనమండలికి ఎన్నికైన సోము వీర్రాజుకి, తెలుగుదేశం పార్టీ నుంచి శాసనమండలికి ఎన్నికైన పేరాబత్తుల రాజశేఖర%శీ%కి ఈ నలుగురికి సత్కార కార్యక్రమం ఉంటుందన్నారు. ఆ తదుపరి అదే వేదిక పైన బహుమతి ప్రధానోత్సవం జరుగుతుంది. ఈ మధ్యకాలంలో పరిషత్ నిర్వహణకు కొన్ని అనివార్య కారణాలవల్ల విరామం రావడం జరిగింది. మా పరిషత్ కి మూల స్తంభంగా ఉన్న వెంకట కృష్ణారెడ్డి అకాల మరణం వల్ల, కొంత సమాచారం లోపం వల్ల అందరికీ ఆహ్వానాలు పంపించలేకపోయామన్నారు.
కళాకారులు,కళాభిమానులు మూలారెడ్డి అభిమానులు ఈ నాటక పరిషత్తు పట్ల, కళల ఆసక్తి ఉన్నవారు అందరూ ఇదే ఆహ్వానంగా భావించి మే 21 నుండి మే 24 వరకు జరిగే నల్లమిల్లి మల్లారెడ్డి కళాపరిషత్ కార్యక్రమాల్లో పాల్గొని మీ అభిమానాన్ని, మీ ఆప్యాయతను కళాపరిషత్ కు అందించాలని కోరారు.
ఆహ్వానం ఎవరికైనా అందకుంటే ఇదే ఆహ్వానంగా భావించి ఈ కార్యక్రమంలో పాల్గొనాలని హృదయ పూర్వకంగా ప్రతి ఒక్కరిని ఆహ్వానిస్తున్నన్నారు.

# ఆలయ పున:ప్రతిష్ట మహోత్సవం

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి,వినాయక జంట సర్పాల విగ్రహాల ప్రతిష్ట



**టీ నర్సాపురం, పెన్ పవర్,మే 18:** శ్రీవల్లి దేవసేనసమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి మరియు వినాయక జంట సర్పాల ఆలయ పున:ప్రతిష్ట మహోత్సవం కార్యక్రమములు 19 5 2018 సోమవారం నుండి రియాల్టీ అయిదు 2025 బుధవారం వరకు ఈ కార్యక్రమం నిర్వహించబడును. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ 1957 సంవత్సరంలో ఆలయ ధర్మకర్తలు ముక్కు వెంకన్న భార్య అచ్చుమ్మ జయవరపు పుల్లయ్య భార్య లక్ష్మీకాంతం సంయుక్తముగా ప్రతిష్టించిన శ్రీ వల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యస్వామి మరియు వినాయక జంట సర్పాల ఆలయ పున:ప్రతిష్ట మహోత్సవము స్వస్తిశ్రీ చంద్రమాన వ్యవహారిక శ్రీ విశ్వ వసు నామ సంవత్సర వైశాఖ మాస బహుళ పక్షనవమి అనగా 21-5-2025 బుధవారం ఉదయం గంటల 8-51 నిమిషాలకు శతభిషా నక్షత్ర యుక్త మిధున లగ్న పుస్కారాంశము నందు బొర్రంపాలెం గ్రామంలో నూతన ఆలయం ప్రతిష్ట జరుగునని తెలిపారు. శ్రీ సీతారామాంజనేయ భజన మండలి వారిచే భజన కార్యక్రమం సోమవారం నిర్వహించబడునని, సాయంత్రం పూజా కార్యక్రమాలు హోమములు తీర్థప్రసాదాలు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జరుగుతాయని కమిటీ సభ్యులుతెలిపారు. జాలాదివాసములో ఆడపడుచులు ఇచ్చే బిందువులతో నీళ్లు సమర్పణ జలాది వాసం, తీర్థ ప్రసాదాలు, సాయంత్రం గ్రామంలో ప్రభూతి బలి, విశేషం మహా శాంతి హోమం తీర్థప్రసాదాలు మంగళవారం జరుగుతాయని ఈ కార్యక్రమములు శ్రీమన్ అగ్నిహోత్రం శ్రీనివాస చార్యులు మరియు ఫణి కుమార్ ఆచార్యులు కృష్ణాజిల్లా వారిచే నిర్వహించబడును అని కమిటీ సభ్యులు తెలిపారు. బుధవారం ఉదయం 11 గంటల నుండి మహా అన్న సమారాధన జరుగునని ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, గ్రామ ఇరువైపుల ఉన్న భక్తులు యవన్మంది పాల్గొని స్వామివారి కార్యక్రమాలు తిలకించి తీర్థ ప్రసాదములు స్వీకరించి తరించవలసినదిగా కమిటీ వారు కోరుచున్నమని తెలిపారు. ఆలయ కమిటీ - బొర్రంపాలెం

# గ్రంథాలయంలో విద్యార్థుల కు శిక్షణ



**పెనుమంట్ర,పెన్ పవర్, మే-18:**మండలంలోని మార్టేరు శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా 20వ రోజు విశ్రాంత ఆంగ్ల ఉపాధ్యాయులు పి. సువర్ణగౌరి పిల్లలకు ఇంగ్లీష్ స్టోరీ రీడింగ్ మరియు టెల్లింగ్ నేర్పించడం జరిగినదని గ్రంథ పాలకుడు పిటిఎస్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ
పిల్లల చేత కధలు బుక్స్ చదివించడం జరిగినదని తెలిపారు.ఈ వేసవి విజ్ఞాన శిబిరంలో యమ్. జాహ్నవి, కె. భవ్య, కె. కళా శ్రీ, బి. పూర్విక, యస్. సుభాష్, బి. గీత, కె. సాయి, సి.ఆర్. రోనాల్డ్, జె. మోహన్, బి. కార్తిక, కె. దీపిక తదితర విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని మానవత మరియు గ్రంథాలయ సిబ్బంది కలిసి నిర్వహించినట్లు తెలిపారు.

# బురద వలస గ్రామానికి రహదారి సౌకర్యం ఏర్పాటు చేసుకున్న యువత





**వై రామవరం,పెన్ పవర్, మే 18:** మండలంలో గుర్తేడు పంచాయతీ బురదవలస గ్రామానికి రహదారి సౌకర్యం లేకపోవడంతో, గ్రామస్తులు అందరూ కలిపి రహదారి సౌకర్యం ఏర్పాటు చేసుకున్న సంఘటన ఇది.

మారుమూల గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించడం జరుగుతుందని ప్రకటనలకే అధికారులు పరిమితం అవుతున్నారని బురద వలస గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించలేకపోయారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

వర్షాలు వస్తే కొండలపై ఉన్న తమ గ్రామం రహదారి కొట్టుకుపోతుందని ఈ విషయం అధికారులకు తెలిసిన నిరోధక చర్యలు తీసుకోలేక పోతున్నారని ఆరోపిస్తున్నారు. సంవత్సరానికి ఒక్కసారైనా ఏ అధికారి తమ గ్రామం సందర్శించిన దాఖలాలు లేవని వారు ఆరోపిస్తున్నారు. ఐ టి డిఏ అధికారులు ఉన్న గిరిజనాభివృద్ధి అంటూ ప్రకటనలకే పరిమితం అవుతున్నారు గాని, నేటికీ పక్కా రహదారి బురద వలస గ్రామానికి రహదారి ఏర్పాటు చేయలేకపోయారని బురద వలస గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఎవరో వస్తారు ఏదో చేస్తారని ఆశించకుండా గ్రామస్తులు అందరూ ఏకమై రహదారి సౌకర్యం ఏర్పాటు చేసుకున్న సంఘటన చోటుచేసుకుంది. ఇక నుండైన ఐటిడిఏ అభివృద్ధి అధికారులు స్పందించి తమ గ్రామానికి శాశ్వతంగా రహదారి సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# మండపేట ను రాజమహేంద్రవరం లో విలీనం చేయాలి.

మినీ మహానాడు లో తీర్మానం.



**మండపేట.పెన్ పవర్. మే18:**మండపేట నియోజకవర్గ మహానాడు కార్యక్రమంలో పలు తీర్మానాలు చేశారు.ఎన్.టి.ఆర్ కు భారత రత్న ఇవ్వాలని తీర్మానించారు. మండపేట నియోజకవర్గాన్ని రాజమహేంద్రవరం కేంద్రంగా ఏర్పడిన తూర్పుగోదావరి జిల్లాలో కలపాలనీ ప్రతిపాదించారు. వైసీపీ ప్రభుత్వంలో వివిధ కారణాలతో తొలగించిన ఫించన్లు, రేషన్ కార్డులు పున:రుద్ధరించాలన్నారు.
వైసీపీ ప్రభుత్వంలో రద్దు చేసిన కమ్యూనిటీ హాల్స్, లింకు రోడ్లు, పుంత రోడ్లు, బిటి రోడ్లు తిరిగి నిర్మించాలన్నారు. బ్యాంకు ఋణాలు రద్దు చేసి టిడ్కో గృహాలు లబ్దిదారులకు అందించాలన్నారు.
జొన్నాడ ఎన్.హెచ్ 16 నుండి మండపేట %-% ద్వారపూడి మీదిగా రాజానగరం ఎన్.హెచ్ 16 వరకు నాలుగు లైన జాతీయ రహదారి నిర్మించాలని నిర్ణయించారు.పుష్కరాల సమయానికి జొన్నాడ-యానం ఏటిగట్టు రోడ్డు ను నాలుగు లైన్లు రోడ్డుగా నిర్మించాలాన్నారు.
తాపేశ్వరం బైపాస్ రోడ్డు పూర్తి చెయ్యాలని పేర్కొన్నారు. 2014-2019 లో చేసిన వివిధ పనులకు సంబంధించి పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని తీర్మానించారు.2019-2024 మధ్య కాలంలో మండపేట నియోజకవర్గ టీడీపీ నాయకులు, కార్యకర్తలపై వైసీపీ నాయకులు అక్రమంగా పెట్టిన కేసులను తొలగించాలన్నారు.2014-2019 మధ్య కాలంలో కాపు సామాజిక వర్గానికి ఇచ్చిన 5 శాతం రిజర్వేషన్ ను అమలు చెయ్యాలనే తీర్మానాలు చేశారు.

# రెండు మద్యం బెల్ట్ షాపులపై పోలీసుల దాడి

15 మద్యం బాటిల్ స్వాధీనం

**రాజవొమ్మంగి పెన్ పవర్ మే 18:** రాజవొమ్మంగి మండలం కిమ్మలగడ్డ గ్రామంలో అక్రమంగా మద్యం అమ్ముతున్న వారిని వద్ద నుంచి ఐదు మద్యం బాటిల్ స్వాధీనం చేసుకున్నారు .
అదుపులోకి తీసుకున్నారు .అలాగే రాజవొమ్మంగి ,గ్రామంలో అక్రమ మద్యం బెల్ట్ షాప్ 10, బాటిల్స్ స్వాధీనపరుచుకున్నారు, పోలీసుల సమాచారం మేరకు రాజవొమ్మంగిలోని అక్రమంగా మద్యం అమ్ముతున్న వారి వద్ద నుంచి 15. మద్యం బాటిల్స్ ని ఇరుచోట్ల అక్రమ మద్యం బాటిల్స్ విలువ 1197 రూపాయలు విలువ ఉన్నట్లు రాజవొమ్మంగి ఎస్సై నరసింహమూర్తి మీడియాకు తెలిపారు అలాగే బహిరంగ ప్రదేశంలో మద్యం సేవించడం కానీ అసంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆయన తెలిపారు.

# ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ





- మంత్రి రామానాయుడు ఆదేశాలకు మట్టపర్రు సర్పంచి ఆధ్వర్యంలో..
- కృతజ్ఞతలు తెలిపిన కూలీలు

**పెనుమంట్ర, పెన్ పవర్, మే 18:** మండలం మట్టపర్రులో ఆదివారం ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ పంపిణీ చేశారు. రాష్ట్ర జలవనరుల అభివృద్ధి శాఖ మంత్రిని నిమ్మల రామానాయుడు ఆదేశాల మేరకు మట్టపర్రు సర్పంచి దొమ్మేటి శీను ఆధ్వర్యంలో కూలీలకు మజ్జిగ అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచి దొమ్మేటి శ్రీను మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో గ్రామస్తులు ఉపాధి హామీ పనులు చేయడానికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. నివాసాలకు దూరంగా పొలాల మధ్యలో దాహార్తి తీర్చేందుకు మజ్జిగ పంపిణీ చేయడం ఆత్మసంతృప్తిని కలిగించింది అన్నారు. మజ్జిగ తాగిన కూలీలు దాహం తీరి సంతోషించటం తనకెంతో ఆనందాన్నిస్తుంది అన్నారు. తమను భాగస్వాములుగా చేసినందుకు మంత్రి రామానాయుడు కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మట్టపర్రు టిడిపి గ్రామ అధ్యక్షుడు కేత హరి వెంకటకృష్ణ, బూత్ కన్వీనర్ విష్ణు, పంచాయతీ కార్యదర్శి శేఖర్ బాబు, కూలీలు తదితరులు పాల్గొన్నారు.

# యూఎస్ లో వంతెనను ఢీకొన్న నేవీ నౌక... షాకింగ్ వీడియోలు!



**హైదరాబాద్ పెన్ పవర్:** న్యూయార్క్ లోని బ్రూక్లిన్ వంతెనను మెక్సికన్ నేవీ శిక్షణా నౌక ఢీకొట్టింది. ఈ ప్రమాదానికి సంబంధించిన పలు వీడియోలు నెట్టింట వైరల్ గా మారాయి. ఓడకు సంబంధించిన మూడు మాస్ట్ ల పైభాగం ఐకానిక్ బ్రిడ్జ్ ని ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటు చేసుకొంది. ఈ ఘటనలో ఇద్దరు మరణించగా.. సుమారు 19 మంది గాయపడ్డారు. అవును... బ్రూక్లిన్ వంతెనను మెక్సికన్ నౌక ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా.. 19 మంది గాయపడ్డారు. గాయపడినవారిలో ఇద్దరి పరిస్థితి విషయంగా ఉందని చెబుతున్నారు. మెక్సికన్ నౌక తూర్పు నది గుండా వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదం జరిగిన సమయంలో ఓడలో సుమారు 277 మంది ఉన్నారని చెబుతున్నారు.

ఈ సందర్భంగా స్పందించిన న్యూయార్క్ మేయర్ ఎరిక్ ఆడమ్స్... ఈ ఘటనలో ఇద్దరు మరణించగా, 19 మంది గాయపడ్డారని, వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా స్పందించిన మెక్సికన్ నేవీ... సుమారు 297 అడుగుల పొడవు, 40 అడుగుల వెడల్పు గల అకాడమీ శిక్షణ నైక కువాటెమోక్ ఈ ప్రమాదంలో దెబ్బతిందని తెలిపింది!ఇదే సమయంలో.. ఈ నౌక ప్రతీ సంవత్సరం మిలటరీ స్కూల్ శిక్షణ పూర్తి చేయడానికి బయలుదేరుతుందని చెబుతున్నారు. దీని తాజాగా.. ఏప్రిల్ 6న ఈ నౌక మొదలవ్వగా.. అక్కడ నుంచి కింగ్ స్టన్ (జమైకా), హవానా (క్యూబా), కోజుమెల్ (మెక్సికో), న్యూయార్క్ (అమెరికా) సహా 15 దేశాల్లోని 22 ఓడరేవులను సందర్శించాలని షెడ్యూల్ చేసుకుంది!


# అమెరికాను వణికించిన టోర్నడో.. 27 మంది మృతి.. కర్ఫ్యూ విధించిన అధికారులు!



**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికా మధ్య-పశ్చిమ ప్రాంతాన్ని ఒక భయంకరమైన తుఫాను అతలాకుతలం చేసింది. ఈ బీభత్సంలో ఇప్పటివరకు కనీసం 27 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరిలో కెంటకీలో సంభవించిన పెనుగాలుల కారణంగా మరణించిన తొమ్మిది మంది కూడా ఉన్నారు. శుక్రవారం రాత్రి లారెల్ కౌంటీలో వచ్చిన టోర్నడో కారణంగా చాలా మంది తీవ్రంగా గాయపడ్డారని కెంటకీ అధికారులు తెలిపారు. లారెల్ కౌంటీ షెరీఫ్ జాన్ రూట్ కార్యాలయం సోషల్ మీడియాలో ఒక ప్రకటన విడుదల చేస్తూ, ప్రాణాలతో బయటపడిన వారి కోసం ప్రభావిత ప్రాంతంలో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపింది.ఇదిలా ఉండగా మిస్సోరీలో ఏడుగురు మరణించారు. అధికారులు ఇంటింటికి వెళ్లి చిక్కుకున్న లేదా గాయపడిన వారి కోసం వెతుకుతున్నారు. మిస్సోరీలో కనీసం ఒక టోర్నడోతో సహా అనేక తుఫానులు సంభవించాయి. ఈ తుఫానులు శుక్రవారం వచ్చిన భీకరమైన వాతావరణ వ్యవస్థలో భాగం, దీని కారణంగా విస్కాన్సిన్‌లో టోర్నడో వచ్చింది. గ్రేట్ లేక్స్ ప్రాంతంలో లక్షలాది మంది వినియోగదారులు విద్యుత్ లేకుండా ఉండాల్సి వచ్చింది. టెక్సాస్‌లో తీవ్రమైన వేడి గాలులు వీచాయి.

తుఫాను కారణంగా భవనాలు ధ్వంసమయ్యాయి. చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. అధికారులు స్థానికులను సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని విజ్ఞప్తి చేశారు. సెయింట్ లూయిస్ మేయర్ కారా స్పెన్సర్ మాట్లాడుతూ.. ఈ విపత్తు కారణంగా 5,000 కంటే ఎక్కువ ఇళ్లు దెబ్బతిన్నాయని తెలిపారు.అనేక ప్రాంతాల్లో కర్ఫ్యూ విధించారు. పరిస్థితి నిజంగా వినాశకరమని స్పెన్సర్ అన్నారు. నగరంలో అత్యవసర పరిస్థితిని ప్రకటించే ప్రక్రియ కొనసాగుతోందని, అత్యధిక నష్టం జరిగిన ప్రాంతాల్లో కర్ఫ్యూ విధించామని ఆమె తెలిపారు. వాతావరణ శాఖ ప్రకారం.. సెయింట్ లూయిస్ ప్రాంతంలోని మిస్సోరీలోని క్లేటన్‌లో మధ్యాహ్నం 2:30 నుంచి 2:50 గంటల మధ్య భీకరమైన తుఫాను సంభవించింది.

# ఇస్రో 101వ రాకెట్ ప్రయోగం.. దీనివల్ల ప్రయోజనాలేమిటో తెలుసా?



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఇటీవల పలు సంచలనాలు సృష్టిస్తోన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో తాజాగా 101వ రాకెట్ ను ప్రయోగించింది. ఇందులో భాగంగా.. పీ.ఎస్.ఎల్.వీ – సీ 61 రాకెట్ నింగిలోకి దూసుకెళ్లింది. దీనితో.. ఈఓఎస్-09 (రీశాట్-1బి) ఉపగ్రహాన్ని పీ.ఎస్.ఎల్.వీ. నింగిలోకి తీసుకెళ్లింది. ఈ సమయంలో సాంకేతిక లోపం ఏర్పడింది.అవును... ఇస్రో చేపట్టిన 101వ రాకెట్ ప్రయోగం పీ.ఎస్.ఎల్.వీ – సీ 61 ప్రయోగంలో సాంకేతిక సమస్య ఎదురైంది. భూ పరిశీలనకు చెందిన ఈఓఎస్ – 09 ఉపగ్రహాన్ని నింగిలోకి తీసుకెళ్లిన కాసేపటి తర్వాత పీ.ఎస్.ఎల్.వీ – సీ 61 ప్రోగ్రాంలో సాంకేతిక సమస్య ఎదురైంది. దీంతో.. ఈ ప్రయోగం పూర్తి కాలేదు. దీనిపై ఇస్రో ఛైర్మన్ స్పందించారు.ఈ సందర్భంగా స్పందించిన ఇస్రో ఛైర్మన్ నారాయణన్.. ప్రయోగంలో మూడో దశ తర్వాత రాకెట్ లో సమస్య వచ్చిందని.. విశ్లేషణ తర్వాత పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు. కాగా... ఈ ఈఓఎస్ – 09 ఉపగ్రహం బరువు 1,696.24 కిలోలు కాగా.. దీని జీవితకాలం ఐదేళ్లు.

**దీనివల్ల కలిగే ప్రయోజనాలు!:**

ఈ ఉపగ్రహం అన్ని వాతావరణ పరిస్థితుల్లోనూ భూ ఉపరితల చిత్రాలను అధిక రిజల్యూషన్ తో తీయనుంది. ఈ క్రమంలో... నేషనల్ సెక్యూరిటీ, అటవీ పర్యవేక్షణ, విపత్తు నిర్వహణ, పట్టణ ప్రణాళికతో పాటు వ్యవసాయానికి సంబంధించిన అంశాలను ఇమేజింగ్ చేస్తుంది. 2022లో ప్రయోగించిన ఈఓఎస్-04 ఉపగ్రహానికి ప్రత్యామ్నాయంగా ఈఓఎస్-09ను పంపారు.

# ఏపీ ఫ్యూచర్ లీడర్స్ మీద బీజేపీ ఫోకస్




**హైదరాబాద్ పెన్ పవర్:** ఏపీలో బీజేపీకి ఏమి ఉంది ఎంత వరకూ బలం ఉంది అంటే రాజకీయాల మీద పూర్తి అవగాహన ఉన్న వారికి అన్నీ తెలుసు. బీజేపీ ఇచ్చేది పొత్తులలో నైతిక మద్దతు మాత్రమే. ఇక గ్రౌండ్ లో బీజేపీకి పెద్దగా బలం లేదు, అంతే కాదు సొంతంగా పోటీ చేస్తే డిపాజిట్లు రావు అన్నది కూడా తెలుసు.అయితే కేంద్రంలో బీజేపీ బలంగా ఉంది. ఆ పార్టీని దాటుకుని సమీప భవిష్యత్తులో ముందుకు వెళ్ళేందుకు మరో ఆల్టర్నేటివ్ పార్టీ కూడా జాతీయ స్థాయిలో లేకపోవడం బీజేపీకి వరంగా ఉంది. ఈ నేపథ్యంలో బీజేపీ కేంద్రంలో బలంగా ఉండడమే ఏపీ లాంటి చోట్ల ఆ పార్టీ పొత్తు రాజకీయాలకు రాయబేరాలకు ఎంగతానో ఉపయోగపడుతోంది.మరో వైపు చూస్తే బీజేపీ పొత్తులలోనే ఎపుడూ గెలుస్తూ వస్తోంది. ముఖ్యంగా టీడీపీ ఏర్పాటు అయ్యాక బీజేపీకి అప్పటిదాకా ఉన్న ఓటు బ్యాంక్ అటు టర్న్ అయింది అలా టర్న్ అయిన ఓటు బ్యాంక్ ని బీజేపీ తిరిగి పొందలేకపూఅతోంది. దాంతో టీడీపీతోనే ఉమ్మడి ఏపీలో విభజన ఏపీలో పొత్తు పెట్టుకునే సీట్లూ ఓట్లూ తెచ్చుకుంటోంది.తమాషా ఏంటి అంటే ఏపీలో ఉన్న మూడు ప్రాంతీయ పార్టీలు బీజేపీతో ప్రత్యక్షంగా పరోక్షంగా చెలిమి చేసేందుకు యత్నించడానికి చూడడమే. 2014 నుంచి 2018 దాకా బీజేపీ టీడీపీ ఘట బంధన్ కొనసాగించి. ఇక అదే టైంలో వైసీపీతో కూడా బీజేపీ సాఫ్ట్ కార్నర్ తో ఉంటూ వచ్చింది బహుశా ఇలాంటి అనుమానాలే బీజేపీతో టీడీపీ 2018లో కటీఫ్ ఇవ్వడానికి కారణం అయ్యాయని చెప్పాలి.

ఇక 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చింది. అలా బీజేపీతో పరోక్షంగా వైసీపీ స్నేహంగా ఉందని అంతా అనుకున్నారు ఇక 2024లో చూస్తే జనసేన టీడీపీలతో బీజేపీ చేతులు కలిపి కూటమి ప్రభుత్వంలో చేరింది. ఇక చూస్తే 2019 నుంచి 2024 మధ్యలో బీజేపీ ఏపీ పాలిటిక్స్ లో ఫ్యూచర్ లీడర్స్ గా జగన్ ని పవన్ ని చూసేది. 2020లోనే జనసేనతో పొత్తు పెట్టుకున్న బీజేపీకి ఏపీలో మరో రెండు దశాబ్దాలకు పైగా రాజకీయం చేసే బలమైన రాజకీయ నేతలు యువ నేతలు కావాల్సి వచ్చిందని అంటారు. అలా జగన్ తో ఒక వైపు పవన్ తో మరో వైపు బీజేపీ ఉంటూ వచ్చిందని ప్రచారంలో ఉంది. ఇక 2024లో చూస్తే పవన్ తో పూర్తిగా మిత్రుత్వం ప్రదర్శిస్తూ వస్తున్న బీజేపీ ఇటీవల కాలంలో టీడీపీలో యువ నేత భావి నాయకుడు అయిన లోకేష్ ని కూడా చేరదీయడాన్ని అంతా చూస్తున్నారు. తన వద్దకు కోరి ప్రధాని నరేంద్ర మోడీ పిలిపించుకోవడాన్ని చూసిన వారు అంతా ఏపీలో యూత్ లీడర్స్ మీద బీజేపీ ఫోకస్ చేస్తోంది అని అంటున్నారు.ఇక చూస్తే కనుక లోకేష్ లోని నాయకత్వ లక్షణాలను కూడా గమనిస్తూ వస్తున్న బీజేపీ భవిష్యత్తు రాజకీయ అవసరాల దృష్ట్యానే ఆయనతో కూడా మంచి అనుబంధం పెనవేసుకోవాలని చూస్తోంది అని అంటున్నారు ఇక ఇక్కడ చూస్తే వైసీపీ అధినేత జగన్ మీద బీజేపీ పెద్దల ఆలోచనలు ఏమిటి అన్న చర్చ కూడా సాగుతోంది. ఏపీలో టీడీపీ కానీ జనసేన కానీ వైసీపీతో ఏ విధనా బీజేపీ సాఫ్ట్ కార్నర్ చూపించినా అసలు సహించరు అని అంటారు.అయితే జాతీయ రాజకీయాలలో గండర గండడుగా పేరు గడించిన బీజేపీ ఏపీ రాజకీయాల్లో తనకు ఏది అనుకూలమో చూసుకుని తప్పకుండా చేస్తుందని భావిస్తున్నారు. అయితే జగన్ పాలనలో లిక్కర్ స్కాం జరిగిందని కూటమి ప్రభుత్వం కేసులు నమోదు చేస్తోంది. దీని మీద ఈడీ కూడా చూపు చూస్తోంది. ఈ నేపథ్యంలో జగన్ విషయంలో బీజేపీ కేంద్ర పెద్దల ఆలోచనలు ఏమిటి అన్నవి

తొందరలోనే తెలుస్తాయని అంటున్నారుఏది ఏమైనా చంద్రబాబుని సీనియర్ పొలిటీషియన్ గా భావిస్తున్న బీజేపీ భవిష్యత్తులో తాను బలపడాలీ అంటే ఫ్యూచర్ లీడర్స్ తోనే చెలిమి చేయాలని లెక్క వేసుకుని మరీ కొత్త రాజకీయాలకు తెర తీస్తోంది అని అంటున్నారు. చంద్రబాబు రాజకీయ చాణక్యుడు. ఆయన కనుక రాజకీయ విశ్రాంతిని కోరుకుంటే బీజేపీ తరువాత తరం నేతలతో తనదైన రాజకీయాలను చాలా ఈజీగా పండించుకుంటూ ముందుకు అడుగులు వేస్తుందని అంటున్నారు. మరి బీజేపీ ఆశలు నెరవేరుస్తూ ఆ పార్టీ బంధంలో దీర్ఘ కాలం ప్రయాణం చేసే నమ్మకమైన యువ నేత ఏపీలో ఎవరు అన్నదే చర్చగా ఉంది.

# మాజీ ఎంపీ నందిగం సురేశ్‌పై మరో కేసు.. జైలుకు వెళ్లినా దూకుడు తగ్గ లేదా?

**వైసీపీ నేత, మాజీ ఎంపీ నందిగం సురేశ్‌పై మరో కేసు నమోదైంది.**



**హైదరాబాద్ పెన్ పవర్:** వైసీపీ నేత, మాజీ ఎంపీ నందిగం సురేశ్‌పై మరో కేసు నమోదైంది. రాజధాని పరిధిలోని ఉద్దండరాయునిపాలెం గ్రామంలో టీడీపీ నేత రాజుపై మాజీ ఎంపీ, ఆయన సోదరుడు ప్రభుదాసు కలిసి దాడి చేశారని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మాజీ ఎంపీ చేసిన దాడిలో తీవ్రంగా గాయపడిన బాధితుడిని కుటుంబ సభ్యులు ఆస్పత్రిలో చేర్పించారు. బాధితుడు ప్రస్తుతం మంగళగిరి ఎయిమ్స్ లో చికిత్స పొందుతున్నాడు. వైసీపీలో దళిత నేతగా గుర్తింపు పొందిన నందిగం సురేశ్ 2019-24 మధ్య బాపట్ల ఎంపీగా పనిచేశారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ కు ఆయన అత్యంత సన్నిహితుడిగా చెబుతారు. వైసీపీ అధికారంలో ఉండగా, నందిగం సురేశ్ తిరుగులేని నేతగా చెలామణీ అయ్యారు. రాజధాని అమరావతి పరిధిలో నివసిస్తున్న మాజీ ఎంపీ సురేశ్.. అమరావతి వ్యతిరేక ఉద్యమం నడిపడంలో తెరవెనుక పాత్ర ఉందనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఆయనను రాజధాని రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో రాజధాని పరిధిలోని టీడీపీ నేతతో ఆయన ఘర్షణకు దిగడం చర్చనీయాంశమవుతోంది. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత మాజీ ఎంపీ నందిగం సురేశ్‌పై ప్రభుత్వం కఠిన వైఖరి ప్రదర్శించిందని అంటారు. వైసీపీ హయాంలో నమోదైన ఓ హత్య కేసులో మాజీ ఎంపీని నిందితుడిగా చేర్చి అరెస్టు చేశారు. ఒకే సామాజికవర్గానికి చెందిన రెండు వర్గాలు పరస్పరం దాడి చేసుకోవడం, ఆ ఘటనలో మరియమ్మ అనే మహిళ మరణానికి మాజీ ఎంపీ నందిగం కారణమని ఫిర్యాదుతో ఆయనను అరెస్టు చేసి సుమారు 90 రోజులు జైలులో ఉంచారు. అదేవిధంగా మరికొన్ని కేసులు కూడా నమోదు అవడంతో ఆయన కోర్టు, పోలీసుస్టేషన్ల మధ్యే తిరగాల్సివస్తోందని చెబుతున్నారు.

అదేవిధంగా టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులోనూ మాజీ ఎంపీ నందిగంపై ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం పాత కేసులు అన్నింటిపైనా బెయిల్ తెచ్చుకున్న ఆయన టీడీపీ నేతపై దాడి చేయడంతో ప్రభుత్వం ఎలా స్పందిస్తుందనేది ఉత్కంఠ రేపుతోంది.

# డ్రోన్స్ ఎగుమతి హబ్ గా భారత్... షాకింగ్ గా జాబ్స్, మార్కెట్ లెక్కలు!



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత్ లో డ్రోన్ల పరిశ్రమ వేగంగా విస్తరిస్తోంది. ఈ క్రమంలో స్వదేశీ సాంకేతికపై దృష్టి సారిస్తూ అనేక సంస్థలు ముందుకు వస్తున్నాయి. ఇదే సమయంలో.. డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్ మెంట్ ఆర్గనైజేషన్ (డీ.ఆర్.డీ.ఓ) మానవ రహిత విమానం డ్రోన్లను అభివృద్ధి చేస్తోంది. ఇదే సమయంలో.. మరికొన్ని ప్రముఖ సంస్థలూ ఈ అధునాతన డ్రోన్ల తయారీని చేపడుతున్నాయి. అవును... భారత్ లో డ్రోన్ల పరిశ్రమ వేగంగా విస్తరిస్తోంది. ఇప్పటికే డీ.ఆర్.డీ.ఓ మానవ రహిత విమానం డ్రోన్లను అభివృద్ధి చేస్తోంది.

మరోపక్క అదానీ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్, టాటా అడ్వాన్స్డ్ సిస్టమ్స్, హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ వంటి ప్రముఖ సంస్థలు ఈ అధునాతన డ్రోన్ల తయారీని చేపడుతున్నాయి. వీటిని సరిహద్దులో నిఘా, యుద్ధం కోసం రూపొందిస్తున్నారు! వాస్తవానికి ఇటీవల భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ లో ఇజ్రాయెల్ టెక్నాలజీతో బెంగళూరు స్టార్టప్ తయారు చేసిన స్కై స్ట్రైకర్ ఆత్మాహుతి డ్రోన్లను సైన్యం వినియోగించిన సంగతి తెలిసిందే. ఇదే సమయంలో.. హైదరాబాద్ కు చెందిన మారుత్ డ్రోన్స్ లాంటివి సైన్యానికి అవసరమైన ఔషదాలు, సరుకుల రవాణాకు కీలకంగా పనిచేశాయి. ఈ నేపథ్యంలో ఈ డ్రోన్ల రంగానికి అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ప్రోత్సకాలు అందుతున్నాయి. ఇందులో భాగంగా.. 2024లో ప్రవేశపెట్టిన డ్రోన్ శక్తి పథకం, రక్షణ డ్రోన్ల అభివృద్ధికి నిధులను కేటాయించింది. ఈ సమయంలో స్టార్టప్ లకు రాయితీలు, రీసెర్చ్ కోసం గ్రాంట్లు అందిస్తోంది.ఈ క్రమంలో భారత డ్రోన్ మార్కెట్ విలువ రాబోయే ఐదారేళ్లలో (2030 నాటికి) సుమారు రూ.2 లక్షల కోట్లకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నారు. ఇందులో రక్షణ డ్రోన్లదే అధిక వాటా కాగా... తర్వాత స్థానంలో వ్యవసాయం, విపత్తు నిర్వహణ, లాజిస్టిక్స్ మొదలైన విభాగాల్లోనూ డ్రోన్లకు అధిక గిరాకీ ఉంటోందని అంటున్నారు.

ఈ విధంగా డ్రోన్ల తయారీ రంగం అభివృద్ధి చెంది, భవిష్యత్తులో మన దేశాన్ని డ్రోన్ల ఎగుమతి హబ్ గా మార్చేందుకు దోహదం చేస్తాయని అంటున్నారు. ఈ సందర్భంగా... ఈ రంగంలో వేలాది కొత్త ఉద్యోగాలు వస్తున్నాయి. ప్రధానంగా సాఫ్ట్ వేర్ డెవలప్ మెంట్, తయారీ రంగాల్లో నిపుణులకు అధిక గిరాకీ ఉంటోందని చెబుతున్నారు.

# హైదరాబాద్‌కు తప్పిన పెను ముప్పు.. ఇద్దరు ఉగ్రవాదులు అరెస్టు

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ పోలీసుల అప్రమత్తతతో పెను ముప్పు తప్పింది. హైదరాబాద్లో పేలుళ్లకు కుట్రపన్నిన ఇద్దరు ఉగ్రవాదులను కౌంటర్ ఇంటెలిజెన్స్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. సౌదీ నుంచి ఐసీస్ ఆదేశాలతో నగరంలో విధ్వంసం సృష్టించేందుకు దుండగలు ప్రయత్నించారని పోలీసులు తెలిపారు. మన పోలీసుల అప్రమత్తత కారణంగా హైదరాబాద్ నగరానికి పెను ముప్పు తప్పిందని చెప్పవచ్చు. దుండగుల కుట్రను ఎలా ఛేదించిందీ పోలీసు అధికారులు వెల్లడించారు. సౌదీ నుంచి వచ్చిన ఆదేశాలతో నగరంలో విధ్వంసం సృష్టించేందుకు ఇద్దరు దుండగులు పక్కా ప్లానింగ్ తో నగరంలోకి అడుగు పెట్టారని మన కౌంటర్ ఇంటెలిజెన్స్ కు సమాచారం వచ్చినట్లు చెబుతున్నారు. ఇద్దరు దుండగుల్లో ఒకరు హైదరాబాద్ నగరానికి చెందిన వాడు కాగా, మరొకడు ఏపీలోని విజయనగరానికి చెందిన వాడిగా పోలీసులు గుర్తించారు. దుండగులు ఇద్దరు నగరంలో పేలుళ్లకు ప్లాన్ చేస్తుండటంతో పోలీసులు స్పెషల్ ఆపరేషన్ నిర్వహించారు. దుండగులు సిరాజ్, సమీర్ ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విజయనగరంలో పేలుడు పదార్థాలు కొనుగోలు చేసి హైదరాబాద్ లో డమ్మీ బ్లాస్ట్ కు ఈ ఇద్దరు సిద్ధమయ్యారని పోలీసులు చెబుతున్నారు. దుండగులను అదుపులోకి తీసుకున్న పోలీసులు వారికి ఉగ్ర లింకులు ఎలా ఏర్పడిందీ విచారిస్తున్నారు. నగరంలో పేలుళ్లకు ప్రయత్నించిన వారిద్దరూ తెలుగు వారే కావడంపై ఆందోళన వ్యక్తమవుతోంది.



# మళ్లీ పోరాడి ఓడిన రాజస్థాన్.. ప్లే ఆఫ్స్‌కు చేరువైన పంజాబ్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2025లో కీలక మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ విజయం సాధించింది. రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 10 పరుగుల తేడాతో గెలుపొందింది. 12 మ్యాచ్‌ల్లో ఎనిమిదో విజయం అందుకున్న పంజాబ్ (17 పాయింట్లు) ప్లే ఆఫ్స్‌కు అడుగు దూరంలో నిలిచింది. తొలుత బ్యాటింగ్ చేసిన పంజాబ్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 219 పరుగులు చేసింది. లక్ష్యఛేదనలో రాజస్థాన్ 209/7కు పరిమితమైంది. యశస్వి జైస్వాల్ (50బీ 25 బంతుల్లో 9 ఫోర్లు, 1 సిక్స్), వైభవ్ సూర్యవంశీ (40బీ 15 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్సులు) మరోసారి మెరుపు ఆరంభం ఇచ్చినా రాజస్థాన్‌కు ఓటమి తప్పలేదు. తర్వాత వచ్చిన సంజు శాంసన్ (20బీ 16 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్), రియాన్ పరాగ్ (13బీ 11 బంతుల్లో 1 సిక్స్) దూకుడుగా ఆడలేకపోయారు. ధ్రువ్ జురెల్ (53బీ 31 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సులు) పోరాడినా మిగతా బ్యాటర్ల నుంచి సరైన సహకారం అందలేదు. ఇంపాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన పంజాబ్ స్పిన్నర్ హర్‌ప్రీత్ బ్రార్ కీలక సమయంలో (3/22) వికెట్లు తీసి రాజస్థాన్‌ను దెబ్బకొట్టాడు. యాన్సెన్, ఒమర్జాయ్ రెండేసి వికెట్లు పడగొట్టారు.

**జైస్వాల్, సూర్యవంశీ చెలరేగినా**

యశస్వి జైస్వాల్, సూర్యవంశీ ఇన్నింగ్స్ ఆరంభం నుంచే ఫోర్లు, సిక్సర్లతో పంజాబ్ బౌలర్లపై విరుచుకుపడ్డారు. అర్ష్‌దీప్ వేసిన ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లో జైస్వాల్ వరుసగా నాలుగు ఫోర్లు, ఓ సిక్స్ బాదేసి 22 పరుగులు పిండుకున్నాడు. యాన్సెన్ బౌలింగ్‌లో వైభవ్ రెండు సిక్సర్లు, ఓ సిక్స్ రాబట్టాడు. బార్ట్‌లెట్ బౌలింగ్‌లో జైస్వాల్ మూడు బౌండరీలు బాదడంతో మూడు ఓవర్లకే స్కోరు 50 దాటింది. అర్ష్‌దీప్ వేసిన నాలుగో ఓవర్‌లో సూర్యవంశీ ఒక ఫోర్, రెండు సిక్సులు బాదేశాడు. ఈ క్రమంలో వైభవ్ దూకుడుకు హర్‌ప్రీత్ బ్రార్ చెక్ పెట్టాడు. మరోవైపు, జైస్వాల్ దూకుడు కొనసాగించడంతో 8 ఓవర్లకే స్కోరు 100 దాటింది. 24 బంతుల్లో హాఫ్ సెంచరీ అందుకున్న యశస్వి.. హర్‌ప్రీత్ బౌలింగ్‌లోనే వెనుదిరిగాడు. శాంసన్ కూడా ఎక్కువసేపు క్రీజులో నిలవలేదు. ఈ క్రమంలో జురెల్, పరాగ్ నిలకడగా ఆడటంతో 13 ఓవర్లకు రాజస్థాన్ 143/3 పటిష్ఠస్థితిలో నిలిచింది. కానీ, తర్వాతి ఓవర్‌లోనే పరాగ్‌ను హర్‌ప్రీత్ క్లీన్‌బౌల్డ్ చేశాడు. హెట్‌మయర్ (11బీ 12 బంతుల్లో) నెమ్మదిగా ఆడినా జురెల్ దూకుడు కొనసాగించడంతో రాజస్థాన్ విజయం దిశగా సాగింది. చివరి రెండు ఓవర్లలో విజయ సమీకరణం 30 పరుగులు కాగా.. 19వ ఓవర్‌లో అర్ష్‌దీప్ 8 పరుగులు మాత్రమే ఇచ్చాడు. చివరి ఓవర్‌లో యాన్సెన్ 11 పరుగులే ఇచ్చి రెండు వికెట్లు పడగొట్టడంతో పంజాబ్ గెలిచింది.

టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న పంజాబ్ కింగ్స్.. నేహల్ వధేరా (70బీ 37 బంతుల్లో 5 ఫోర్లు, 5 సిక్సులు),

శశాంక్ సింగ్ (59లిబీ 30 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సులు) అర్ధ శతకాలు బాదడంతో భారీ స్కోరు చేసింది. ప్రభ్‌సిమ్రన్ సింగ్ (21బీ 10 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్), శ్రేయస్ అయ్యర్ (30బీ 25 బంతుల్లో 5 ఫోర్లు), అజ్మతుల్లా ఒమర్జాయ్ (21లిబీ 9 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) ఫర్వాలేదనిపించారు. ప్రియాంశ్ ఆర్య (9), మిచెల్ ఓవెన్ (0) నిరాశపర్చారు. రాజస్థాన్ బౌలర్లలో తుషార్ దేశ్‌పాండే 2, క్వెనా మఫాక, రియాన్ పరాగ్, ఆకాశ్ మధ్వాల్ ఒక్కో వికెట్ పడగొట్టారు.

# ఇంగ్లాండ్ కౌంటీల్లో కోహ్లీ..? విలియమ్సన్ జట్టులో కింగ్



**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ టెస్ట్ క్రికెట్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించి ప్రపంచ క్రికెట్ ను షాకింగ్ కు గురి చేశాడు. కోహ్లీ టెస్ట్ క్రికెట్ కు గుడ్ బై చెప్పిన తర్వాత ఇంగ్లాండ్ కౌంటీల్లో కనిపించే అవకాశం ఉన్నట్టు వార్తలు వస్తున్నాయి. ఇంగ్లాండ్ కౌంటీ జట్టు మిడిలెసెక్స్ విరాట్ తో ఒప్పందం కుదుర్చుకోవడానికి ఆసక్తి చూపుతున్నట్లు ధృవీకరించింది. మే 12న కోహ్లీ టెస్టుల నుంచి రిటైర్మెంట్ ప్రకటించడంతో అతని అద్భుతమైన టెస్ట్ కెరీర్‌కు తెరపడింది. 36 ఏళ్ల కోహ్లీ ఇండియా తరపున 123 టెస్టులు ఆడి 30 సెంచరీలు, 31 అర్ధ సెంచరీలతో సహా 9230 పరుగులు చేశాడు.మే 12న కోహ్లీ భారత టెస్ట్ జట్టు నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించాడు. కానీ అతని ఫస్ట్-క్లాస్ కెరీర్ గురించి ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. మిడిల్‌సెక్స్ క్రికెట్ డైరెక్టర్ అలాన్ కోల్‌మన్ గార్డియన్ మిడిలెసెక్స్ తరపున కౌంటీ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనే అవకాశం గురించి కోహ్లీతో చర్చలు ప్రారంభించాలని కోరుకుంటున్నట్లు తన ఆసక్తిని తెలిపాడు. 2018లో ఇంగ్లాండ్ పర్యటనకు ముందు కోహ్లీ సర్రే తరఫున సంతకం చేసినా మెడ గాయం కారణంగా ఆడలేకపోయాడు. ఒకవేళ కోహ్లీ మిడిలెసెక్స్ తరపున ఆడదానికి అంగీకరిస్తే విలియంసన్ తో పాటు ఒకే జట్టులో చూడొచ్చు.

భారత క్రికెట్ నియంత్రణ మండలి నిబంధనల ప్రకారం.. ప్రస్తుతం అంతర్జాతీయ క్రికెట్ ఆడుతున్న క్రికెటర్లు విదేశీ లీగ్‌లలో పాల్గొనడానికి వీలు లేదు. అయితే ఆ ఫార్మాట్‌లో అంతర్జాతీయ క్రికెట్ నుండి రిటైర్ అయిన తర్వాత వారు ఇంగ్లీష్ కౌంటీ క్రికెట్, ఫస్ట్-క్లాస్ (కౌంటీ ఛాంపియన్‌షిప్), లిస్ట్ ఏ (మెట్రో బ్యాంక్ వన్డే కప్) టోర్నీల్లో ఆడటానికి అనుమతి ఉంది. ఇటీవలే టెస్ట్ ఫార్మాట్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించిన కోహ్లీ ఇంగ్లాండ్ కౌంటీ ఆడేందుకు ఆసక్తి చూపిస్తాడో లేదో చూడాలి. అద్భుతమైన ఫిట్ నెస్ ఉన్న 36 ఏళ్ళ కోహ్లీకి మరో మూడు నుంచి నాలుగేళ్లు ఈజీగా టెస్ట్ క్రికెట్ ఆడతారని భావించారు. కోహ్లీ మాత్రం అందరికీ ఊహించని షాకిస్తూ త్వరగానే టెస్ట్ ఫార్మాట్ కు వీడ్కోలు చెప్పాడు. ఇప్పటికే టీ20 ఫార్మాట్ కు రిటైర్మెంట్ ప్రకటించిన విరాట్.. ఇకపై వన్డేల్లో మాత్రమే కనిపించనున్నాడు. ప్రస్తుతం ఐపీఎల్ ఆడుతూ బిజీగా ఉన్న కోహ్లీ.. ఈ సీజన్ లో 505 పరుగులతో అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్ల లిస్ట్ లో నాలుగో స్థానంలో నిలిచాడు.

# ఐపీఎల్‌లోకి ఎంట్రీ ఇచ్చిన బిగ్ బాష్ హీరో.. 39 బంతుల్లో సెంచరీ చేసిన ఓవెన్ ఎవరు..?




**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2025 లో పంజాబ్ కింగ్స్ ఆదివారం (మే 18) రాజస్థాన్ రాయల్స్ తో జరుగుతున్న మ్యాచ్ లో కీలక మార్పులు చేసింది. మార్కస్ స్టోయినిస్, జోష్ ఇంగ్లిస్ పంజాబ్ జట్టులోకి చేరకపోవడంతో యువ సంచలనం మిచెల్ ఓవెన్ ప్లేయింగ్ 11లో చోటు సంపాదించాడు. గాయపడిన గ్లెన్ మ్యాక్స్ వెల్ స్థానంలో పంజాబ్ కింగ్స్ రీప్లేస్ మెంట్ గా ఆస్ట్రేలియా ఓపెనర్ మిచెల్ ఓవెన్‌ను ఎంపిక చేసుకుంది. పాకిస్తాన్ సూపర్ లీగ్‌లో పెషావర్ జల్మీ తరపున ఆడుతున్న ఈ ఆసీస్ ఓపెనర్ రూ.3 కోట్లకు పీబీకేఎస్‌లో చేరాడు. ఐపీఎల్ లో అవకాశం రావడంతో ఓవెన్ పాకిస్థాన్ సూపర్ లీగ్ వదిలేసుకోనున్నాడు.

**ఎవరీ మిచెల్ ఓవెన్..?**

మిచెల్ ఓవెన్ 2024-25లో బిగ్ బాష్ లీగ్ (బీబీఎల్)లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలిచాడు. హోబర్ట్ హరికేన్స్ తరపున 200 కంటే ఎక్కువ స్ట్రైక్ రేట్‌తో 452 పరుగులు చేశాడు. బిగ్ బాష్ లీగ్ ఫైనల్లో ఓవెన్ కేవలం 42 బంతుల్లో 108 పరుగులు చేసి విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడాడు. అతని ఇన్నింగ్స్ లో 11 సిక్సర్లు, 6 ఫోర్లు ఉన్నాయి. బిగ్ బాష్ చరిత్రలో ఫాస్టెస్ట్ సెంచరీ నమోదు చేసి సంచలనం సృష్టించాడు. ఈ మెగా ఫైనల్లో 39 బంతుల్లో సెంచరీ చేసి పాకిస్థాన్ సూపర్ లీగ్ లో.. ఆ తర్వాత ఇండియన్ ప్రీమియర్ లీగ్ కు ఎంపికయ్యాడు. భారీ అంచనాలతో బరిలోకి దిగిన మిచెల్ ఓవెన్ తన తొలి మ్యాచ్ లో డకౌటయ్యాడు. ఆడిన రెండో బంతికే మఫాకా బౌలింగ్ లో సంజు శాంసన్ కు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. జైపూర్ లోని సవాయ్ మాన్సింగ్ స్టేడియంలో ప్రారంభమైన ఈ మ్యాచ్ లో పంజాబ్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. తొలి నాలుగు ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 43 పరుగులు చేసింది. ఆర్య (9), ఓవెన్ (0), ప్రబ్ సిమ్రాన్ సింగ్ (21) విఫలమయ్యారు.

# బాలీవుడ్ మేకర్స్ దృష్టిని ఆకర్షిస్తున్న డ్రాగన్ బ్యూటీ..?

మేఘా శుక్లా ఆరాధ్య డ్రెస్ లుక్ లో నెయిల్స్ వేసింది



ఒక్క సినిమా హీరోయిన్ ఫేట్ మార్చేస్తుంది అని చాలా మంది కథానాయికల కెరీర్ లో ప్రూవ్ అయ్యింది. ఇప్పుడు అదే తరహాలో ఒక హీరోయిన్ ని ఓవర్ నైట్ స్టార్ ని చేసింది. అంతకుముందు నుంచి సినిమాలు చేస్తున్నా కూడా ఒక సినిమాలో అది కూడా ఆమె చేసిన సెకండ్ హీరోయిన్ రోల్ తో సూపర్ పాపులర్ అయ్యింది. ఇంతకీ ఎవరా హీరోయిన్ అంటే డ్రాగన్ బ్యూటీ కయదు లోహర్ అని తెలుస్తుంది. కోలీవుడ్ లో పలు సినిమాల్లో నటించిన అమ్మడు శ్రీవిష్ణు చేసిన అల్లూరి సినిమాలో హీరోయిన్ గా చేసింది.ఐతే అప్పుడు అసలేమాత్రం జనాల దృష్టిలో పడని కయదు రీసెంట్ గా ప్రదీప్ రంగనాథ్ చేసిన డ్రాగన్ సినిమాతో అదరగొట్టేసింది. సినిమాలో ప్రదీప్ ఫస్ట్ హాఫ్ అనుపమని లవ్ చేస్తాడు సెకండ్ హాఫ్ లో కయదుతో పెళ్లికి రెడీ అవుతాడు. డ్రాగన్ సినిమాలో కయదు ఎంట్రీ మామూలుగానే అనిపించినా సినిమా నడుస్తున్నా కొద్దీ ఆమె నచ్చేస్తుంది. ఒకదశలో కయదుతో ప్రేమలో పడేలా చేస్తుంది. ఇక అమ్మడి గ్లామర్ షోకి కూడా కుర్రాళ్లు ఫిదా అయిపోయారు. సో అలా కయదు లోహర్ డ్రాగన్ సినిమాతో సూపర్ క్రేజ్ తెచ్చుకుంది. ఆ సినిమా రిలీజ్ తర్వాత ఆమె సోషల్ మీడియా ఫాలోవర్స్ కూడా బీభత్సంగా పెరిగారు. మరోపక్క కయదు లోహర్ తెలుగులో విశ్వక్ సేన్ సరసన ఫంకీ సినిమాలో ఛాన్స్ అందుకుంది. ఆ సినిమాతో అమ్మడు మరోసారి తెలుగు ఆడియన్స్ ముందుకు వస్తుంది. ఐతే సౌత్ ఆడియన్స్ ని ఎప్పటికప్పుడు వాచ్ చేస్తున్న ముంబై మేకర్స్ కయదు మీద ఉన్న ఈ బజ్ చూసి ఆమెని అక్కడ సినిమాల్లోకి తీసుకునే ప్రయత్నాలు చేస్తున్నారట. ఓ విధంగా ఇది గొప్ప విషయమని చెప్పొచ్చు.డ్రాగన్ సినిమాతో కయదు నిజంగానే తన సత్తా చాటి అదరగొట్టే ఛాన్స్ లు అందుకుంటుంది. అమ్మడు ఇటు సౌత్ తో పాటు బాలీవుడ్ లో కూడా ఛాన్స్ అందుకుంటే మాత్రం అక్కడ ఆడియన్స్ ని కూడా తన బుట్టలో వేసుకునే ప్రయత్నం చేస్తుందని చెప్పొచ్చు. నిజంగానే కయదు బాలీవుడ్ షిఫ్ట్ అయితే మాత్రం అక్కడే టాప్ రేంజ్ కి వెళ్లే ఛాన్స్ లు ఉన్నాయని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు.



భీకరమైన ట్విస్ట్‌తో కూడిన శ్రీముఖి ఎత్నిక్ లుక్ టోటల్ విన్



On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, H.NO: 38-4-216, Maharani street, Marripalem, Visakhapatnam, Andhrapradesh-530018, Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS, H.NO: 38-4-216, Maharani street, Marripalem, Visakhapatnam, Andhrapradesh-530018, And Published at Flat No: F5 C/o M.Ramesh kumar,1st Floor, Prasanthi Appt,Sriram Nagar, Station Road, Bhanugudi, Kakinda, East Godavari -533003, Andhra Pradesh, Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2017/73154, e-mail:penpower9@gmail.com